

రైజ్ కళాశాల వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ రంగనాథ్

నేడు గ్రూప్-2 పరీక్షలు

- 49 కేంద్రాలు, 21,565 మంది అభ్యర్థులు
- ఒంగోలులో అత్యధికంగా 28 సెంటర్లు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్)/ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 24 : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-2 పరీక్షలు ఆదివారం జరగనున్నాయి. అందుకు సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. జిల్లాలో 21,565 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనుండగా వారికోసం 49 కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాలను 15 రూట్లుగా విభజించి జిల్లా అధికారులను రూట్ ఆఫీసర్లుగా నియమించారు. పరీక్షలు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ జరుగుతాయి. అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఒంగోలులో అత్యధికంగా 28 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్కాపురంలో తొమ్మిది, టంగుటూరులో ఐదు, ఎస్ఎన్‌పాడులో నాలుగు, సింగరాయకొండలో రెండు, చీమకుర్తిలో ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దార్లను పర్యవేక్షణ అధికారులుగా నియమించారు. ప్రశ్నపత్రాలు తీసుకున్న దగ్గర నుంచి పరీక్ష అనంతరం జవాబు పత్రాలు ఇచ్చేంతవరకు చీఫ్ సూపరింటెండెంట్లకు బాధ్యత అప్పగించారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, సీటింగ్‌తోపాటు తాగునీటి సదుపాయాలు కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులు వారి నంబర్లను చూసుకునేందుకు డిస్‌ప్లే బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ : ఎస్పీ

గ్రూప్-2 పరీక్షలు జరిగే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి తెలిపారు. అన్నిచోట్లా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు చోటుచేసుకున్నా డయల్ 100, 112, పోలీసు వాట్సాప్ నంబరు : 91211 02266కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.



ఒంగోలులోని టీడీపీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్లు



పామూరు మండలం చెంచిరెడ్డిపల్లిలో ఉగ్ర ఫొటోలను చూపుతూ హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

విధేయతకు పట్టం

నిరంతర ప్రజాసంబంధాలే గీటురాయి

కష్టకాలంలో పార్టీకి అండగా..

తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపికలో పార్టీ పట్ల విధేయత, నిరంతర ప్రజాసంబంధాలే గీటురాయిగా తీసుకుంది. పార్టీ ప్రకటించిన తొలి జాబితాలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో స్థానం పొందిన ఏడుగురు అభ్యర్థులు ఆ కోవకు చెందినవారే. వారి పట్ల అంతటా సమ్మతం వ్యక్తమైంది. పార్టీశ్రేణులు, ప్రజలు, రాజకీయ పరిశీలకుల నుంచి చిన్నపాటి విమర్శ కూడా రాకపోవడం అందుకు తార్కాణం. ముందు నుంచి అందరూ ఊహించినట్లే ఎమ్మెల్యేలు గొట్టిపాటి, ఏలూరి, డోలా సిటింగ్ స్థానాల నుంచి పోటీచేస్తారని వెల్లడించింది. అలాగే మాజీ ఎమ్మెల్యేలు దామచర్ల, ఉగ్ర, బీఎన్, ఇన్‌చార్జి ఎరిక్షన్‌లకు కూడా తొలి జాబితాలోనే టికెట్లను ఖరారు చేసింది. జనసేనతో ఉన్న పొత్తు, బీజేపీ కూడా కలిసే అవకాశం ఉండటం, ఎంపీ అభ్యర్థుల ఎంపిక ఇంకా ఒక కొలిక్కిరాకపోవడం వలన మరికొన్ని స్థానాలకు అభ్యర్థులను వెల్లడించలేదు.















- అందరిదీ ఒకే మాట.. ఒకే బాట
- ఏడుగురు అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ
- ముగ్గురు ఎమ్మెల్యేలు, నలుగురు ఇన్‌చార్జులకు ఓకే
- ఎక్కడా కనిపించని అసంతృప్తులు
- భేష్ అంటూ అంతటా సంబరాలు
- బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్న శ్రేణులు
- రెండో జాబితాలో మిగిలిన వారికి సీట్లు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

వచ్చే ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే అధికార వైసీపీ ఉమ్మడి జిల్లాలో దాదాపు అన్ని స్థానాలకు ఇన్‌చార్జిల పేరుతో అభ్యర్థులను ఖరారుచేసింది. తెలుగుదేశం పార్టీ ఈ విషయంలో ఎప్పటిలాగే వెనుకబడిపోతుందన్న భావన ఇప్పటివరకు నెలకొంది. అయితే అనూహ్యంగా శనివారం టీడీపీ, జనసేన కూటమి అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఒకేసారి 99మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. అందులో జిల్లాలో టీడీపీ ఏడుగురు అభ్యర్థులను ప్రకటించింది. జనసేనకు కేటాయించారనుకుంటున్న దర్శి అభ్యర్థి ఎంపికను పూర్తిచేయలేదు. అయితే ముందు నుంచి అనుకుంటున్న ప్రకారమే టీడీపీలో చురుకైన పాత్ర పోషిస్తున్న వారికి తొలిజాబితాలో అవకాశం లభించింది. ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా ఉన్న డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి (కొండపి), గొట్టిపాటి రవికుమార్ (అద్దంకి), ఏలూరి సాంబశివరావు (పర్చూరు)లకు అక్కడే టికెట్లు కేటాయించింది. అలాగే ఒంగోలు నుంచి దామచర్ల జనార్దన్, కనిగిరి నుంచి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి. సంతనూతలపాడుకు బీఎన్.విజయ్‌కుమార్, ఎర్రగొండపాలెంకు ఎరిక్షన్‌బాబులను అభ్యర్థులుగా టీడీపీ ప్రకటించింది.

రెండో జాబితాలో మిగతావి..

ఎస్ఎన్‌పాడు ఇన్‌చార్జి విజయ్‌కుమార్ విషయంలో ఒకదశలో అధిష్ఠానం వెనకడుగు వేసింది. ఆయన సోదరుడికి ఏలూరు జిల్లాలో టికెట్ ఇవ్వాల్సి వస్తే ఇద్దరికీ కల్పించలేమన్న ఉద్దేశంతో పెండింగ్‌లో పెట్టింది. అయితే ఉమ్మడి జిల్లా నేతలు ఈ తరుణంలో విజయ్‌కుమార్‌కు అండగా నిలిచారు. జాబితా ప్రకటనకు ముందు శనివారం చంద్రబాబు ఇంట్లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రవికుమార్ కూడా విజయ్‌కుమార్ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు తెలిసింది. దీంతో అన్నదమ్ములు అనే విషయాన్ని పక్కనపెట్టి విజయ్‌కుమార్‌కు అవకాశమిచ్చారు. మిగిలిన ఆరుగురి ఎంపికలో ఎలాంటి చర్చలు, సమీక్షలు లేకుండానే చంద్రబాబు ఎంపికచేశారు. ఇకపోతే మరో ఐదు నియోజకవర్గాల అభ్యర్థులను మాత్రమే టీడీపీ ప్రకటించాల్సి ఉంది. అందులో ఒక స్థానాన్ని మిత్రపక్షమైన జనసేనకు కేటాయించగా మిగిలిన నాలుగు స్థానాల్లో గిద్దలూరు నుంచి అశోక్‌రెడ్డి పేరు ప్రకటించాలని ముందుగా అనుకున్నప్పటికీ కొన్ని కారణాలతో రెండో జాబితాకు మార్చినట్లు తెలిసింది.

గొట్టిపాటి రవికుమార్

ఇప్పటికి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన రవికుమార్ 2017లో టీడీపీలో చేరారు. ఆయనతోపాటు చేరిన ఎమ్మెల్యేల్లో గత ఎన్నికల్లో గెలుపొందింది రవి ఒక్కరే. ఆతర్వాత జగన్ ప్రభుత్వం ఆయన మీద తీవ్రంగా దాడిచేసింది. గ్రానైట్ ఫ్యాక్టరీలు, క్వారీలను మూసివేయించింది. వైసీపీలో చేరితేనే చేయూత ఇస్తామని కబురుపంపింది. అయినా బెదరకుండా టీడీపీకి అండగా నిలిచారు. దీంతో ఆర్థికంగా భారీగా నష్టపోయారు. అన్నింటికీ మించి జిల్లాలో పార్టీ నాయకులను ఐక్యంగా ముందుకు నడపడంలో తన వంతు పాత్ర పోషించారు. టీడీపీ కీలక నేతల్లో ఒకరుగా మారారు. తదనుగుణంగా ఊహించినట్లే తొలి జాబితాలో తిరిగి టికెట్ పొందారు.

ఏలూరి సాంబశివరావు

గత ఎన్నికల్లో రెండో పర్యాయం ప్రతిష్ఠాత్మక విజయం సాధించిన సాంబశివరావును లొంగదీసుకునేందుకు జగన్ ప్రభుత్వం అనేక చర్యలకు పాల్పడింది. వ్యాపారపరంగా ఇబ్బందులు పెట్టడమే కాకుండా అక్రమ కేసులను బనాయించింది. ఓట్ల తొలగింపులో అక్రమాలకు పాల్పడింది. వీటన్నింటినీ దీటుగా ఎదుర్కోవడంతోపాటు పార్టీ కష్టకాలంలో బాపట్ల లోక్‌సభ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి అందరినీ సమన్వయంగా ముందుకు నడిపారు. ఇక నియోజకవర్గంలో ప్రజాసంబంధాలు కొనసాగించడంలో ఆయనకు ఆయనే సాటి. అవే కలిసొచ్చాయి.

డీఎస్‌బీవీ స్వామి

కొండపి ఎమ్మెల్యేగా గత ఎన్నికల్లో రెండోసారి గెలుపొందిన స్వామిని నియోజకవర్గంలో తిరగకుండా చేయాలన్న కసితో వైసీపీ ప్రభుత్వం వెంటాడింది. అసెంబ్లీలో సీఎం సాక్షిగా వైసీపీ ఎమ్మెల్యేలు దాడి చేసినా బెదరకుండా జగన్ అకృత్యాలపై పోరాటం సాగించారు. ఇంటిపైకి వచ్చి బెదిరించి లొంగదీసుకోవాలని వైసీపీ చేసిన భయానక పరిస్థితులను తట్టుకుని నిలబడ్డారు. ప్రజాసంబంధాల కొనసాగింపులో దిట్టగానే ఉన్నారు. అవే మళ్లీ టికెట్ లభించేందుకు దోహదపడ్డాయి.

దామచర్ల జనార్దన్

గత ఎన్నికల్లో ఓటమి చెందినా పార్టీ పట్ల, చంద్రబాబు నాయకత్వం పట్ల విధేయుడిగా ఉండటంలో దామచర్ల జనార్దన్ అగ్రభాగంలో ఉన్నారు. గతంలో అధికారంలో లేనప్పుడు కూడా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలను నిర్వహించి మన్ననలు పొందారు. ఒంగోలులో జగన్‌కు దగ్గరి బంధువైన బలమైన నాయకుడిగా ఉన్న బాలినేనిని ఎదుర్కొనే విషయంలో గట్టిగా నిలబడి అధిష్ఠానం మెప్పు పొందారు. తదనుగుణంగా ఆయనకు తొలి జాబితాలోనే తిరిగి అధిష్ఠానం టికెట్ ఖరారుచేసింది.

డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

గత ఎన్నికల సమయంలో చివర్లో పార్టీలో చేర్చుకుని టికెట్ ఇవ్వడంతో పోటీలోకి దిగి ఓడిపోయినా నిరంతరం కనిగిరి ప్రజలను కనిపెట్టుకుని ఉండటం ఉగ్రకు కలిసొచ్చింది. కనిగిరిలో అన్నా క్యాంటీన్ నిర్వహణ, పార్టీ ఆఫీసు నిర్మాణం, దాని నిర్వహణలో చంద్రబాబు, లోకేష్‌ల మన్ననలు పొందారు. ప్రజాసంబంధాలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణలో అనేక సందర్భాలలో అగ్రస్థానంలో నిలిచారు. ఆ నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు డాక్టరు ఉగ్ర సమక్షంలో పోలోమని టీడీపీలో చేరడం కూడా ఆయనకు కలిసొచ్చింది.

గూడూరి ఎరిక్షన్‌బాబు

వైసీపీకి పెట్టని కోటగా పేరొందిన ఎర్రగొండపాలెం నియోజకవర్గానికి వెళ్లి పనిచేసేందుకు ఎవరూ సిద్ధపడని రోజుల్లో ఎరిక్షన్‌బాబు అక్కడికెళ్లారు. దళితులను టీడీపీ వైపు ఆకర్షించడంలో కీలకపాత్ర పోషించారు. ఇన్‌చార్జిగా నియమించిన తర్వాత ప్రజాసంబంధాలు కొనసాగించడంతోపాటు పార్టీ కార్యక్రమాల నిర్వహణలో రాష్ట్రంలో తొలి ఐదింటిలో ఒకటిగా ఆ నియోజకవర్గాన్ని నిలిపారు. అదే ఆయనకు బాబు, లోకేష్‌ల దగ్గర మంచి గుర్తింపునకు కారణమయ్యాయి.

బీఎన్ విజయ్‌కుమార్

ఎస్ఎన్‌పాడు మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ నాయకత్వం పట్ల విధేయత, పార్టీపట్ల విశ్వాసంతో పనిచేశారు. గతంలో ఉన్న పరిచయాలతో వైసీపీ నుంచి ఎన్ని ఆహ్వానాలు వచ్చినా తొణకకుండా టీడీపీలో కొనసాగారు. తనను వ్యతిరేకించే పార్టీశ్రేణులను కూడా కలుపుకుపోవడంలో సక్సెస్ అయ్యారు. నియోజకవర్గంలో ఊరూవాడా ప్రజాసంబంధాలను కొనసాగించడం ఆయనకు కలిసొచ్చింది.

'పది'కి క్యూఆర్ కోడ్ ప్రశ్నపత్రాలు

- లీకేజీ, మాల్‌ప్రాక్టీస్ నివారణకు దోహదం

ఒంగోలు (విద్య), ఫిబ్రవరి 24 : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులకు అత్యంత సాంకేతికతతో కూడుకున్న ప్రశ్నపత్రాలను తయారుచేశారు. ఈ ఏడాది నుంచి ఈ కొత్త క్వశ్చన్ పేపర్లు ఉపయోగిస్తున్నారు. పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్, లీకేజీలను నివారించేందుకు ఈ విధానం దోహదపడుతుంది. ఒకవేళ పేపరు లీకైతే దాని కచ్చితమైన మూలాన్ని కనుగొనేందుకు అన్ని పేపర్లకు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ అందించనున్నారు. దీని వలన అది బయటకు వస్తే ఏ జిల్లా, ఏ మండలం, ఏ కేంద్రం, ఏ పరీక్షా హాలు అన్నదానితోపాటు విద్యార్థిని కూడా నిమిషాల్లో గుర్తించవచ్చు. ఈ క్యూఆర్ కోడ్ ప్రశ్నపత్రాలతో సులభంగా లీకేజీని అరికట్టవచ్చని ప్రభుత్వ పరీక్షల బోర్డు భావిస్తోంది.

విద్యార్థులకు ఉచిత ప్రయాణం

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను కండక్టర్లకు చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చు. అదేవిధంగా పరీక్ష ముగిసిన తర్వాత కూడా విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగానే ఇళ్లకు చేరవచ్చు. పరీక్షా కేంద్రాలు ఉన్న ప్రాంతాలకు గ్రామాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను కూడా నడపనుంది.

నిమిషం లేటైనా నో ఎంట్రీ

- పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు
- నిఘా నేత్రాల నీడలోనే అంతా
- ఆర్ఐవో సైమన్ విక్టర్

ఒంగోలు (విద్య), ఫిబ్రవరి 24 : జిల్లాలో మార్చి 1వతేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎ.సైమన్ విక్టర్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఏకేవీకే కళాశాలలో శనివారం పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్, స్క్వాడ్, ఇతర అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత నిమిషం లేటుగా వచ్చినా విద్యార్థులను లోపలికి రానివ్వొద్దని స్పష్టం చేశారు. కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు నిషేధమన్నారు. పరీక్షల్లో ఏమైనా పొరపాట్లు జరిగితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

44,733 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు





సమావేశానికి హాజరైన చీఫ్ సూపరింటెండెంట్‌లు, స్క్వాడ్, ఇతర అధికారులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఆర్ఐవో సైమన్ విక్టర్

మొత్తం 44,733 మంది విద్యార్థులు హాజరుకానున్నారని సైమన్ విక్టర్ తెలిపారు. వారిలో 21,570 మంది ప్రథమ, 23,163 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారన్నారు. వారికోసం 69 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో కంభం, పెద్దదోర్నాల, అర్థవీడు, వైపాలెం, గిద్దలూరులోని పరీక్ష కేంద్రాలను సున్నితమైనవిగా గుర్తించామన్నారు. వీటిపై ప్రత్యేక దృష్టిసారించినట్లు చెప్పారు. పరీక్ష ఫీజు చెల్లించిన వారందరికీ కళాశాలలు హాల్ టికెట్లు జారీచేయాలని ఆయన ఆదేశించారు. ట్యూషన్ ఫీజు చెల్లించలేదనే కారణంతో ఎవరైనా హాల్‌టికెట్లు నిరాకరిస్తే ఆ కళాశాల గుర్తింపు రద్దుచేస్తామని హెచ్చరించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఐఈవో శ్రీనివాసరావు, డీఈసీ సభ్యులు కె.ఆంజనేయులు, కె.స్వరూపరాణి, జి.మనోహర్‌రెడ్డి, సిహెచ్.తారారాణి తదితరులు పాల్గొన్నారు.

అటు ఆగ్రహం.. ఇటు అసహనం

- కౌన్సిల్‌లో అజెండా కాపీలను చించేసిన టీడీపీ కార్పొరేటర్లు
- సీఎం సభలో అవమానించారన్న వైసీపీ కార్పొరేటర్లు
- తనకు స్వీపర్ పాస్ ఇచ్చారని వాపోయిన మేయర్



తనకు ఇచ్చిన స్వీపర్ల డ్యూటీ పాస్‌ను చూపుతున్న వైసీపీ కార్పొరేటర్ గోపి

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 24 : ఒకవైపు హడావుడిగా అయిపోయిన పనులకు ఆమోదం తెలపడమేమిటంటూ ప్రతిపక్ష కార్పొరేటర్లు పోడియం చుట్టుముట్టి ఆగ్రహం వ్యక్తం చేయగా, మరోవైపు శుక్రవారం ఎన్.అగ్రహారంలో జరిగిన సీఎం సభలో తమకు ఘోర అవమానం జరిగిందని వైసీపీ కార్పొరేటర్లు వాపోయారు. పలు అభివృద్ధి అంశాలపై మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్పొరేషన్ కౌన్సిల్ అత్యవసర సమావేశం వాడీవేడిగా సాగింది. టెండర్ ఖరారు కాకముందే రూ.22 కోట్లతో చేపట్టిన పనులకు అధికార వైసీపీ కార్పొరేటర్లు ఆమోదం తెలిపారు. ఇప్పటికే కొనసాగుతున్న పనులకు ముందస్తు అనుమతులు (ర్యాటిఫికేషన్) పేరుతో హడావుడిగా కౌన్సిల్ అజెండాలో పొందుపరిచారు. దీంతోపాటు మరికొన్ని అభివృద్ధి పనులకు ఆమోదం కోసం మొత్తం 26 అంశాలను అజెండాలో చేర్చగా టీడీపీ, జనసేన కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. దీంతో వాడీవేడిగా చర్చ జరగడంతో ప్రతిపక్ష కార్పొరేటర్లు అజెండా కాపీలను చించివేశారు. మొత్తంగా సమావేశం రసాభాసగా సాగింది. ఇదే సమయంలో శుక్రవారం జరిగిన సీఎం సభకు వెళ్లేందుకు కార్పొరేటర్లకు స్వీపర్లకు ఇచ్చే డ్యూటీ పాస్‌లు ఇచ్చారని వైసీపీ కార్పొరేటర్ చింతపల్లి గోపితోపాటు మరికొందరు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇది అధికార పార్టీ కార్పొరేటర్లుగా తమకు తీరని అవమానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సమావేశంలో చర్చకు తీసుకురాగా, వైసీపీ కార్పొరేటర్లందరూ తమకు జరిగిన అవమానంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అయితే ఇదే విషయమై మేయర్ మాట్లాడుతూ మీ సంగతి అలా ఉంచితే నగర ప్రథమ మహిళ, మేయర్ అయిన తనకు కూడా స్వీపర్‌కు ఇచ్చే డ్యూటీ పాస్‌నే ఇచ్చారని, తన బాధ ఎవరికి చెప్పుకోవాలని సమావేశంలో వాపోవడం విశేషం.





అజెండా కాపీలను చించివేస్తున్న టీడీపీ కార్పొరేటర్‌లు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న మేయర్ సుజాత



తెలుగుతమ్ముళ్ల సంబరాలు !

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా దామచర్ల, ఎస్ఎన్‌పాడుకు విజయ్‌కుమార్, కొండపికి స్వామి ● ప్రకటించిన పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ● శ్రేణుల్లో ఆనందోత్సాహాలు


టీడీపీ కార్యాలయం వద్ద అభివాదం చేస్తున్న నాయకులు


బీఎన్‌కు శుభాకాంక్షలు చెబుతున్న జనసేన ఇన్‌చార్జి కందుకూరి బాబు తదితరులు

ఒంగోలులో బాణసంచా కాల్చిన శ్రేణులు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 24 : తెలుగుదేశం పార్టీ ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్‌ను అధిష్ఠానం ఖరారు చేయడంపై ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. శనివారం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సమావేశం అనంతరం ప్రకించిన జాబితాలో ఒంగోలు అభ్యర్థిగా దామచర్ల పేరు ప్రకటించడంతో స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద, అద్దంకి బస్టాండ్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద భారీగా బాణసంచా కాల్చి సంతోషాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధినేతగా ప్రజల మనసులో స్థానం పొందిన దామచర్లకు ఈ ఏడాది జరిగే ఎన్నికల్లో ఒంగోలు నుంచి సీటును కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. తమ నాయకుడు జనార్దన్ గెలుపు కోసం తామంతా కష్టపడి పనిచేస్తామని వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి అండగా ఉన్నారని, సైకో పాలనకు శాశ్వతంగా ముగింపు పలికే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు, కొఠారి నాగేశ్వరరావు, మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, బొల్లినేని వాసుకృష్ణ, శశికాంత్ భూషణ్, ఆర్ల వెంకటరత్నం, టి.అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

దామచర్ల జనార్దన్ ప్రొఫైల్

పేరు : దామచర్ల జనార్దన్‌రావు (49)
పుట్టిన తేది : 20-1-1975
భార్య : నాగసత్యలత
కుమార్తెలు : అనూషలక్ష్మి, తనూజలక్ష్మి
స్వగ్రామం : తూర్పు నాయుడుపాలెం గ్రామం, టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా

విద్యార్హతలు :
10వ తరగతి (విజ్ఞాన్ పబ్లిక్ స్కూలు, గుంటూరు)
ఇంటర్మీడియట్ : విజ్ఞాన్ జూనియర్ కాలేజి, వడ్లమూడి, గుంటూరు
ఇంజనీరింగ్ : పీఈఎస్‌ఐటీ కాలేజి, బెంగళూరు
ప్రొఫెషన్ : వ్యాపారం, రాజకీయం

రాజకీయ జీవితం :
2009లో కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాజకీయ ప్రవేశం
2010 నుంచి ఉమ్మడిప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షులుగా పనిచేశారు.
2012లో జరిగిన ఉప ఎన్నికల్లో ఒంగోలు నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ
2014లో టీడీపీ నుంచి ఒంగోలు అభ్యర్థిగా గెలుపు
2019 వరకు టీడీపీ ఎమ్మెల్యేగా, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు
2020 నుంచి ఇప్పటి వరకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఉన్నారు.

దళిత వర్గాలకు సముచిత ప్రాధాన్యం : బీఎన్

ఒంగోలు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బడుగ, బలహీనవర్గాల అభ్యున్నతి, వారికి అధిక ప్రాధాన్యత ఇచ్చేది తెలుగుదేశం పార్టీయేనని మాజీ ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. టీడీపీ, జనసేన అభ్యర్థుల తొలిజాబితాలో టీడీపీ తరుపున 18 మంది ఎస్సీ అభ్యర్థులను పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించి దళిత వర్గాలకు సముచిత స్థానం ఇచ్చారన్నారు. ప్రత్యేకించి ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మూడు ఎస్సీ నియోజకవర్గాల్లో అభ్యర్థులను తొలిజాబితాలోనే ప్రకటించడం ద్వారా జిల్లాలో దళిత నేతలకు చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికలలో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ నుంచి బీఎస్.విజయ్‌కుమార్ పేరును తొలి జాబితాలోనే శనివారం పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన టీడీపీ-జనసేన ముఖ్యనేతలు ఒంగోలులోని బీఎన్ కార్యాలయానికి చేరుకొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం దళితులపై దాడులు, అణిచివేత పెరిగిందన్నారు. ఎస్సీలను కేవలం ఓటుబ్యాంకుగా మాత్రమే జగన్ చూస్తూ స్వార్థ రాజకీయాల కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. అనేక మంది వైసీపీలోని దళిత ఎమ్మెల్యేలను రానున్న ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వలేదని, ఇస్తున్న వారిని కూడా నియోజకవర్గాల మార్పులు చేశారన్నారు. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు మాత్రం అందుకు భిన్నంగా నిబద్ధతతో ప్రజల కోసం నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా పనిచేస్తున్న తమకు తొలి జాబితాలోనే టిక్కెట్ ఇచ్చారన్నారు. ఈ వాస్తవాలను సంతనూతలపాడు నియోజకవర్గ ప్రజలంతా గుర్తించి వచ్చే ఎన్నికల్లో తనకు ఎమ్మెల్యేగా గెలిపించాలని, తద్వారా చంద్రబాబు నాయుడును సీఎంను చేసి రాష్ట్రానికి పట్టిన జగన్ పీడను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అందుకోసం టీడీపీ, జనసేన శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నా, లేకపోయినా నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని, వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే మరింత ఎక్కువగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కందుకూరి బాబు, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మన్నం ప్రసాద్, వివిధ మండలాల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, తేళ్ల మనోజ్, గొట్టిపాటి రాఘవరావు, మండవ జయంత్‌బాబు, గొల్లపూడి సుబ్బారావు, నాయకులు కాకర్ల లక్ష్మీవరప్రసాద్, అంకారావు పాల్గొన్నారు.

విజయ్‌కుమార్ ప్రొఫైల్

పేరు: బొమ్మాజీ నిరంజన్ విజయ్‌కుమార్
పుట్టిన తేదీ: 21-09-1967 (56)
తల్లిదండ్రులు: బి.దానం, రిటైర్డ్ ఐఎఎస్, బీహెచ్‌కే.సరోజిని
స్వగ్రామం: పెద్దనల్లకాలువ, కంభం మండలం, ప్రకాశం జిల్లా
విద్యార్హతలు: బీఈ(మెకానికల్), సీబీఐటీ కాలేజీ, హైదరాబాద్, టెన్త్ వరకు రిషిత వ్యాలీ స్కూలు(మదనపల్లి), ఇంటర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూలు
వృత్తి: విద్యా, సామాజిక రంగాలు
రాజకీయ జీవితం: 2009ఎన్నికల్లో సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపు
2014, 2019లలో టీడీపీ నుంచి సంతనూతలపాడులో పోటీ
ప్రస్తుతం: టీడీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, 2024 ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి నుంచి టీడీపీ అభ్యర్థిగా తొలి జాబితాలో ప్రకటన

స్వామికి టికెట్‌తో హర్షాతిరేకాలు


టంగుటూరులో నాయకుల నినాదాలు


కొండపిలో..

టంగుటూరు, ఫిబ్రవరి 24 : కొండపి నుంచి సిటింగ్ ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని తెలుగుదేశం-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. దీంతో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసింది. పలుచోట్ల బాణసంచా కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. పలువురు నాయకులు తూర్పునాయుడుపాలెంలోని ఎమ్మెల్యే గృహానికి చేరుకొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. టంగుటూరు పార్టీ కేడర్ బస్టాండ్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద బాణసంచా కాల్చి సందడి చేసింది.

కొండపి: కొండపి అభ్యర్థిగా ఎమ్మెల్యే స్వామి పేరును టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం మధ్యాహ్నం ప్రకటించిన వెంటనే ఆపార్టీ శ్రేణులు ఆనందంలో మునిగిపోయాయి. కొండపిలోని ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాల వద్ద బాణ సంచా కాల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్ ఖాతాషా, పార్టీ సీనియర్ నాయకుడు చాగంరెడ్డి నరసారెడ్డి, నాయకులు నన్నూరి సుబ్బరామయ్య, ముప్పరాజు శ్రీనివాసరావు, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి నేతి రవికుమార్, తుళ్లూరి బాలచెన్నయ్య, దర్నాశి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విశాఖలో బౌద్ధ మహాసమ్మేళనం


బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 24: బుద్ధిస్ట్‌సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 25న విశాఖపట్నంలోని అంబేడ్కర్ భవనంలో జరిగే 11 బౌద్ధమహాసమ్మేళనంకు ఒంగోలు నుంచి జిల్లాప్రతినిధులు శనివారం బయలుదేరి వెళ్లారు. ఈ మేరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సును టీబీఎస్‌ఐ జిల్లా గౌరవాధ్యక్షుడు కసుకుర్తి వెంకటేశ్వర్లు జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎడ్లూరి నాగేశ్వరరావు, ఇ. మహేష్, కె.శ్రీనివాస్, డి.శ్రీను, వై.సిద్ధార్థ, సీహెచ్.బాబు పాల్గొన్నారు.

రేపు ఒంగోలులో జయహో బీసీ సభ

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 24: ఒంగోలు పార్లమెంట్ స్థాయి జయహో బీసీ సభ ఈనెల 26న ఒంగోలులో జరుగుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఒంగోలులోని బృందావన్ ఫంక్షన్ హాలులో జరిగే కార్యక్రమానికి టీడీపీ బీసీ అనుబంధ సంఘాల నాయకులు, అలాగే బీసీ సోదరులు ప్రతి గ్రామం నుంచి పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

దిశ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

ఒంగోలు(క్రైం) ఫిబ్రవరి24: దిశ డీఎస్పీగా సీహెచ్.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ నుంచి బదిలీపై వచ్చి ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఒంగోలులోని ఎస్పీ పరమేశ్వరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి


మాట్లాడుతున్న ధనుంజయ్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 24 : రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారా మంచి దిగుమతులు సాధించవచ్చని ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ధనుంజయ్ పేర్కొన్నారు. ఒంగోలులోని ఉద్యాన శిక్షణా సంస్థ కార్యాలయంలో శనివారం తీగజాతి కూరగాయల పంట సాగుపై రైతులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇమిడ క్లోప్రిడ్‌తో విత్తనశుద్ధి చేసినట్లు అయితే చాలా వరకు రసం పీల్చే పరుగును తట్టుకుంటుందని తెలిపారు. అధిక నత్రజని ఎరువులు వాడకూడదని, సల్ఫేట్ రూపంలో నత్రజని అందించాలని సూచించారు. ప్రధానంగా టమాటా వంటి కూరగాయలను ట్రీల్లీస్ పద్ధతిలో సాగు చేయాలని పేర్కొన్నారు. జిల్లా ఉద్యాన అధికారి వైగోపిచంద్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆవశ్యకత, రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. సంస్థ ప్రిన్సిపాల్ ఎం.శ్రీలక్ష్మి ఉద్యానశాఖలో చేపట్టే వివిధ పథకాలను వివరించారు. కురిచేడు, కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల అనర్హుల దరఖాస్తుల పునఃపరిశీలన

● డివిజన్ల వారీగా పరిశీలనకు సిబ్బంది నియామకం

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 24 : పేదలకు అందించే ఇళ్ల పట్టాలకు దరఖాస్తు చేసుకుని వివిధ కారణాల చేత అర్హత కోల్పోయిన వారి దరఖాస్తు పునఃపరిశీలనకు కార్పొరేషన్ అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం కమిషనరు ఎం.జశ్వంత్‌రావు, డివిజన్ల వారీగా పరిశీలనకు ప్రత్యేక బృందాలను నియమించారు. ఇప్పటి వరకు 21,402 భరోసా పత్రాలు మంజూరు చేసివుండగా, ఆరు దశలలో పరిశీలన అనంతరం 2497 అనర్హులుగా గుర్తించారు. అయితే దరఖాస్తుల పునః పరిశీలన చేసి మూడు రోజులలో తుది జాబితా సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇంటి స్థలానికి అర్హత కోల్పోయిన లబ్ధిదారులు దరఖాస్తులు వెరిఫికేషన్ చేసుకోవచ్చని తెలిపారు. అయితే ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి పట్టాకు అర్హత కోసం లబ్ధిదారుడు తెల్లరేషన్ కార్డు కలిగివుండాలి. ఒక కార్డుపై ఒక లబ్ధిదారుని ఎంపిక జరుగుతుంది. ఒంగోలు నగర పరిధిలోగాని, మరే ఇతర ప్రాంతాల్లో గాని ఏ విధమైన సొంత ఇల్లు, నివాసేతర స్థలములు, అలాగే లబ్ధిదారులకు పూర్వికుల నుంచి సంక్రమించిన ఆస్తులు పేరుమార్పు కలిగి ఉండకూడదన్నారు. అదేవిధంగా లబ్ధిదారుడు పన్ను రూపంలో, శిస్తురూపంలో చెల్లించి ఉండకూడదు. ప్రభుత్వం వేరొకరికి మంజూరు చేసిన ఖాళీ స్థలం, నివాస గృహం కొనుగోలు చేసి వుండకూడదు. అదేవిధంగా 3 ఎకరాలకు మించి మాగాణి భూమి, లేదా 10 ఎకరాలకు మించి మెట్ట భూమి ఉండకూడదు. ఈ నిబంధనల మేరకు తుదిజాబితా ప్రకటించడం జరుగుతుందని కమిషనరు వెల్లడించారు.

వైసీపీ పాలనలో అంతటా విధ్వంసమే

● బీజేపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్యయాదవ్


మాట్లాడుతున్న యోగయ్యాయాదవ్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 24 : రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక విధ్వంసం తప్ప అభివృద్ధి లేదని బీజేపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ.యోగయ్యయాదవ్ మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజాపోరు-2 కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని కర్నూలురోడ్డు ఫ్లైఓవర్, ఆర్టీసీబస్టాండు, కొత్తకూరగాయల మార్కెట్, పాత మార్కెట్ సెంటర్, అద్దంకి బస్టాండు, కొత్తపట్నం బస్టాండు కూడళ్లలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అమరావతిలో ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన విధ్వంస కాండ ఇంకా కొనసాగుతూనే ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించకపోతే ప్రజానీకం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. అరాచక, అవినీతి, అహంకార ప్రభుత్వాన్ని గద్దెదించి ప్రజాసంక్షేమం కోసం పాటుపడే బీజేపీని గెలిపించాలని కోరారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంగోలును ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి వందల కోట్ల విలువ చేసే భూములను ఆక్రమించుకున్నారని ఆరోపించారు. జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎటు చూసినా అవినీతి తప్ప అభివృద్ధి లేదన్నారు. ఇటువంటి అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తోగంటి శ్రీనివాసరావు, డి.శివాజీ, కె.నాగేశ్వరరావు, పి.దామోద్, కఠారి సుధాకర్, సీతారామయ్య, శెగ్గం శ్రీనివాసరావు, గుర్రం సత్యనారాయణ, సత్యవతి, కృష్ణవేణి, లక్ష్మి పాల్గొన్నారు.

రేపు ఉప్పుగుండూరు రైల్వే అండర్‌పాస్

ప్రధానమంత్రిచే ప్రారంభం


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రైల్వే అండర్ పాస్

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి24: నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు రైల్వేష్టేషన్‌కు ఉత్తరంగా నిర్మించిన అండర్‌పాస్‌ను ఈనెల 26వ తేదీ ఉదయం 10.30 గంటలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అండర్‌పాస్‌తో ఉప్పుగుండూరు నుంచి సముద్రతీరప్రాంత గ్రామాలకు వెళ్లేందుకు ఈ మార్గం ఎంతగానో సుగమం అవుతుందని గ్రామస్తులు తెలిపారు. కాగా రైల్వేస్టేషన్ దగ్గర గల రైల్వేగేటు పడినప్పుడు వాహనదారులు ఇబ్బందిపడాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ అండర్ పాస్ నిర్మాణంతో పరిసర గ్రామాలు ప్రజలకు ఎంతో సౌకర్యంగా మారనుంది. ఉప్పుగుండూరు నుంచి పెద్దగంజాం, సముద్రతీర ప్రాంత గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తొలగనున్నాయి.

అవీ..ఇవీ..

నైపుణ్యాభివృద్ధిపై వర్క్‌షాపులు నిర్వహించాలి

● కలెక్టర్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 24: జిల్లాలో యువతకు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు వర్క్‌షాపులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం స్కిల్‌డెవలప్‌మెంట్ లైఫ్ సైకిల్ కార్యక్రమం అమలుపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మూడు నుంచి పది సంవత్సరాల జిల్లా కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. యువతకు నైపుణ్యాన్ని పెంపొందించడం ద్వారా ఇతర ప్రాంతాలకు ఎగుమతిదారుగా ప్రకాశంను రూపొందించే లక్ష్యంతో కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అందుకోసం ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం వర్క్‌షాపుల పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధికారులు బి.శ్రీనివాసరావు, జి.రాజామోహన్, టి.రవికుమార్, టి.ఉషారాణి, ఎన్.శ్యామ్‌మోహన్, ఆర్.లోకనాథం, జె.రవితేజయాదవ్, రజనీకాంత్ పాల్గొన్నారు.

27న వైద్యశాఖలో గ్రీవెన్స్‌సెల్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 24: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేసే ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27వతేదీన కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశాఖలో పనిచేసే ఉద్యోగుల్లో ఎవరికైనా జీతాలకు సంబంధించిన సమస్యలు ఉన్నా, ఇతర సమస్యలు ఉన్నా వ్యక్తిగతంగా కలిసి వినతిపత్రం అందజేయవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వైద్యశాఖ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీఈవో ఆకస్మిక తనిఖీ


మాట్లాడుతున్న డీఈవో సుభద్ర

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 24: ఒంగోలు నగరం బాలాజీనగర్‌లోని నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలను శనివారం డీఈవో డి.సుభద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సర్టిఫికెట్లు భద్రపరిచే డీజీలాకర్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం చేయాలని సూచించారు పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం తయారు చేయాలని, టీచర్లతో పాటు తల్లిదండ్రులు కూడా వచ్చి పర్యవేక్షించాలన్నారు. కాగా స్కూలులో పదో తరగతి విద్యార్థులు ఇదే మొదటి బ్యాచ్ కావడంతో ఉదయం 6 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించడాన్ని డీఈవో అభినందించారు. పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు టి.కిషోర్ బాబు, పి.సరస్వతి పాల్గొన్నారు.

29లోపు దుకాణాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి


అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న శ్రీనివాసకుమార్

ఒంగోలు(కలెక్టరట్), ఫిబ్రవరి 24 : దుకాణాలు, సంస్థల యజమానులు ఈ నెల 29వ తేదీలోపు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఉప కార్మిక కమిషనర్ ఎస్.శ్రీనివాసకుమార్ సూచించారు. ఒంగోలు కార్మిక శాఖ కార్యాలయంలో శనివారం స్టీల్ మర్చంట్స్ అసోసియేషన్, హోల్‌సేల్ మెడికల్ అసోసియేషన్, ఫ్యాన్సీ గూడ్స్ అసోసియేషన్ల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1988 చట్టం ప్రకారం ఆయా దుకాణాల యజమానులు, సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దుకాణాలు, సంస్థలు తప్పనిసరిగా లైసెన్సులు పొందాలని, అందుకోసం ఆన్‌లైన్‌లో లేదా సచివాలయం, మీసేవా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఆయా దుకాణాలు, సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారులు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.ఎలిజబెత్తమ్మ, ఆయా అసోసియేషన్ల ప్రతినిధులు సతీష్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంగమ్మ కళాశాల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు, అధ్యాపకులు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 24: ఒంగోలులోని వెలిది వెంకటేశ్వర్లు అండ్ మంగమ్మ (వీవీఅండ్ఎం) డిగ్రీ కళాశాల పరిచయ సదస్సు శనివారం స్థానిక కళాశాలలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ రంగారావు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో కళాశాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ గత 52 సంవత్సరాలుగా ఎందరో విద్యార్థులను ఉత్తమ విద్యావంతులుగా, ఉన్నతపౌరులుగా తీర్చిదిద్దిన చరిత్ర మంగమ్మ కళాశాలకు ఉందన్నారు కళాశాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు 25 సంవత్సరాలుగా విశేష అనుభవం గల అధ్యాపకులు కృషి చేస్తున్నారని తెలిపారు సదస్సులో కళాశాల అధ్యక్షుడు వైవీ.భద్రారెడ్డి, కరస్పాండెంట్ మానం సుబ్బారావు, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూసుకోవాలి


మాట్లాడుతున్న ఈఆర్వో కుమార్

కొండపి, ఫిబ్రవరి 24 : ఓటర్లు ఇచ్చిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని కొండపి నియోజకవర్గ ఈఆర్వో ఎ.కుమార్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నియోజవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఫారం-6, ఫారం-7 దరఖాస్తులు పెండింగ్ ఉంచవద్దన్నారు. ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని, అందుకు క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో తహసీల్దార్లు బి.కిరణ్‌కుమార్, ఎం.భవానీ శంకర్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి పమిడి కోటయ్య


నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

కొండపి, ఫిబ్రవరి 24 : పేదల పక్షాన నిలిచి అనేక పోరాటాలు సాగించిన సీపీఎం జిల్లా ప్రథమ కార్యదర్శి పమిడి కోటయ్య ఆదర్శప్రాయుడని ఆపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల అంజనేయులు అన్నారు. కోటయ్య నాల్గో వర్ధంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి సీపీఎం, వామపక్షాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేజీ.మస్తాన్, వై.చంద్రశేఖర్, వై.రూబెన్, అంగలకుర్తి నూరిబాబు, గడ్డం వందనం, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాటల పోటీలు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 24: ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూములో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన పాటల పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన దాదాపు 100 మంది గాయకులు పాల్గొన్నారు. సరిగమ స్వరాల పాటల పోటీలు పేరుతో ప్రముఖ గాయకులు మర్రి కృష్ణారెడ్డి, వాకా కొండారెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు హైదరాబాద్‌కు చెందిన ప్రఖ్యాత సంగీత విద్వాంసులు భాగి నారాయణశాస్త్రి, ఎం.రాజాబాబులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కాగా కీబోర్డుపై జెర్మియా, తబలాపై నల్లమల్లి పాండురంగనాథం, శివప్రసాద్, ప్యాడ్ సురేష్, జాజ్ మోహన్ వాద్య సహకారాన్ని అందజేశారు.

వైసీపీలో ఆగని జడ్పీ అలజడి !

దర్శికే బూచేపల్లి ప్రాధాన్యం

అవకాశం కోసం బీసీ, దళితవర్గాల నుంచి ఒత్తిడి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ను మార్పుచేయాలన్న సీఎం నిర్ణయంతో అధికార వైసీపీలో ఆరంభమైన అలజడి కొనసాగుతూనే ఉంది. ఈ విషయంలో బూచేపల్లి కుటుంబీకులు అంతర్మథనంలో ఉండగా ఆ పదవి కోసం బలహీన వర్గాల నుంచి పార్టీపై వత్తిడి పెరిగింది. ప్రస్తుత చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను మార్చి ఆమె స్థానంలో తర్లుపాడు జడ్పీటీసీ వెన్నా ఇందిరను ఎంపికచేయాలని సీఎం జగన్ సూచించిన విషయం తెలిసిందే. శుక్రవారం ఒంగోలు వచ్చిన జగన్ ఈ విషయంపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వటం, హెలిప్యాడ్ వద్ద బూచేపల్లి కలిసి పునఃపరిశీలించాలని కోరటం విదితమే. వెంకాయమ్మ కుమారుడైన శివప్రసాదరెడ్డి దర్శి నుంచి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. దీంతో ఒకే ఇంట్లో రెండు పదవులు వద్దని, ఆమె స్థానంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి సతీమణి ఇందిరను ఎంపిక చేయాలని జగన్ సూచించారు. ఈ ఆకస్మిక నిర్ణయంతో కంగుతిన్న బూచేపల్లి తన తల్లిని కొనసాగించాలని సీఎంకు విన్నవించారు. అయితే రాష్ట్రంలో నాలుగు జిల్లాలో జడ్పీ చైర్మన్‌గా ఉన్నవారు లేక వారి కుటుంబీకులు అసెంబ్లీ నుంచి రంగంలో ఉండటంతో ఆ నాలుగు జిల్లాలలో జడ్పీ చైర్మన్లను మార్చాలని జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఇదే సంకేతాన్ని శనివారం పార్టీ అధిష్ఠానం బూచేపల్లి కుటుంబానికి పంపినట్లు తెలిసింది. అయితే దర్శికి అత్యంత ప్రాధాన్యతనిచ్చే బూచేపల్లి కుటుంబం అక్కడే పోటీకే మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ఆ మేరకు సీఎంను మరోసారి కలిసి ఎన్నికలయ్యే వరకు తన తల్లిని ఆ పదవిలో కొనసాగించాలని ఆ తర్వాత మీ నిర్ణయాన్ని అమలుచేయాలని కోరాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అయితే రాష్ట్రంలోని మరో మూడు జిల్లాలతో కూడా ఇదే సమస్య ముడిపడి ఉన్నందున బూచేపల్లి ప్రతిపాదనను సీఎం అంగీకరిస్తారా లేదా అనేది వెల్లడికావాల్సి ఉంది.

ఆశావహుల మధ్య పోటీ

కాగా జడ్పీ చైర్మన్‌ను మార్చాలన్న సీఎం నిర్ణయంతో ఆ పదవిని ఆశించే వారి మధ్య కూడా పోటీ పెరిగింది. ముఖ్యంగా బీసీ, దళిత వర్గానికి చెందిన జడ్పీటీసీలు వెంకాయమ్మను మారిస్తే తమకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానంను కోరుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం జడ్పీ వైస్ చైర్మన్లుగా సింగరాయకొండ జడ్పీటీసీ అయిన బీసీ మహిళ, మార్టూరు జడ్పీటీసీ అయిన దళిత మహిళ ఉన్నారు. వారు కూడా చైర్‌పర్సన్‌ను మారిస్తే తమకే అవకాశం ఇవ్వాలని అధిష్ఠానంను కోరినట్లు సమాచారం. అయితే రాజకీయ కోణంలో పశ్చిమ ప్రాంతానికి అందునా రెడ్డి సామాజికవర్గం వారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించిన జగన్ తన వైఖరిని మార్చుకుంటారో లేదో చూడాల్సి ఉంది.

కానీ రాజకీయంగా కీలకమైన సమయంలో జడ్పీ చైర్‌పర్సన్‌ను మార్చాలన్న వ్యవహారం వైసీపీలో తీవ్ర గందరగోళాన్ని సృష్టించిందని చెప్పవచ్చు. అంతేగాక ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి పోటీచేయాలని రంగంలోకి రానున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డికి కూడా ఈ వ్యవహారం తలనొప్పిగా మారినట్లు తెలుస్తోంది.

గ్రూప్-2 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు : సీఐ



సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ రంగనాథ్

సింగరాయకొండ/ టంగుటూరు, ఫిబ్రవరి 24 : ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న గ్రూపు-2 స్ర్కీనింగ్ పరీక్షకు మండలంలోని మలినేని సుశీలమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాల, పీఎస్‌సీపీ డిగ్రీ కళాశాలలో కేంద్రాలను కేటాయించారు. వాటిని శనివారం సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై టి.శ్రీరామ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ రంగనాథ్ మాట్లాడుతూ రెండు కేంద్రాల్లో పరీక్షలు సజావుగా నిర్వహించడానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష జరిగే సమయంలో ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కళాశాలల ఆవరణలో ఇతర వ్యక్తులు సంచరించకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్ష కోసం టంగుటూరు మండలంలోని పేస్, రైజ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను సీఐ రంగనాథ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రంలో కళాశాల ప్రిన్సిపాల్ మినహా ఏఒక్కరి వద్ద మొబైల్ ఫోన్‌ను అనుమతించేది లేదని తెలిపారు. ఆయన వెంట టంగుటూరు ఎస్సై నాగేశ్వరరావు ఉన్నారు. పేస్ కళాశాలలో 2,380 మంది, రైజ్‌లో 1,800 మంది పరీక్షకు హాజరుకానున్నారు. ఈ రెండు కళాశాలల వద్ద 50 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

చంద్రబాబుకు యువత మద్దతుగా నిలవాలి

● టీడీపీ ఇన్‌చార్జి బీఎన్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఎన్, నాయకులు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 24: రాష్ట్రంలో నూతనంగా ఓటుహక్కు పొందిన యువత రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు మద్దతుగా నిలవాలని, తద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జ్ బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని బీఎన్ కార్యాలయంలో శనివారం మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క విద్యార్థి ఓటుహక్కు నమోదు చేసుకోవాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు అని, లేకుంటే అంధకారంలోకి పోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి రాష్ట్రాన్ని కాపాడాలని కోరారు. టీడీపీ-జనసేన కూటమితో 20లక్షల ఉద్యోగాలకు ప్రణాళికసిద్ధమైందని, యువగళం నిధికింద ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగికి నెలకు రూ.3వేల నిరుద్యోగభృతి వంటివి ఉంటాయన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరు చర్చిలో ప్రార్థనలు

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్): ఉప్పుగుండూరులో శనివారం బీఎన్.విజయకుమార్ పర్యటించారు. ఈ సదర్భంగా స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తేళ్ల మనోజ్‌కుమార్, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, కనగాల శ్రీనివాసరావు, తెలగతోటి జాన్సన్, మాజీ ఎంపీటీసీ ఆశీర్వాదం తదతరులు పాల్గొన్నారు.

పేదల పట్టాల లేఅవుట్ పనుల్లో మతలబు

జరిగిపోయిన పనులకు ఆమోదం ● టీడీపీ, జనసేన కార్పొరేటర్ల నిరసన ● వాడీవేడిగా కార్పొరేషన్ కౌన్సిల్ అత్యవసర సమావేశం



మేయర్ పోడియంను చుట్టిముట్టిన టీడీపీ కార్పొరేటర్లు

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 24 : ఒంగోలు నగరంలోని పేదలకు ఇచ్చే ఇళ్ల పట్టాల లే అవుట్, మౌలిక వసతుల కల్పన పనుల్లో మళ్లీ మతలబు చోటుచేసుకుంది. టెండరు ఖరారు కాకముందే రూ.22కోట్లు విలువతో చేపట్టిన పనులకు అధికార వైసీపీ కార్పొరేటర్లు ఆమోదం తెలిపారు. పలు అభివృద్ధి అంశాలపై మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన ఒంగోలులోని కార్పొరేషన్ కార్యాలయంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం వాడీవేడీగా సాగింది. ఇప్పటికే కొనసాగుతున్న పనులు ముందస్తు అనుమతులు (ర్యాడిఫికేషన్) పేరుతో హడావిడిగా కౌన్సిల్ అజెండా అంశాలలో పొందుపరిచారు. దీంతో పాటుగా మరికొన్ని అభివృద్ధి పనులకు ఆమోదం కోసం మొత్తం 26 అంశాలను అజెండాలో పొందుపరచగా, టీడీపీ జనసేన కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. దీంతో వాడివేడీగా చర్చ జరగడంతో ప్రతి పక్ష కార్పొరేటర్లు అజెండా కాపీలను చింపివేశారు. ఇదే సమయంలో జనసేన కార్పొరేటర్ మలగా రమేష్ మాట్లాడుతుండగా వైసీపీ కార్పొరేటర్లు అడ్డుకున్నారు. దీంతో టీడీపీ, జనసేన కార్పొరేటర్లు దాచర్ల వెంకటరమణయ్య తిప్పరమల్లి రవితేజ, అంబూరి శ్రీను, సంద్రపాటి వర్ష్ వర్ష్, గుట్లపల్లి మస్తానమ్మలు ఆగ్రహం వ్యక్తం చేసి పోడియం చుట్టుముట్టారు. దీంతో అధికార వైసీపీ, ప్రతి పక్ష టీడీపీ, జనసేన కార్పొరేటర్లు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. మేయర్ గంగాడ సుజాత అన్నీ అంశాలను ఆమోదిస్తున్నట్లు తెలిపి సమావేశం మందిరం నుంచి బయటకు వెళ్ళిపోయారు. కాగా వైసీపీ తీరును టీడీపీ కార్పొరేటర్లు తీవ్రంగా ఖండించారు.

ప్రకృతి వైపరీత్య పనులు మాత్రమే అత్యవసరం : దాచర్ల

పేదల పట్టాల పంపిణీకి సంబంధించిన పనులు టెండర్లు ఖరారు కాకుండా సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థ పనులు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని టీడీపీ కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దాచర్ల వెంకటరమణయ్య మాట్లాడుతూ ముందస్తుగా నిర్ణయించిన పట్టాల పంపిణీ వ్యవహారం అత్యవసరం కింద ఎలా పరిగణిస్తారన్నారు. "ప్రణాళిక ప్రకారం, ఉద్దేశ్యపూర్వకంగానే లే అవుట్‌లో పనులు చేపట్టారు. వీటిని ర్యాడిఫికేషన్ కింద ఎలా చేస్తారు. అత్యవసర పనులు అంటే.. ప్రకృతి వైపరిత్యాలైన వరదలు, తుఫానులు, భూకంపాలు వచ్చినపుడు మాత్రమే చేస్తారు. పేదల ఇళ్ల పట్టాలకు తాము వ్యతిరేకం కాదు. అయితే నిబంధనల మేరకు చేయకుండా ఒక కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరే విధంగా నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదు. దీనిని టీడీపీ వ్యతిరేకిస్తుంది.' అని చెప్పారు. పేదల పట్టాల పంపిణీ కోసం చేపట్టిన పనులన్నీ అధికార పార్టీ లబ్ధి కోసం చేశారని ఆయన ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా వైసీపీ, టీడీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరుగ్గా, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు జోక్యం చేసుకుని ఇరువర్గాలను సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అదే క్రమంలో అజెండా అంశాలపై వివరణ ఇచ్చేందుకు ఆయన ప్రయత్నించారు.

అగౌరవపరచడం సరికాదు : జనసేన

కౌన్సిల్‌లో పొందుపరిచిన అజెండా అంశాలలో మాట్లాడే అవకాశం సభ్యులందరికీ ఉంటుందని జనసేన కార్పొరేటర్ మలగా రమేష్ పేర్కొన్నారు. అయితే వాటిపై మాట్లాడుతుంటే కావాలనే అడ్డుకుని సమావేశాన్ని గందరగోళానికి గురి చేయడం వైసీపీ కార్పొరేటర్లుకు తగదన్నారు. మొదటి అంశాన్నే మాట్లాడనివ్వకుండా అడ్డుకోవడం, సభను గందరగోళానికి గురిచేయడం తమను అవమానపరచడమే అన్నారు. వైసీపీ కార్పొరేటర్ల తీరును జనసేన ఖండిస్తుందని వెల్లడించారు.

పొరుగు మద్యం రాకుండా అడ్డుకట్ట వేయాలి

● ఎస్పీ పరమేశ్వరరెడ్డి

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 23: రానున్న ఎన్నికల దృష్ట్యా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రాకుండా సరిహద్దులలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి ఆదేశించారు. శనివారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ)అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎస్ఈబీ అధికారులు క్షేత్రస్థాయిలో ముందస్తు సమాచారం వ్యవస్థను మెరుగు పరుచుకుని నిరంతరం దాడులు చేయాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన విచారించి నిందితులకు శిక్షపడే విధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. గంజాయి, నాటుసారా, మాదకద్రవ్యాల విక్రయాలను అరికట్టాలని ఎస్పీ ఆదేశించారు. అక్రమంగా మద్యం విక్రయాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం పోలీసు, ఎస్ఈబీ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై పలు సూచనలు చేశారు. సమావేశంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఎస్ఈబీ ఈఎస్ రవికుమార్, మార్కాపురం ఏఈఎస్ దుర్గాప్రసాద్, సీఐ వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు మున్నంవారిపాలెం క్రీడాకారులు

చినగంజాం, ఫిబ్రవరి 24 :మండలంలోని మున్నంవారిపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు కబడ్డీ క్రీడాకారులు జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ కోచ్ చెరుకూరి పుల్లయ్య శనివారం తెలిపారు. ఈ నెల 21వతేదీ నుంచి 23వ తేదీ వరకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన 33వ సబ్ జూనియర్స్ బాలబాలికల కబడ్డీ పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. దీంతో ఆట్ల అశోక్‌రెడ్డి, భోగిరెడ్డి భవానీశంకర్, ఆట్ల అభిలాష్ రెడ్డిలను రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపిక చేశారు. మార్చి 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు బీహార్‌లో జరిగే జాతీయ సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో వీరు రాష్ట్ర కబడ్డీ జట్టులో పాల్గొంటున్నట్లు పుల్లయ్య తెలిపారు. జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వరరావు, కోచ్ పుల్లయ్య, సభ్యులు పూలకం రామచంద్రరావు, తుమ్మలపెంట పద్మారావు, కోటేశ్వరరావు, నంగు శ్రీనివాసరెడ్డి, స్వామిరెడ్డిలు అభినందనలు తెలిపారు.

ఎండ్లూరులో బీజేపీ నాయకుల సమీక్ష

సంతనూతలపాడు, ఫిబ్రవరి 24: మండలపరిధిలోని ఎండ్లూరు గ్రామంలో బీజేపీ మండల నాయకులు రానున్న సార్వత్రిక ఎన్నికలపై శనివారం సమీక్ష జరిపారు. సంతనూతలపాడు అభ్యర్థి విషయంపై త్వరలో క్లారిటీ వస్తుందని, అభ్యర్థి ఎవరైన గెలుపు దిశగా కార్యకర్తలను సన్నద్ధం చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఎం.సుబ్బారావు, ఎం.రామారావు, బి.ఆనంద్‌కుమార్, ఎం.హరిక్రిష్ణ, ఎం.శ్రీను, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

29న నందీశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి24: నాగులుప్పలపాడు మండలం కనపర్తి గ్రామంలోని శ్రీగంగాపార్వతీ సమేత ఏలేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 29వ తేదీన ఉదయం 9.52 గంటలకు నందేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం జరుగుతుందని దేవాలయ కమిటీ వారు శనివారం ఒక ప్రకటలో తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతాలు





వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 24: మాఘ పౌర్ణమి సందర్భంగా ఒంగోలులోని కేశవస్వామిపేటలోని శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో శనివారం ఏర్పాటు చేసిన సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా జరిగాయి. దాదాపు 50 మంది దంపతులు దేవస్థాన అర్చకబృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, ఈవో డి.రజనీకుమారి, సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి, కరేటి కిరణ్‌బాబు, ఈమని మదన్‌మోహన్, వెంకటరత్నం పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పౌర్ణమి సందర్భంగా స్కందగిరి శ్రీగిరి ప్రదక్షిణ సేవాసమితి ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా జరిగింది. స్థానిక బాపూజీ గోసంరక్షణ శాల పాదపీఠం దగ్గర నుంచి అందంగా అలంకరించి రథంపై గంగా పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ఉంచి శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు గిరి ప్రదక్షిణ కొనసాగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని గోవింద నామస్మరణ చేయగా, మహిళల కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

రైతులకు మెరుగైన సేవలందించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 24: రైతులకు మెరుగైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం జరిగిన వ్యవసాయ సలహామండలి సమావేశానికి చైర్మన్ ఆళ్ళ రవీంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పలు అంశాలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కారు టైరు పేలి పలువురికి గాయాలు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 24: కారు టైరు పేలి అందులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలైన ఘటన మండలం లోని నికరంపల్లి గ్రామం వద్ద అమరావతి టూ అనంతపురం జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకొంది. స్థానికులు తె లిపిన సమాచారం ప్రకారం.. హైదరాబాదు నుంచి ఓ కుటుంబం రాచర్ల మండలం నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవ స్థానానికి కుటుంబంతో కలిసి వస్తోంది. ఈ క్రమంలో కారు నికరంపల్లి గ్రామం సమీపంలోని వంతెన వద్దకు రాగానే ముందు టైరు పేలడంతో అదుపుతప్పింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలలో వైద్య చికిత్స చేయించుకుని తిరిగి హైదరాబాదుకు వెళ్లిపోయారు. ప్రమదానికి గురైన హైదరబాద్ వాసుల సమాచారం తెలియరాలేదు.

చీరాల డీఎస్పీగా బేతపూడి ప్రసాద్

చీరాల,ఫిబ్రవరి 24 : ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తున్న బేతపూడి ప్రసాద్‌ను చీరాల డీఎస్పీగా బదిలీ చేస్తూ శనివారం డీజీపీ కేవీ.రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. చీరాల డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్.ప్రసాదరావును ఇంటిలిజెన్స్‌కు బదిలీ చేశారు. కాగా బేతపూడి ప్రసాద్ గతంలో చీరాల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. నేడో రేపో ఆయన చీరాల డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

స్వామి సమక్షంలో టీడీపీలోకి 40 కుటుంబాలు చేరిక





పార్టీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే స్వామి, నాయకులు

జరుగుమల్లి (కొండపి), ఫిబ్రవరి 24 : కొండపి నియోజకవర్గంలో టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. వైసీపీకి చెందిన పలువురు ఆపార్టీని వీడి తెలుగుదేశంలో చేరుతున్నారు. జరుగుమల్లి మండలం వావిలేటిపాడుకు చెందిన 25 కుటుంబాలు, సింగరాయకొండ మండలం సోమరాజుపల్లి ఎస్సీకాలనీకి చెందిన 15 కుటుంబాల వారు శనివారం ఎమ్మెల్యే స్వామి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని తన స్వగృహంలో వారికి స్వామి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వావిలేటిపాడు గ్రామానికి చెందిన మల్లవరపు శ్రీనివాసరావు, మల్లవరపు సంజీవరావు, నూతలపాడు మురళితోపాటు 25 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈసందర్భంగా పార్టీ జరుగుమల్లి మండల సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాస మురళి మాట్లాడుతూ ఎమ్మెల్యే స్వామి అభివృద్ధి కార్యక్రమాలతోపాటు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు చేస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారిని సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకుంటామని, వారి అభివృద్ధికి పాటుపడతామని పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు సుబ్బారెడ్డి, నరాల సోమయ్య పాల్గొన్నారు.

సోమరాజుపల్లి ఎస్సీ కాలనీ నుంచి..

సింగరాయకొండ: మండలంలోని సోమరాజుపల్లి ఎస్సీకాలనీలో వైసీపీకు చెందిన 5వ వార్డు సభ్యుడు, మరో 14 కుటుంబాల వారు ఆపార్టీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. తూర్పునాయుడుపాలెంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో వారు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ గ్రామాల్లో గత టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి తప్ప వైసీపీ పాలనలో తట్టెడు మట్టి కూడా వేయలేదన్నారు. ఈ ఐదేళ్లలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, వేధింపులు, అక్రమ కేసుల బనాయింపులు అధికమయ్యాయని విమర్శించారు. దళితుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని తెలిపారు. కాగా పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యుడు బొడ్డు నాగరాజు, బంగారమ్మ, స్వాతి, గౌతమ్, దగ్గుమాటి వేణు, కనిగంటి మస్తానమ్మ, అల్లరి నరేష్, పలుకుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు మించల బ్రహ్మయ్య, బొడ్డు బాలకోటయ్య పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తాం

● కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 24: ఓట్ల చేర్పులు, మార్పుల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనను త్వరగా పరిష్కరిస్తామని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో దరఖాస్తులు వచ్చాయని, వాటన్నింటినీ త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఓటు ఎలా వేయాలో డెమో ద్వారా పార్టీ శ్రేణులకు వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఆర్డీవోలు విశ్వేశ్వరరావు, జాన్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు డీఎస్.క్రాంతికుమార్, రసూల్, స్వరూప్, గుర్రం సత్యనారాయణ, బి.రఘురాం పాల్గొన్నారు.

రూ.13 లక్షల చెక్కులు అందజేత

అనారోగ్యాలతో బాధపడుతున్న 12 మంది బాధిత కుటుంబాలకు కలెక్టర్ దినేష్‌కుమార్ రూ.13 లక్షల బ్యాంకు చెక్కులను అందజేశారు. శనివారం రాత్రి కలెక్టర్ తన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో బాధిత కుటుంబాలకు వాటిని పంపిణీ చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన బాధిత కుటుంబ సభ్యులు శుక్రవారం ఒంగోలు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలిసి తమ బాధలను విన్నవించుకున్నారు. సీఎం ఆదేశాల మేరకు చెక్కులను అందజేశారు.

వలంటీర్లకు పురస్కారాలు

జిల్లాలో పనిచేస్తున్న వలంటీర్లకు శనివారం రాత్రి స్థానిక స్పందనహాలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్ పురస్కారాలతో పాటు నగదు ప్రోత్సాహకాలతో సత్కరించారు. సేవా వజ్ర, రత్న, మిత్రఅవార్డులతో పాటు ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు రూ.18.19 లక్షల ప్రోత్సాహకాలను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో సచివాలయాల అధికారి ఉషారాణి, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్ పాల్గొన్నారు.

ఇసుక దందా కనిపించడం లేదా?

● అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి24: జగన్‌రెడ్డి ఇసుక దందా కలెక్టర్‌ల కళ్లకు కనిపించటం లేదా అని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కేంద్ర పర్యావరణ శాఖ నివేదికపై సీఎం ఏం సమాధానం చెబుతారన్నారు. ఇసుక తవ్వకాలలో పెద్ద ఎత్తున ఉల్లంఘనలు జరుగుతున్నాయని, రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ మదింపు సంస్థ గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ఇసుక తవ్వకాలకు కొత్తగా పర్యావరణ అనుమతులు జారీ చేయలేదని స్పష్టం చేసినా వైసీపీ ఇసుకాసురులు అడ్డగోలుగా అక్రమ రవాణా చేస్తున్నారని ఆరోపించారు. ఇసుక సొమ్ముతో వచ్చే ఎన్నికలలో గెలవాలని జగన్మోహనరెడ్డి కుట్రలు పన్నుతున్నారన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ పరివాహక గ్రామాలైన తమ్మవరం, అనమనమూరు, మణికేశ్వరం గ్రామాలలో వైసీపీ నేతలు ఇష్టానుసారం ఇసుక తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. తిమ్మాయపాలెం సమీపంలో బ్రిడ్జి పిల్లర్ల వద్ద కూడా ఇసుక తోడేస్తుండటంతో కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. వచ్చే ఎన్నికలలో టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

చెదల నివారణ

చెదలు బారి నుండి విలువైన మీ ఇంటిని కాపాడుకోండి. ఈగలు, బొద్దింకలు మొ॥ గ్యారంటీగా నివారించబడును. సంప్ర॥ బాబు, ఒంగోలు, సెల్ : 99854 21321, 97036 45295 AJO-170493

WANTED STAFF

కాంతి ఐస్‌క్రీమ్స్, ఒంగోలు నందు పని చేయుటకు Boys & Girls కావలెను. Full time & Part time. ఒంగోలు వారు మాత్రమే సంప్రదించగలరు. సెల్ 9247580211 AJO-183703

ఇంటి ఋణాలు

రేకుల ఇల్లు / పెంకుల ఇల్లు / స్లాబ్ ఇల్లు / వ్యవసాయ ఋణాలు / ఖాళీ స్థలాలకు / OTS పట్టాలు / కడుతున్న ఇల్లు / కట్టిన ఇల్లు / మొ॥ వాటికి తక్కువ వడ్డీకి ఇప్పించబడును. 18సం॥ సర్వీస్ ఇస్తున్నాం. సంప్ర॥ 9502466253 AJO-151034

WANTED

WANTED ONE DATA ENTRY OPERATOR (Ladies Only), to work in Ongole. Graduate / Diploma holders having one year experience, Age below 35, Salary 12,000 P.M / Negotiable, Contact : 8977772106. AJO-170495

FLAT FOR SALE

ఒంగోలు కొప్పోలు రోడ్‌లోని డ్రీమ్స్ స్కూల్ వెనుక గల 3 బెడ్‌రూమ్ గ్రూప్ హౌస్ అపార్ట్‌మెంట్ రెడిటూ ఆక్యుపై, సంప్ర॥ అమరా కన్‌స్ట్రక్షన్స్, సెల్: 9440265170, 9164217325 AJO-151222

WANTED

సరిపూడి సుజుకి టూవీలర్ షోరూం, ఒంగోలు నందు పనిచేయుటకు ఇంటర్ /డిగ్రీ అర్హత కలిగిన అకౌంటెంట్స్, క్యాషియర్స్ కావలెను. భాద్యతలను అనుసరించి జీతం కలదు. 5 ఖాళీలు కలవు. సంప్ర॥ 7799960149. AJG-1279

అమ్మబడును

నెల్లూరు జిల్లా కందుకూరు టౌన్‌లో 30 గదులు (అంకణాలు) కొన్నవారికి 60 అంకణాల కారు పార్కింగ్ ఫ్రీగా ఇవ్వబడును. టౌన్‌లో ఇంటి స్థలం 40 గదులు. గది 75,000 కు కలదు. సంప్ర॥ 9704250705 AJO-183679

PROPERTY FOR SALE

ఇరవై అంకణముల ఇంటి స్థలం అమ్మకం. రెవెన్యూ కాలనీ, కందుకూరు. బలరాం Cont : 9440279283 AJH-01561

రియల్ ఎస్టేట్

గుంటూరు సిటీకి అతి సమీపంలో లాం గ్రామం నందు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దగ్గర సువర్ణ కుటీర్ డెవలపర్స్ వారి 18వ CRDA అప్రూవుడ్ వెంచర్ చ.గ 11,000 మాత్రమే. బ్యాంకు లోను సదుపాయం కలదు. సంప్ర॥ 88868 55355, 88863 55955 AJG-152149

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, ఉద్యోగ, వ్యాపార, బహిరంగ ప్రకటనలు, అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥

ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు మరియు పేపరు పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥ Asst-Cir-Manager. 9985411484

ఎరిక్షన్‌బాబు ఎంపికపై హర్షం

● బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్న టీడీపీ కేడర్ ● చంద్రబాబు పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు


ఎరిక్షన్‌బాబును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 24 : ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థిగా గూడూరి ఎరిక్షన్‌బాబును రాష్ట్రటీడీపీ అధిష్ఠానం శనివారం ప్రకటించింది. దీంతో ఎర్రగొండపాలెంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి నాయకులు కార్యకర్తలు టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబుకు అభినందనలు తెలిపారు. దుశ్శాలువాలు, పూల దండలతో ఘనంగా సన్మానించారు. ఎరిక్షన్‌బాబును అత్యధిక మెజార్టీతో గెలిపించి, ఎర్రగొండపాలెం సీటును చంద్రబాబునాయుడికి కానుకగా ఇస్తామని నినాదాలు చేశారు. ఐదు మండలాల టీడీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొని రాష్ట్ర టీడీపీ అధినేత చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలు స్వీట్లు పంచుకున్నారు.

ఎన్టీఆర్ కూడలిలో బాణసంచా కాల్చిసంబరాలు

రాష్ట్ర అధినేత చంద్రబాబునాయుడు ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా గూడూరి ఎరిక్షన్‌బాబును శనివారం 11 గంటల సమయంలో ప్రకటించడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచాపేల్చి సంబరాలు చేసుకున్నారు. ఎర్రగొండపాలెం పట్టణంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

నాయకులు, కార్యకర్తల సహకారంతోనే..

ఎర్రగొండపాలెం : నాయకులు, కార్యకర్తలు తన వెంట నడిచి సహకారం అందించడంతోనే తనకు టీడీపీ ప్రకటించిన అభ్యర్థుల తొలిజాబితాలో సీటు దక్కిందని, టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అధినేత చంద్రబాబునాయుడికి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలుపుకుంటానని, ఎర్రగొండపాలెం సీటు గెలిచి పార్టీకి కానుకగా ఇస్తానని ఆయన పేర్కొన్నారు. మూడేళ్లగా నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో పర్యటించానని, ఎర్రగొండపాలెం నియోజకవర్గ ప్రజలు పడుతున్న సాధక బాధలు దగ్గరుండి చూసినట్లు తెలిపారు. వైసీపీ నాయకులు చేస్తున్న అరాచకాలను తెలుసుకున్నానన్నారు. సాగునీరు,తాగునీరు సమస్యనుతీర్చే ప్రధానవనరు వెలిగొండప్రాజెక్టు పూర్తి చేయించేందుకు టీడీపీ అభ్యర్థిగా గెలిచి తొలి ప్రాధాన్యత ఇస్తానన్నారు. గ్రామాల్లో నెలకొన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలు పరిష్కారం చూపుతానని అన్నారు. నియోజకవర్గ ఓటర్లు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తన విజయానికి దోహదపడాలన్నారు. రాష్ట్రంలో టీడీపీకి పట్టంకట్టి చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిగా చేయడానికి ప్రజలు నిశ్చయించుకున్నారన్నారు. చంద్రబాబునాయుడి నాయకత్వంలో ఐదు సంవత్సరాలు ప్రజలకు అందుబాటు ఉండి నియోజకవర్గంను అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో ద్వితీయశ్రేణినాయకులు పాల్గొన్నారు.


దోర్నాలలో బాణసంచా కాలుస్తున్న టీడీపీ కార్యకర్తలు

దోర్నాల నేతల్లో నూతనోత్సాహం

పెద్ద దోర్నాల : ఎర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా గూడూరి ఎరిక్షన్ బాబును టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు శనివారం ప్రకటించడంతో మండల నాయకుల్లో నూతనోత్సాహం వచ్చింది. టపాసులు పేలుస్తూ ఎరిక్షన్‌బాబు నాయకత్వం వర్థిల్లాలి అంటూ నినాదాలు చేశారు. నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌గా గూడూరిని పార్టీ నియమించినప్పటి నుంచి గ్రామాలలో పదే పదే పర్యటిస్తూ అందరిని ఆకట్టుకున్నారనే స్థాయికి చేరుకున్నారు. టీడీపీ టిక్కెట్‌ను ఆశిస్తున్న వారు కూడా ఈ నియోజకవర్గం నుంచి ఉండడంతో కొంతకాలంలో అభ్యర్థి ఎంపికపై కొంత సందిగ్ధత నెలకొంది. అయితే పార్టీ అధిష్ఠానం తొలి నుంచి ఎరిక్షన్‌బాబు వైపే ఉంది. ఇదే క్రమంలో ఆయనకు పార్టీ ప్రకటించిన తొలి జాబితాలోనే చోటు లభించడం గమనార్హం. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఏర్వ మల్లికార్జున రెడ్డి, నాయకులు దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, దేసు నాగేంద్రబాబు, చంటి, ఇస్మాయిల్, షేక్ భాష, చల్లా వెంకటేశ్వర్లు, ఎలకపాటి చెంచయ్య, కే.శ్రీనివాసులు, సీనియర్ నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, రావిక్రింది సుబ్బరత్నం, నాగెళ్ల సత్యనారాయణ,షేక్ మంజూర్ భాష, రఫీ, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

జగన్న కాలనీలో తాగునీటి సమస్య


తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు

గిద్దలూరు, ఫిబ్రవరి 24 : మున్సిపాలిటి పరిధిలోని వెోడంపల్లి సమీపంలోని జగనన్న కాలనీలో నీటి సమస్య జఠిలమైంది. కాలనీలో 320 మందికి నివేశన స్థలాలు ప్రభుత్వం అందజేసింది. ప్రస్తుతం ఎక్కువ మంది అక్కడే నివసిస్తున్నారు. ఈకాలనీలో రెండు డీప్‌బోర్లు ఉన్నప్పటికీ భూగర్భజలాలు అడుగంటాయి. 20 రోజులుగా డీప్‌బోర్ల నుంచి అరకొర నీరు మాత్రమే వస్తోంది.


అడుగంటిన బోరు

దీంతో కాలనీవాసులు నీటి సమస్యతో ప్రజలు సతమత మవుతున్నారు. సమీప పొలాలకు వెళ్లి వ్యవసాయబోర్ల నుంచి నీటిని తెచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా డీప్‌బోరు వేయడమో, ఉన్న బోర్ల స్థానంలో రీబోర్ చేయడమో చేసి నీటి సమస్యకు పరిష్కారం చూపాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ఏకగ్రీవమైన బేస్తవారపేట పంచాయతీ ఉద్యోగుల కమిటీ

గిద్దలూరు, ఫిబ్రవరి 24 : గిద్దలూరు తాలూకా పంచాయతీరాజ్ ఉద్యోగుల యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా ఒ.శ్రీనివాసకుమార్, ఉపాధ్యక్షుడిగా వి.శివకుమార్, కార్యదర్శిగా ఈదుల రామకృష్ణారెడ్డి, కోశాధికారిగా బీ.ఏ.అశోక్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎ.సుదర్శన్, జిల్లా కౌన్సిలర్లుగా ఎన్.వెంకటరామిరెడ్డి, ఐ.ఎస్.తీర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన సంఘం జిల్లా అధ్యక్షులు కె.విద్యాసాగర్‌రెడ్డి, సంఘ ప్రతినిధి పి.రామిరెడ్డి తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న జరిగే ఛలో విజయవాడ కార్యక్రమానికి పంచాయతీరాజ్ ఉద్యోగులందరూ హాజరు కావాలని విద్యాసాగర్‌రెడ్డి ఈసందర్భంగా కోరారు.

బేస్తవారపేట మండలంలో


బేస్తవారపేట, : పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల బేస్తవారపేట యూనిట్ ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా సయ్యద్ కరీముల్లా, ఉపాధ్యక్షుడిగా కె.బాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కె.చంద్రశేఖర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సీ.హెచ్.కిషోర్, కోశాధికారిగా కె.వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిలర్‌లు టి.శివశ్రీ, మునివరకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చిన్న ఓబినేనిపల్లెలో రోడ్డుకు అడ్డంగా పైప్‌లైన్


రోడ్డుకు అడ్డంగా వేసిన పైపులు

బేస్తవారపేట, ఫిబ్రవరి 24: మండలంలోని చిన్న ఓబినేనిపల్లె గ్రామంలో జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి కొళాయి కోసం సుమారు రూ.70లక్షలతో నిర్మించిన తాగునీటి పైప్ లైన్ ఏర్పాటుతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. గ్రామంలో రోడ్లకు ఇరువైపుల ఇనుప పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. అయితే రోడ్డుకు పైభాగంలో పైప్‌లైన్ వేయడంతో రోడ్డు దాటే క్రమంలో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు కిందపడి వాహనదారులు గాయ పడిన ఘటనలు ఉన్నాయి. సంబంధింత అధికారులు స్పందించి, పైపులైన్‌ను రోడ్డుకు అంచన భూమిలో వేయాలని కోరుతున్నారు.

లారీపై విరిగిపడిన చెట్టు


లారీపై విరిగిపడిన చెట్టు

పొదిలి, ఫిబ్రవరి 24 : స్థానిక ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల సమీపంలో ప్రమాద వశాత్తు చెట్టు విరిగి పడింది. వివరాల్లోకి వెళితే పొదిలి నుండి దర్శి వైపు వెళుతున్న బొగ్గులారీ ప్రమాదవశాత్తు చెట్టును పైబాగం తాకింది. దీంతో చెట్టు విరిగి లారీపైన పడింది. దాని వలన ట్రాఫిక్ కిలోమీటర్ మేర నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకొని నిలిచిపోయిన ట్రాఫిక్‌ను మరో రహదారి నుండి ట్రాఫిక్ మళ్లించి క్లియర్ చేశారు.

కలుషితమవుతున్న తాగునీరు

● పంచాయతీ కార్యదర్శికి బీసీ కాలనీవాసుల వినతి

కొమరోలు, ఫిబ్రవరి24 : తాగునీరు కలుషితమై దుర్వాసనతో ఉన్నాయని కొమరోలులోని బీసీ కాలనీవాసులు పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. గోపానిపల్లి రోడ్డులోని ఎస్‌బీఎస్ఆర్ఎం పాఠశాల నుంచి బీసీ కాలనీ, ఎస్‌బీఎస్ఆర్ఎం పాఠశాల వీధి వాసులకు తాగునీటి పైపు లైన్ వెళ్తుంది, ఆదే మార్గంలో ఇటీవల పంచాయతీ నిధులతో సైడు కాల్వ, కల్వర్టులను నిర్మించారు కానీ కాలనీ నుంచి వచ్చేమురికి నీరు మాత్రం వెళ్లేందుకు వీలు కల్పించలేదు. దీంతో మురుగునీరు రోడ్డుపైనిలుస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ నీరు తాగునీటిపైపులోకి వెళుతూ కలుషితం అవుతోందని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కారు టైరు పేలి పలువురికి స్వల్ప గాయాలు


టైరు పెలడంతో దెబ్బతిన్న కారు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 24: కారు టైరు పేలి అందులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలైన ఘటన మండలంలోని నికరంపల్లి గ్రామం వద్ద అమరావతి టూ అనంతపురం జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. హైదరాబాదు నుంచి ఓ కుటుంబం రాచర్ల మండలం నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానానికి కుటుంబంతో కలిసి వస్తోంది. ఈ క్రమంలో కారు నికరంపల్లి గ్రామం సమీపంలోని వంతెన వద్దకు రాగానే ముందు టైరు పేలడంతో అదుపుతప్పింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలలో వైద్య చికిత్స చేయించుకుని తిరిగి హైదరాబాదుకు వెళ్లిపోయారు. ప్రమదానికి గురైన హైదరబాద్ వాసుల సమాచారం తెలియరాలేదు.

లీకులతో మడుగులా మారిన రోడ్డు

● పైపుల లీకేజీతో ప్రజల అవస్థలు


వృథాగా పోతున్న సాగర్ జలాలు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 24: నిత్యం వందలాది మంది తిరిగే నెహ్రూ బజార్‌లో సాగర్ జలాల పైపలు పగిలిపోయాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో అనేక వ్యాపార సంస్థలు ఉన్నాయి. బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు నిత్యం ఈ రహదారి నుంచే ప్రయాణిస్తుంటారు. కొంతమంది ఇంటి నిర్మాణాలు చేపడుతూ యథేచ్ఛగా ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో పైపలను తొక్కుతుండడంతో తరచూ లీకులు ఏర్పడుతున్నాయని రాకపోకలకు ఇబ్బందులుగా మారిందని స్థానికులు వాపోతున్నారు.

గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు


పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 24: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా ఏర్పాటు చేశామని ఏపీపీఎస్సీ సభ్యులు, అబ్జర్వర్ సిద్ధం శివరాం తెలిపారు. పట్టణంలోని గ్రూప్-2 పరీక్షలు నిర్వహించే కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పట్టణంలోని బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలు సాయిబాలాజీ పాఠశాల, రెడ్డిమహిళా కళాశాల, సాధన కళాశాల, గౌతమి జూనియర్ కళాశాల, ఏ1 గ్లోబల్, జార్జ్, ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో గ్రూప్-2 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్ పర్వీన్ తెలిపారు. 3578 మంది సభ్యులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ షేక్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరుకు బస్సు సర్వీసు ప్రారంభం


బెంగుళూరు బస్సుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 24: త్రిపురాంతకం ప్రాంతం నుంచి బెంగుళూరుకు వెళ్లేందుకు బస్సు సర్వీసును ఆర్టీసీ శనివారం ప్రారంభించింది. పల్నాడు జిల్లా వినుకొండకు డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సును నరసరావుపేట నుంచి ప్రతి రోజూ నడిపేందుకు త్రిపురాంతకానికి చెందిన ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్ యజమాని గ్రంధిశిల సుబ్రహ్మణ్యం చేసిన వినతితో బస్సు సర్వీసును ప్రారంభించారు. దీనిలో భాగంగా శనివారం సాయంత్రం నాలుగంటలకు నరసరావుపేటలో బస్సు ప్రారంభమైంది. ప్రతిరోజూ సాయంత్రం 6.25కు త్రిపురాంతకానికి చేరుకుంటుంది. ఈ బస్సు కుంట, మార్కాపురం, కంభం, పోరుమామిళ్ల, కడప, రాయచోటి, మదనపల్లి మీదుగా మరుసటి రోజు ఉదయం 6.30కు బెంగుళూరు చేరుతుంది. రాత్రి ఏడు గంటలకు బెంగుళూరులో బయలుదేరి రెండో రోజు ఉదయం 8 గంటలకు త్రిపురాంతకం మీదుగా నరసరావుపేట చేరుతుంది. ఈనేపథ్యంలో త్రిపురాంతకం వచ్చిన బస్సుకు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్వాగతం పలికి, ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. డ్రైవరు, కండక్టరు, ప్రయాణికులకు మంచినీళ్ల బాటిళ్ళు, బిస్కెట్ పాకెట్లను పంపిణీ చేశారు.

లారీ ఆర్టీసీ ఇంద్ర బస్సు ఢీ

● డ్రైవర్‌కు తీవ్రగాయాలు



ప్రమాదంలో నుజ్జయిన బస్సు ముందుభాగం

పొదిలి, ఫిబ్రవరి 24 : లారీ పొదిలి డిపోకు చెందిన ఇంద్ర బస్సు ఎదురెదురు ఢీకొన్న ఘటన పల్నాడు జిల్లా మాచర్ల సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే శుక్రవారం రాత్రి 9.30 నిమిషాలకు పొదిలి నుండి బీహెచ్ఈఎల్ వెళుతున్న ఆర్టీసీ ఇంద్రబస్సు మాచర్లకు ఏడు కిలోమీటర్ల దూరంలోకి వెళ్లేసరికి ఎదరుగా వస్తున్న లారీ బస్సును ఢీ కొట్టింది. ఈ ప్రమదంలో ఆర్టీసీ డ్రైవర్ బీవి రావ్‌కు, లారీ డ్రైవర్‌కు కాళ్ళు విరిగినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణీకులు క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ల ఇరువురిని బైటకుతీసి 108 వాహనంలో మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రదమచికిత్స అందించారు. ప్రమాదస్థలానికి మాచర్ల డిపోకు చెందిన అసిస్టెంట్ మేనేజర్ పరిశీలించి పొదిలి డిపోకు సమాచారం అందించారన్నారు.

ప్రభుత్వ వైద్యశాల పనితీరుపై విచారణ


వినతిపత్రం అందజేస్తున్న చెన్నకేశవరావు

కంభం, ఫిబ్రవరి 24 : కంభంలోని ప్రభుత్వ 50 పడకల వైద్యశాల పనితీరుపై మార్కాపురం ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి విచారణ చేపట్టారు. ప్రభుత్వ వైద్యశాలలో అవకతవకలు జరుగుతున్నాయని, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించడం లేదని, షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాటమాల చెన్నకేశవరావు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, మార్కాపురం సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డిని విచారణకు ఆదేశించారు. విచారణకు వచ్చిన సమయంలో చెన్నకేశవరావు మరోమారు తన ఫిర్యాదులను విచారణ అధికారి దృష్టికి తీసుకొచ్చారు. కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాలకు కేంద్రమైన కంభం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు వైద్యసేవలు సక్రమంగా అందడం లేదని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, రికార్డులలో సంతకాలు చేసి తంబ్ వేసి వెళ్లి పోతున్నారన్నారు. అత్యవసర కేసులను పరీక్షించకుండానే ఇక్కడ సదుపాయాలు లేవంటూ మార్కాపురం, గుంటూరుకు రెఫర్ చేస్తున్నారన్నారు. ప్రస్తుత వైద్యశాల సూపరింటెండెంట్ పట్టణంలో ప్రైవేటు వైద్యశాల నడుపుతూ ఇక్కడకు వచ్చే రోగులను ప్రైవేటు వైద్యశాలకు పంపిస్తున్నాడన్నారు. అలాగే వైద్యశాలకు వచ్చే హెచ్‌డిఎస్ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ల కొరకు వస్తే డబ్బులు అడుగుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు వీటన్నింటిపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. అదే సమయంలో వైద్యశాలకు వచ్చిన ఎంఆర్‌పీఎస్ నాయకులు షాలెంరాజు, జయరాజు విచారణకు వచ్చిన అధికారితో మాట్లాడుతూ వైద్యశాల సిబ్బందిలో రెండు గ్రూపులు ఉన్నాయని అందుకే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిపై స్పందించి విచారణ అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. తన విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానన్నారు.

రైల్వేస్టేషన్‌కు మహర్దశ



గిద్దలూరు రైల్వే స్టేషన్

గిద్దలూరు, ఫిబ్రవరి 24 : గిద్దలూరు రైల్వే స్టేషన్‌కు మహర్దశ పట్టింది. ప్రయాణి కులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేం దుకు వీలుగా అమృత్ భారతోత్సవ్ పథకంలో భాగంగా గిద్దలూరు రైల్వేస్టేషన్ ఎంపికైంది. మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.11.71 కోట్లు మంజూరయ్యాయి. ఈ నెల 26న ఈ పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా శంఖుస్థాపన చేయనున్నట్లు నోడల్ ఆఫీసర్ తిరుమలరావు, రైల్వేబోర్డు సభ్యుడు ఆర్.కే.జె.నరసింహం ప్రకటనలో తెలిపారు. గిద్దలూరులో గతంలో 1, 2 ప్లాట్‌ఫారాలు ఉండగా 440 మీటర్ల మేర మాత్రమే ప్రయాణికులు వేచి ఉండేందుకు పైకప్పు ఉండేది. కొత్తగా 3వ నెంబరు ప్లాట్‌ఫారమ్ ఏర్పాటు ఏర్పాటు చేశారు. మొత్తం 3 ప్లాట్‌ఫారాలకు కలిపి అదనంగా 762 మీటర్ల మేర పై కప్పును నిర్మించనున్నారు. వెయిటింగ్ హాల్ ఆధునీకరణ, లైటింగ్ బోర్డుల ఏర్పాటు, టికెట్‌బుకింగ్ ఏరియా అభివృద్ధి, పార్కింగ్ ఏరియా అభివృద్ధి, తదితర పనులకు సంబంధించి రూ.11.70 కోట్లు మంజూరైనట్లు వారు పేర్కొన్నారు. దేశంలోని 554 రైల్వేస్టేషన్లలో మౌలిక వసతుల అభివృద్ధి, 1500 ఆర్‌ఓబీలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి 26న ఉదయం 10.30 గంటలకు న్యూఢిల్లీ నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోడి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆమేరకు బహిరంగసభ, లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నోడల్ అధికారిగా నియమింపబడిన తిరుమలరావు పేర్కొన్నారు.

వైసీపీలో ఆగని జడ్పీ అలజడి

- దర్శికే బూచేపల్లి ప్రాధాన్యత
- అవకాశం కోసం బీసీ, దళితవర్గాల నుంచి ఒత్తిడి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌ను మార్పు చేయాలన్న సీఎం నిర్ణయంతో అధికార వైసీపీలో ఆరంభమైన అలజడి కొనసాగుతూనే ఉంది. ఈ విషయంలో బూచేపల్లి కుటుంబీకులు అంతర్మథనంలో ఉండగా ఆ పదవి కోసం బలహీన వర్గాల నుంచి పార్టీపై ఒత్తిడి పెరిగింది. ప్రస్తుత ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను మార్చి ఆమె స్థానంలో తర్లుపాడు జడ్పీటీసీ వెన్నా ఇందిరను ఎంపిక చేయాలని సీఎం జగన్ సూచించిన విషయం తెలిసిందే. శుక్రవారం ఒంగోలు వచ్చిన జగన్ ఈ విషయంపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం, హెలిప్యాడ్ వద్ద బూచేపల్లి కలిసి పునఃపరిశీలించాలని కోరటం విదితమే. వెంకాయమ్మ కుమారుడైన శివప్రసాదరెడ్డి దర్శి నుంచి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. దీంతో ఒకే ఇంట్లో రెండు పదవులు వద్దని, ఆమె స్థానంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి సతీమణి ఇందిరను ఎంపిక చేయాలని జగన్ సూచించారు. ఈ ఆకస్మిక నిర్ణయంతో కంగు తిన్న బూచేపల్లి తల్లిని కొనసాగించాలని సీఎంకు విన్నవించారు. అయితే రాష్ట్రంలో నాలుగు జిల్లాల్లో జడ్పీ ఛైర్మన్‌గా ఉన్నవారు లేక వారి కుటుంబీకులు అసెంబ్లీ నుంచి రంగంలో ఉండటంతో ఆ నాలుగు జిల్లాలలో జడ్పీ ఛైర్మన్లను మార్చాలని జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఇదే సంకేతాన్ని శనివారం పార్టీ అధిష్ఠానం బూచేపల్లి కుటుంబానికి పంపినట్లు తెలిసింది. అయితే దర్శికి అత్యంత ప్రాధాన్యతనిచ్చే బూచేపల్లి కుటుంబం అక్కడే పోటీకే మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ఆ మేరకు సీఎంను మరోసారి కలిసి ఎన్నికలయ్యే వరకు తన తల్లిని ఆ పదవిలో కొనసాగించాలని ఆ తర్వాత మీ నిర్ణయాన్ని అమలుచేయాలని కోరాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అయితే రాష్ట్రం లోని మరో మూడు జిల్లాలతో కూడా ఇదే సమస్య ముడిపడి ఉన్నందున బూచేపల్లి ప్రతిపాదనను సీఎం అంగీకరిస్తారా లేదా అనేది వెల్లడికావాల్సి ఉంది.

ఆశావహుల మధ్య పోటీ

కాగా జడ్పీ ఛైర్మన్‌ను మార్చాలన్న సీఎం నిర్ణయంతో ఆ పదవిని ఆశించే వారి మధ్య కూడా పోటీ పెరిగింది. ముఖ్యంగా బీసీ, దళిత వర్గానికి చెందిన జడ్పీటీసీలు వెంకాయమ్మను మారిస్తే తమకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానంను కోరుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం జడ్పీ వైస్ ఛైర్మన్లుగా సింగరాయకొండ జడ్పీటీసీ అయిన బీసీ మహిళ, మార్టూరు జడ్పీటీసీ అయిన దళిత మహిళ ఉన్నారు. వారు కూడా ఛైర్‌పర్సన్‌ను మారిస్తే తమకే అవకాశం ఇవ్వాలని అధిష్ఠానంను కోరినట్లు సమాచారం. అయితే రాజకీయ కోణంలో పశ్చిమ ప్రాంతానికి అందునా రెడ్డి సామాజికవర్గం వారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించిన జగన్ తన వైఖరిని మార్చుకుంటారో లేదో చూడాల్సి ఉంది. కానీ రాజకీయంగా కీలకమైన సమయంలో జడ్పీ ఛైర్‌పర్సన్‌ను మార్చాలన్న వ్యవహారం వైసీపీలో తీవ్ర గందరగోళాన్ని సృష్టించిందని చెప్పవచ్చు. అంతేగాక ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి పోటీచేయాలని రంగంలోకి రానున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డికి కూడా ఈ వ్యవహారం తలనొప్పిగా మారినట్లు తెలుస్తోంది.

వైభవంగా రాములవారి విగ్రహ ప్రతిష్ఠ

పొదిలి, ఫిబ్రవరి 24 : మండలంలోని గోగినేని వారిపాలెం గ్రామంలో సీతారామ లక్ష్మణ, హనుమత్ సమేత శ్రీకోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠాపనాచార్యులు పరంకుశం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, వాస్తుహోమం పూజ, గ్రత్వపూజ, పీఠారోహణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారామ కల్యాణం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ పురోహితులు గూడ బ్రహ్మానంద శర్మ తెలిపారు. ఈ సందర్భగా గ్రామం బంధువులతో కలకలలాడింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సైతం స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదిన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా వార్షికోత్సవ పూజలు

గిద్దలూరు : పట్టణంలోని రాచర్లగేటు సెంటర్ నందు గల శ్రీమదచలరుషి రాజయోగాశ్రమం 66వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అనసూయమాత సమేత దయానంద రాజయోగీశ్వరుల పాదపూజ, రాజయోగి పాదపూజ పీఠాధిపతి పొన్నాల క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా సామూహిక పారాయణం, భజన కార్యక్రమాలు, జెండా వందన మహోత్సవం నిర్వహించారు. . భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు కార్యక్రమంలో ఆశ్రమం ప్రతినిధులు శేగు సరస్వతమ్మ, కశెట్టి రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా త్రిపురాంతకేశ్వరాలయ గిరి ప్రదక్షిణం

త్రిపురాంతకం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని మొదటిసారిగా మాఘ పౌర్ణమి సందర్బంగా శనివారం వైభవంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధానార్చకులు విశ్వనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తూర్పు వైపు మెట్ల నుండి ప్రదక్షిణం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి ఛైర్మన్ ఇమ్మడిశెట్టి సుబ్బారావు, పాలక మండలి సభ్యులు, వీహెచ్‌పీ ప్రతినిధులు పాల్గొన్నారు.



పొదిలిలో రాములవారి శాంతి కల్యాణం, మార్కాపురంలో శివపార్వతులు

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం

తర్లుపాడు : తర్లుపాడులో వెలిసిన శ్రీ రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి కళ్యాణ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కారంపూడి వెంకటరమణాచార్యులు, భార్గవ రామాచార్యులు, వంశీకృష్ణాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్య క్రమాలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను కళ్యాణ మండపంపై తీసుకొచ్చి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఉభయదాతలు ఆలయ అనువంశిక ధర్మకర్త జవాజి విజయభాస్కర్‌రావు, ధర్మపత్ని శేషకుమారి, సాయికృష్ణ, ధర్మపత్ని హేమసాయి లక్ష్మీలు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సిద్ధం వెంకటకుమార్, ధర్మపత్ని నిర్మల స్వామివారికి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. తర్లుపాడు జెడ్పీటీసీ వెన్నా ఇందిరా, వీఆర్‌వో విజయభాస్కర్‌రెడ్డి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కళ్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఈదుల చెన్నకేశ వరెడ్డి, వివిధ వాహనాల ఉభయదాతలు జవాజి సత్యనారాయణ, కశ్శెట్టి జగన్ బాబు, వాసవీ సత్రం సభ్యులు పోలేపల్లి జనార్థన్, కోలగట్ల భాస్కర్ రెడ్డి, నేరెళ్ల శివకుమార్, దోగిపర్తి మల్లికార్జునరావు, భక్తులు పాల్గొన్నారు.

మార్కండేశ్వరుడికి విళక్కి పూజ

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక మార్కండేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి విళక్కి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శివస్వాముల ఆధ్వర్యంలో శివస్వాములకు అన్నప్రసాద వితరణ కల్పించారు. అనంతరం జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అర్చకులు వరుణ్‌తేజ శర్మ ఆధ్వర్యంలో వివిధ మంగళ వాయిద్యాలు, తీన్మార్ హోరు నడుమ విళక్కి మహోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పరిశీలించారు.



తర్లుపాడులో వేణుగోపాలస్వామి కల్యాణం, త్రిపురాంతకంలో గిరిప్రదక్షిణ

ప్రజలకు అందుబాటులో ఉండి సేవచేస్తా

- టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర
- భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి
- తొలి జాబితాలో పేరు ప్రకటనతో శ్రేణుల సంబరాలు

కనిగిరి, ఫిబ్రవరి 24 : కనిగిరి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. అధినేత చంద్రబాబు డాక్టర్ ఉగ్రకు కనిగిరి టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో దించేందుకు శనివారం విడుదల చేసిన తొలి జాబితాలో పేరున ఖరారు చేశారు. ఈ ప్రకటనపై కనిగిరి నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, శ్రేణు లు హర్షం వ్యక్తం చేస్తూ బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్ ఎదుట బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం వారంతా ఉగ్రకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీడియా ఎదుట డాక్టర్ ఉగ్ర తన సంతో షాన్ని పంచుకున్నారు. కనిగిరి ప్రజలకు సేవ చేసేందుకు తనను నమ్మి అధినేత చంద్రబాబు ఇచ్చిన అవకాశాన్ని సేవకుడిగా సద్వినియోగం చేసుకుంటానన్నారు. జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లోకేష్, రాష్ట్ర అధ్యక్షు డు అచ్చెన్నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాలుగున్నరేళ్లుగా పార్టీ కోసం కష్టపడి కనిగిరి నియోజకవర్గానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో ఎంతో కృషి చేసిన టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు, శ్రేణులకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ 50రోజులు కష్టపడి టీడీపీ జెండాను ఎగురవేద్దామని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా తెలుగు మహిళలు, నాయకులు ఉగ్రకు శుభాకాంక్షలు తెలిపారు.


కనిగిరిలో బాణసంచా కాల్చుతున్న టీడీపీ శ్రేణులు


పామూరులో బాణసంచా కాల్చుతున్న శ్రేణులు

పామూరులో శ్రేణుల హర్షం

పామూరు : కనిగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పేరు ఖరారు చేయడం పట్ల టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయం వద్ద శ్రేణులతో కలిసి బాణసంచా కాల్చారు. అనంతరం పువ్వాడి మాట్లాడుతూ ఉగ్ర విజయానికి శ్రమించాలని కోరారు. ఆదివారం ఉగ్ర సమక్షంలో మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ ఆధ్వర్యంలో వంద మంది టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. పువ్వాడి కల్యాణ మండపంలో జరిగే ఈ కార్యక్రమానికి ఆర్టీసీ బస్టాండ్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, కే సుభాషిణి, సయ్యద్ అమీర్‌బాబు, షేక్ ఖాజారహంతుల్లా, ఆర్‌ఆర్ రఫీ, డీవీ మనోహర్, శ్రీను, డోలా శేషాద్రి, షేక్‌గౌస్ బాషా, ఇర్రికోటి రెడ్డి, జీ శ్రీనివాసులు, ముబినా మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రకు శుభాకాంక్షలు

ఆర్య వైశ్య వర్గాని చెందిన కనిగిరి ఏఎంసీ మాజీ చైర్మన్, పామూరుకు చెందిన దరిశి రాము వైసీపీని వీడనున్నారు. కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో డాక్టర్ ఉగ్రను టీడీపీ పామూరు ఎన్నికల కమిటీ చైర్మన్ డీవీ మనోహర్‌తో కలిసి టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడం పై పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పామూరులో జరిగే కార్యక్రమంలో ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు రాము ప్రకటించారు.


ఉగ్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు, నాయకులు

చెంచిరెడ్డిపల్లి గ్రామస్థుల హర్షం

టీడీపీ అభ్యర్థిగా డాక్టర్ ఉగ్ర పేరును ప్రకటించడంపై చెంచిరెడ్డిపల్లి, సుబ్బక్కపల్లి గ్రామస్థులు హర్షం తెలిపారు. టీఎన్‌ఎస్‌వీ జిల్లా మాజీ కార్యదర్శి పోకా నాయుడుబాబు ఆధ్వర్యంలో చెంచిరెడ్డిపల్లి, సుబ్బక్కపల్లి గ్రామాల్లో శనివారం బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అందరినోటా ఒకటే మాట.. ఉగ్రన్న మళ్లీ రావాలి అనే పోస్టర్‌ను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో డాక్టర్ ఉగ్రను అత్యధిక మెజారిటీతో గెలిపించుకొని, నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిట్టేటి మాల కొండయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో టీడీపీ శ్రేణుల సంబరాలు

పీసీపల్లి : టీడీపీ అభ్యర్థిగా ఉగ్ర నరసింహారెడ్డి పేరును చంద్రబాబు శనివారం ప్రకటించారు. తొలి జాబితాలోనే ఉగ్ర నరసింహారెడ్డి పేరు ప్రకటించడం పట్ల మండలంలోని టీడీపీ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. పెదఇర్లపాడు, గుంటుపల్లి, పీసీపల్లి గుదేవారిపాలెం, వెంగళాయపల్లి పెదఅలవలపాడు గ్రామాల్లో పార్టీ నాయకులు కార్యకర్తలు మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. ఉగ్ర నరసింహారెడ్డికి ఫోన్, సోషల్ మీడియా వేదికగా శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత నీటి సరఫరాకు ట్యాంకర్ల ఏర్పాటు

ముందుకొచ్చిన టీడీపీ నేత వెంకన్న


నీటి ట్యాంకర్లను ప్రారంభిస్తున్న వెంకట్, వెంకన్నచౌదరి

దొనకొండ, ఫిబ్రవరి 24 : మండలంలో వేసవి ప్రారంభంలోనే నీటి సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి ముందుకొచ్చారు. నీటి సమస్య పరిష్కారానికి సొంత నిధులతో సమకూర్చిన రెండు మంచినీటి ట్యాంకర్లను దర్శి నియోజకవర్గ జనసేన నాయకుడు గరికపాటి వెంకట్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ దొనకొండలో నీటి సమస్య తీవ్రంగా ఉండడాన్ని గుర్తించి ట్యాంకర్లతో ఉచితంగా నీటిని అందిస్తున్న టీడీపీ నాయకుడు వెంకన్నచౌదరిని అభినందించారు. దర్శి నియోజకవర్గంలో జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో వంద వాటర్‌ప్లాంట్ల ఏర్పాటు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల ఏర్పాటుకు బాధ్యతగా చర్యలు చేపడతామని వెంకట్ హామీ ఇచ్చారు. టీడీపీ నాయకుడు వెంకన్నచౌదరి మాట్లాడుతూ మండలంలో నీళ్ల అవసరమైన గ్రామాలకు ఉచితంగా ట్యాంకర్ల ద్వారా నీటిని అందజేస్తానని చెప్పారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకొని వేసవి నుంచి గట్టెక్కాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, సీనియర్ నాయకుడు షేక్ సుభానీ, తాండ్ర వెంకటేశ్వర్లు, కామేపల్లి చెంచయ్య, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, తోటా కోటేశ్వరరావు, వల్లపునేని వెంకటస్వామి, వేగినాటి అల్లూరయ్య, సింగమనేని హనుమంతు, విప్పర్ల శేషు, వల్లపునేని ఆదినారాయణ, ఫణిదపు అనంతరాములు, పులిమి శివ, బోయపాటి సుబ్బయ్య, బత్తుల గాలయ్య ఫణిదపు వీరాంజనేయులు, పురుషోత్తం సత్యానందం మరికొందరు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


WANTED

ప్రముఖ దినపత్రిక ఆంధ్రజ్యోతి సర్క్యులేషన్ డిపార్ట్‌మెంట్‌లో సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేయుటకు అర్హులైన అభ్యర్థులు కావలెను.

విద్యార్హతలు : 10th/ ఇంటర్
వయస్సు : 21 నుండి 35 సంవత్సరములలోపు
అనుభవం : ఏదైనా దినపత్రికలో పనిచేసిన వారికి ప్రాధాన్యత. సమర్థులైన కొత్త వారికి అవకాశం కలదు.
జీతభత్యములు : రూ. 16,000/- (ప్రయాణపు ఖర్చులు కలిపి)

పనిచేయవలసిన కేంద్రాలు :
గిద్దలూరు, కనిగిరి, పొదిలి

టూ వీలర్ కలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

ఆసక్తి కలవారు తమ బయోడేటా, జిరాక్స్ సర్టిఫికెట్స్‌తో ఈ క్రింది చిరునామాలో ది. 27-02-2024న ఉ॥ 11 గం॥ల నుండి 1.30 గం॥లోపు సంప్రదించగలరు.

సంప్రదించవలసిన చిరునామా
ఆంధ్రజ్యోతి కార్యాలయం
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం. 206/2,3, చీరాలరోడ్, త్రోవగుంట గ్రామం, ఒంగోలు రూరల్ (మం), ప్రకాశంజిల్లా - 523 262
A.C.M: 9985411484 B.M: 9985411481

కనిగిరి టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర ప్రొఫైల్



పేరు	: డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి
ప్రస్తుత పదవి	: మాజీ ఎమ్మెల్యే, కనిగిరి.
జన్మించిన తేదీ	: 08-02-1973
జన్మించిన స్థలం	: తిమ్మారెడ్డిపల్లి, హనుమంతునిపాడు మండలం. కనిగిరి నియోజకవర్గం.
తల్లిదండ్రులు	: ముక్కు నరసారెడ్డి (మాజీ వైస్ ఎంపీపీ), ముక్కు రత్తమ్మ (మాజీ జడ్పీటీసీ, హనుమంతునిపాడు మండలం.)
సతీమణి	: డాక్టర్ ముక్కు కవిత, గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు
సంతానం	: కుమారుడు - జయసింహారెడ్డి, కుమార్తె - ఊహశ్రీ
విద్యార్హతలు	: ఎంబీబీఎస్, దావణగిరి
వృత్తి	: వైద్యం, గుంటూరు అమరావతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్

రాజకీయ చరిత్ర : 2009లో కనిగిరి నియోజకవర్గంలో నుంచి కాంగ్రెస్ తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఉగ్ర విజయం సాధించారు. 2014లో కాంగ్రెస్ తరుపున పోటీలో ఉన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా పనిచేశారు. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల రంగంలో నిలిచారు. సమీప అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌పై తలపడ్డారు. డాక్టర్ ఉగ్ర 2009 ఎమ్మెల్యేగా ఉన్న సమయం నుంచి, ఆ తర్వాత కూడా జననీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు, ఇతర వైద్య శిబిరాలు, ఉచితంగా మోకాళ్ల శస్త్ర చికిత్సలు పెద్ద ఎత్తున నిర్వహించారు. నిరుపేదలకు సాయం చేయడంతో పాటు అన్న క్యాంటీన్ ద్వారా రోజూ పేదలకు అన్నం పెడుతున్నారు. అంతేకాకుండా పేద, బడుగు వర్గాలకు చేయూతగా ఉచిత కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు, మూడు చక్రాల బండ్లు వంటివి అందించి వారికి బాసటగా నిలుస్తున్నారు. తల్లిదండ్రుల పేరిట పేదలకు నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఆపదలో ఉన్న వారు ఏ వర్గానికైనా తన వంతు సహాయ సహకారాలు అందించడంతోపాటు, వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తున్నారు. ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా, కనిగిరిలోనే ఉంటూ కార్యకర్తలకు, నాయకులకు, శ్రేణులకు, శ్రేయాభిలాషులకు అండగా నిలిచారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ తరుపున కనిగిరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా మరోసారి ఎన్నికల్లో పోటీ చేయనున్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేనదే గెలుపు

- జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చేందుకు జనం సిద్ధం
- జనసేన పార్టీ నాయకుడు వెంకట్


టీడీపీ ప్రభపై మాట్లాడుతున్న జనసేన పార్టీ నాయకుడు వెంకట్

ముండ్లమూరు, ఫిబ్రవరి 24 : వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీ కూటమిదే అధికారమని జనసేన పార్టీ దర్శి నియోజకవర్గ నాయకుడు గరికపాటి వెంకట్ అన్నారు. కొండ గురునాథ స్వామి తిరుణాళ్ల సందర్భంగా మండలంలోని వేముల టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారం చేపట్టిన నాలుగు సంవత్సరాల పది నెలల కాలంలో అవినీతి, అరాచకం తప్ప అభివృద్ధి ఎక్కడా లేదన్నారు. మరికొద్ది రోజుల్లో జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చేందుకు యావత్ రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రగతి లేని, రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను జగన్‌రెడ్డి నాశనం చేశారన్నారు. 2014, 2019 కాలంలో టీడీపీ చేసిన అభివృద్ధి తప్ప ఈ ఐదేళ్లలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేయలని దుస్థితికి చేర్చారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన కొండగురునాథ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తోట రామారావు, వేముల సర్పంచ్ గజ్జల సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ సూరపరెడ్డి ఏడుకొండలరెడ్డి, బేతా కోటిరెడ్డి, అన్నె వెంకటేశ్వరరెడ్డి, నాగినేని నాగేశ్వరరావు, దామా కృష్ణ, సూరా శేషిరెడ్డి, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి కల్యాణ వేడుకలు

దర్శి : దర్శి పట్టణంలోని శ్రీ లక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 24 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటు హక్కు వేసేందుకు వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తహసీల్దార్ జే మధుబాబు అన్నారు. శనివారం మండలంలోని మక్కెనవారిపాలెం, జమ్మలమడక, నూజెండ్లపల్లి, మారెళ్ల, సుంకరవారిపాలెం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. బీఎల్‌వోలు, హెచ్‌ఎంలతో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా కేంద్రాల వద్ద మరుగుదొడ్లు, తాగు నీరు, విద్యుత్, ర్యాంప్ ఉండేలా చూడాలన్నారు. అనంతరం మధుబాబు గ్రామస్థులతో మాట్లాడారు. ఆయనతోపాటు వీఆర్‌వో బీ గురవయ్య, వేణుగోపాలరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ దేవకాంత్ ఉన్నారు.

దివ్యాంగులకు మూడు చక్రాల మోటర్ సైకిళ్ల పంపిణీ


వాహనాలను అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

దర్శి, ఫిబ్రవరి 24 : మండలంలోని ఆరుగురు దివ్యాంగులకు జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసీపీ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మూడు చక్రాల మోటర్ సైకిళ్లను శనివారం పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ నిధుల ద్వారా రూ.7.50 లక్షల వ్యయంతో వీటిని కొనుగోలు చేశారు. మండలంలోని దివ్యాంగులను గుర్తించి దర్శిలోని బూచేపల్లి నివాసం వద్ద దివ్యాంగులకు అందజేశారు. తమ ట్రస్టు ద్వారా కూడా దివ్యాంగుల అభ్యున్నతికి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో హనుమంతరావు, ఎంపీడీవోలు రాఘవేంద్ర, హనుమంతరావు, ఏఎంసీ మాజీ చైర్మన్‌వి వెంకటరెడ్డి, రాష్ట్ర బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కే అంజిరెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, బండి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయానికి మోటర్ బహూకరణ

కనిగిరి, ఫిబ్రవరి 24: గ్రంథాలయానికి నీటి మోటర్‌ను కనిగిరి కవులు శనివారం బహూకరించారు. గ్రంథాలయంలో నీటి వసతికి ఇబ్బందిగా ఉండడంతో వారు రూ.7వేలు విలువచేసే మోటర్‌ను గ్రంథపాలకుడు షరీఫ్‌కు అందించారు. వారు మాట్లాడుతూ గ్రంథాలయా మనుగడకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. విద్యార్థులు సాహిత్య పుస్తకాలను చదివి తెలుగు భాషపై పట్టు సాధించాలని అభిలషించారు. కార్యక్రమంలో కవి కొండ్రెడ్డి వెంకటరెడ్డి, జేవీవీ గయాజ్‌తో పాటు కవులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్మార్ట్‌వాచ్‌ల బహూకరణ

పీసీపల్లి, ఫిబ్రవరి 24 : మండలంలోని నేరేడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు స్వర్ణ అశోక్ స్మార్ట్‌వాచ్‌లను ఉచితంగా బహూకరించారు. గ్రామానికి చెందిన అశోక్ టయోటా కంపెనీలో మెకానికల్‌గా పనిచేస్తున్నారు. పరీక్షలున్న నేపథ్యంలో వాచ్‌లు ఇవ్వాలని హెచ్‌ఎం అంజలీదేవిని సంప్రదించారు. రూ.25వేల విలువగల 75 స్మార్ట్ వాచ్‌లను వారికి శనివారం అందజేశారు. ఈసందర్భంగా వాచ్‌లను బహూకరించిన దాత అశోక్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ అవార్డు గ్రహీత స్వాతికి సన్మానం


స్వాతి దంపతులను సన్మానిస్తున్న టీచర్లు

కురిచేడు, ఫిబ్రవరి 24: కురిచేడు మండలం బోదనంపాడు ఎస్సీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వల్లెం స్వాతికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ లభించింది. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన నవాచార గతి విద్యా సమూహమ్ వారిచే స్వాతి అవార్డును అందుకున్నారు. ఏపీటీఎఫ్ మండల శాఖ ఉపాధ్యాయులు శనివారం స్వాతిని ఘనంగా సత్కరించారు. కురిచేడు ఉర్దూ పాఠశాల ఆవరణలో సత్కార సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు అధ్యక్షుడు వీవీ రమణారావు మాట్లాడుతూ ఉత్తమ సేవలు అందించిన స్వాతిని అవార్డులు వెతుక్కుంటూ వస్తాయన్నారు. అనంతరం స్వాతిని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అధ్యక్షుడు పఠాన్ కరిముల్లా, ప్రధాన కార్యదర్శి ఖాజా రహంతుల్లా, జిల్లా కార్యదర్శి సీహెచ్. శివరామక్రిష్ణ, పచ్చా పూర్ణ చంద్రరావు, ఫిజికల్ డైరెక్టర్ ఆసుల వెంకట స్వామి, కేజీబీవీ హెచ్‌ఎం పద్మ, కిరణ్ కుమారి, మహితేజ, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో మేలుచేసే సూక్ష్మజీవుల వృద్ధి

తాళ్లూరు, ఫిబ్రవరి 24 : మేలు చేసే సూక్ష్మజీవుల వృద్ధికి ప్రకృతి వ్యవసాయమే ప్రత్యామ్నాయమని వ్యవసాయాధికారి బీ.ప్రసాదరావు తెలిపారు. తూర్పుగంగవరంలో పలురకాల పంటలను శనివారం పరిశీలించారు. పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మొక్కల సమగ్ర పోషకాలకు పంటల వైద్యం చాలా ముఖ్యమన్నారు. పలు రకాల పంటల కలయికతో ప్రకృతి సమతుల్యంగా వుంటుందన్నారు. భూమిలో ఏర్పడ్డ జీవవైవిధ్యం వల్ల వెలువడే పిండి పదార్థాల వల్ల సూక్ష్మజీవులు అధికంగా వృద్ధి చెందేందుకు ఉపయోగపడి పరాన్నజీవులు గణనీయంగా పెరిగి నేలలోని ఆహార గొలుసు సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. వివిధ కాలాల్లో వివిధ పంటలను ఒకే పొలంలో వేసుకుంటే సూక్ష్మజీవుల వృద్ధి, ప్రకృతి సమతుల్యత, అధిక ఆదాయం వస్తుందని ఏవో ప్రసాదరావు తెలిపారు.

నైపుణ్యతతో ఆర్థికాభివృద్ధి


ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న జన శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్యాంసునీల్, ఎంపీడీవో యుగకీర్తి

తాళ్లూరు, ఫిబ్రవరి 24 : వృత్తి పరమైన అంశాల్లో శిక్షణ పొంది నైపుణ్యత సాధిస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని జన శిక్షణ సంస్థ డైరెక్టర్ కె.శ్యాంసునీల్ తెలిపారు. మండలంలోని బొద్దికూపాడు నైపుణ్య అభివృద్ధి, ఔత్సాహిక మంత్రిత్వ శాఖ, జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో డ్రెస్ మేకింగ్‌లో శిక్షణ పొందిన వారికి ధృవీకరణ పత్రాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు డీబీఆర్‌సీ కోఆర్డినేటర్ నాగమణి అధ్యక్షత వహించారు. డైరెక్టర్ శ్యాంబాబు మాట్లాడుతూ జన శిక్షణ చేపట్టే శిక్షణ కార్యక్రమాలు వ్యక్తుల అభిలాషను సంతృప్తి పరుస్తుందన్నారు. నిరుద్యోగ యువత, మహిళలు, గర్భిణులు, వెనుకబడిన తరగతులవారికి డ్రెస్ మేకింగ్, బ్యూటీషియన్, హ్యాండ్ ఎంబ్రాయిడింగ్, మగ్గం వర్క్, ఫ్యాషన్ జ్యువెలరీ, బేసిక్ కంప్యూటర్స్‌లో శిక్షణ ఇవ్వడంతోపాటు ఆర్థికంగా వారు అభివృద్ధి చెందేలా కృషి చేస్తామన్నారు. డీఆర్‌డీఏ ఏపీఎం పి.దేవరాజ్ మాట్లాడుతూ వృత్తి నైపుణ్య శిక్షణ పొందిన వారు యూనిట్లు నెలకొల్పేందుకు ముందుకువస్తే డీఆర్‌డీ ద్వారా ఆర్థిక సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.యుగకీర్తి, బ్యాంక్ మిత్ర ఎం.విజయలక్ష్మి, ఇన్‌స్ట్రక్టర్ బి.రాజేశ్వరి, శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

అఘాయిత్యంపై కేసు నమోదు

పామూరు, ఫిబ్రవరి 24 : వృద్ధురాలిపై వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన ఘటన మండలంలోని పోతవరం గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ ఎం.సైదుబాబు తెలిపిన వివరాల మేరకు.. పోతవరంలో వృద్ధురాలు ఒంటరిగా నిద్రిస్తుంది. మద్యం మత్తులో వ్యక్తి (45) వృద్ధురాలిపై ఘాతుకానికి పాల్పడ్డాడు. ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో బాధితురాలు చేరగా, ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైదుబాబు తెలిపారు.

చెరువు స్థలంలో సచివాలయ నిర్మాణం

- కోర్టును ఆశ్రయించిన గ్రామస్థులు
- స్టేతో నిలిచిన పనులు
- దుర్వినియోగమైన నిధులు
- పడమటకట్టకిందపల్లిలో నిర్మించాలని ప్రజల విజ్ఞప్తి


డీవీపల్లిలో పునాది దశలో నిలిచిన సచివాలయ నిర్మాణం

పామూరు, ఫిబ్రవరి 24 : మండలంలోని పడమటకట్టకిందపల్లిలో గ్రామ సచివాలయ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. గ్రామ పంచాయతీ కార్యాలయం ఉన్న పడమట కట్టకిందపల్లిలో సచివాలయం నిర్మించాల్సి ఉండగా, అధికార వైసీపీ నాయకులు తమకు అనుకూలంగా ఉన్న డీవీపల్లిలోని పీడబ్ల్యూడీ స్థలమైన చెరువుతొట్టి ప్రాంతంలో నిర్మించేందుకు ఎమ్మెల్యే సిఫార్సులతో పనులు ప్రారంభించారు. చెరువు ప్రాంతంతో సచివాలయ నిర్మాణ పనులు చేపట్టవద్దంటూ కొందరు గ్రామస్థులు కోర్టును ఆశ్రయించారు. దీంతో నిర్మాణ పనులు పునాది దశలో నిలిచిపోయాయి. అప్పట్లో కాంట్రాక్టర్‌కు రూ.3లక్షల నిధులు మంజూరు చేసింది. సచివాలయ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోర్టు స్టే ఇవ్వడంతో పునాది దశలో పనులు నిలిచిపోయాయి. సిమెంటు, స్టీల్, సామగ్రిని కాంట్రాక్టర్ వేరే పనులకు అమ్ముకున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇదిలావుండగా సచివాలయ నిర్మాణం ఆగిపోవడంతో చాలీచాలని పంచాయతీ భవనంలో ఇబ్బందుల నడుమ కార్యకలాపాలు సాగుతున్నాయి. కట్టకిందపల్లిలో సచివాయ నిర్మాణ జరగకపోగా డీవీపల్లిలో పనులు నిలిచిపోయిన క్రమంలో నిధులు దుర్వినియోగమయ్యాయని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆ శాఖ అధికారులు కట్టకిందపల్లిలో సచివాలయ నిర్మాణ పనులు ప్రారంభించాలని, గతంలో కాంట్రాక్టర్‌కు ఇచ్చిన నిధులను రికవరీ చేసి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

టీటీడీకి 25 గోవుల విరాళం

అందజేసిన ఎమ్మెల్యే మద్దిశెట్టి

తిరుమల, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి శనివారం 25 సాహివాల్ గోవులు విరాళంగా అందాయి. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ గుజరాత్‌కు చెందిన 25 సాహివాల్ జాతి గోవులను తిరుపతిలోని ఎస్వీ గోశాలలో శనివారం అందజేశారు. టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డి, ఈవో ధర్మారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శ్రీవారి నైవేద్యానికి రోజుకు 30 కిలోల నెయ్యి అవసరమవుతుందని, దీని కోసం టీటీడీలో ఉన్న గోవులతోపాటు మరో 500 దేశీయ గోవులు అవసరమవుతాయన్నారు. ఇందులో భాగంగా దర్శి ఎమ్మెల్యే గతంలో 25 గిర్ జాతి గోవులను విరాళంగా అందించినట్లు తెలిపారు. అనంతరం గోవులకు పూజలు నిర్వహించి దాణా అందించారు. తర్వాత ఎమ్మెల్యే వేణుగోపాల్ దంపతులను సత్కరించి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ఎస్వీ గోశాల డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ జ్యోతమ్మ కన్నుమూత


కీ.శే. నీరుకట్టు జ్యోతమ్మ గారు

పామూరు, ఫిబ్రవరి 24 : మండలంలోని తూర్పుకట్టకిందపల్లి గ్రామ మాజీ సర్పంచ్ నీరుకట్టు జ్యోతమ్మ (80) అనారోగ్యంతో శనివారం ఉదయం ఇంటివద్ద మరణించారు. ఆమె భర్త నీరుకట్టు మాల్యాద్రినాయుడు గత ఏడాది మృతి చెందారు. జ్యోతమ్మ 2009 నుంచి 2014 వరకు, 2014 నుంచి 1019 వరకు వరుసగా రెండు పర్యాయాలు సర్పంచ్‌గా ప్రజలకు ఉత్తమ సేవలందించారు. ఆమెకు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆమె 4వ కుమారుడు నీరుకట్టు హరిప్రసాద్ మండల మాజీ వైస్ ఎంపీపీగా, మండల రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. ఆదివారం జ్యోతిమ్మ అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

చెదల నివారణ
చెదలు బారి నుండి విలువైన మీ ఇంటిని కాపాడుకోండి. ఈగలు, బొద్దింకలు మొ॥ గ్యారంటీగా నివారించబడును. సంప్ర॥ బాబు, ఒంగోలు, సెల్ : 99854 21321, 97036 45295
AJO-170493

ఇంటి ఋణాలు
రేకుల ఇల్లు / పెంకుల ఇల్లు / స్లాబ్ ఇల్లు / వ్యవసాయ ఋణాలు / ఖాళీ స్థలాలకు / OTS పట్టాలు / కడుతున్న ఇల్లు / కట్టిన ఇల్లు / మొ॥ వాటికి తక్కువ వడ్డీకి ఇప్పించబడును. 18సం॥ సర్వీస్ ఇస్తున్నాం. సంప్ర॥ 9502466253
AJO-151034

FLAT FOR SALE
ఒంగోలు కొప్పోలు రోడ్‌లోని డ్రీమ్స్ స్కూల్ వెనుక గల 3 బెడ్‌రూమ్ గ్రూప్ హౌస్ అపార్ట్‌మెంట్ రెడీ టూ ఆక్యుపై, సంప్ర॥ అమరా కన్‌స్ట్రక్షన్స్, సెల్: 9440265170, 9164217325
AJO-151222

అమ్మబడును
నెల్లూరు జిల్లా కందుకూరు టౌన్‌లో 30 గదులు (అంకణాలు) కొన్నవారికి 60 అంకణాల కారు పార్కింగ్ ఫ్రీగా ఇవ్వబడును. టౌన్‌లో ఇంటి స్థలం 40 గదులు. గది 75,000 కు కలదు. సంప్ర॥ 9704250705
AJO-183679

PROPERTY FOR SALE
ఇరవై అంకణముల ఇంటి స్థలం అమ్మకం. రెవెన్యూ కాలనీ, కందుకూరు. బలరాం Cont : 9440279283
AJH-01561

రియల్ ఎస్టేట్
గుంటూరు సిటీకి అతి సమీపంలో లాం గ్రామం నందు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దగ్గర సువర్ణ కుటీర్ డెవలపర్స్ వారి 18వ CRDA అప్రూవుడ్ వెంచర్ చ.గ 11,000 మాత్రమే. బ్యాంకు లోను సదుపాయం కలదు. సంప్ర॥ 88868 55355, 88863 55955
AJG-152149

WANTED STAFF
కాంతి ఐస్‌క్రీమ్స్, ఒంగోలు నందు పని చేయుటకు Boys & Girls కావలెను. Full time & Part time. ఒంగోలు వారు మాత్రమే సంప్రదించగలరు. సెల్: 9247580211
AJO-183703

WANTED
WANTED ONE DATA ENTRY OPERATOR (Ladies Only), to work in Ongole. Graduate / Diploma holders having one year experience, Age below 35, Salary 12,000 P.M / Negotiable, Contact : 8977772106.
AJO-170495

WANTED
సరిపూడి సుజుకి టూవీలర్ షోరూం, ఒంగోలు నందు పనిచేయుటకు ఇంటర్ /డిగ్రీ అర్హత కలిగిన అకౌంటెంట్స్, క్యాషియర్స్ కావలెను. బాధ్యతలను అనుసరించి జీతం కలదు. 5 ఖాళీలు కలవు. సంప్ర॥ 7799960149.
AJG-1279

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

ఆంధ్రజ్యోతి
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, ఉద్యోగ, వ్యాపార, బహిరంగ ప్రకటనలు, అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥
ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358
ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు మరియు పేపరు పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥
Asst-Cir-Manager. 9985411484

ఆంధ్రజ్యోతి
బాపట్ల జిల్లా
5 ఆదివారం 25 ఫిబ్రవరి 2024



సైకిల్ గుర్తుకే
ఓటు వేద్దాం...
నరేంద్ర వర్మ గారిని
గెలిపిద్దాం...





హృదయపూర్వక కృతజ్ఞతలు

తెలుగుదేశం పార్టీ అభ్యర్థిత్వం...నాకు లభించిన ఒక అదృష్టం...
మరువలేనిది మీ సంపూర్ణ సహకారం... తెలుగుదేశాన్ని గెలిపించడమే మా ప్రధాన లక్ష్యం...
నిండైన మీ ఆశీస్సులతో బలమైన నాయకత్వంతో ముందుకెళ్తాం...
కొండంత మీ అండతో తెలుగుదేశాన్ని గెలిపిస్తాం....

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు **శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి**
జనసేన పార్టీ అధ్యక్షులు **శ్రీ పవన్ కళ్యాణ్ గారికి**
హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి

/vegesana Narendra varma



ఎన్నికల బరిలో నిలిచేది ఎవరు.. ఎవరికి టిక్కెట్ ఇస్తారు.. వైసీపీ ఫేక్ ప్రచారం.. పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ.. తదితరాలన్నింటికీ తెరపడింది. ఎన్నికల బరిలో ఉండేదెవరో స్పష్టత వచ్చేసింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మూడు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని 14 అసెంబ్లీ స్థానాలకు శనివారం టీడీపీ, జనసేన అధినేతలు సంయుక్తంగా ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించారు. సిట్టింగ్‌లకు.. సీనియర్లకు.. సమర్థతకు.. విధేయతకు తొలిజాబితాలో పెద్ద పీట వేశారు. ప్రతి ఎన్నికల్లోనూ చివరి నిమిషాన పేరు ప్రకటించే సంప్రదాయానికి భిన్నంగా చంద్రబాబు ఈ సారి 52 రోజుల ముందే అభ్యర్థి ఎవరో తేల్చేయడం గమనార్హం. పొత్తు నేపథ్యంలో జనసేన ప్రకటించిన జాబితాలో తెనాలి ఉండగా ఇక్కడి నుంచి ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నాదెండ్ల మనోహర్‌కు అవకాశం దక్కింది. రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్ల ప్రకటనతో ఇరు పార్టీల శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. అభ్యర్థులకు అభినందనలు తెలుపుతూ, ప్రదర్శనలు నిర్వహిస్తూ బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఎన్నికల్లో సత్తా చూపి విజయభావుటా ఎగరవేసి అధినేతలకు గిఫ్ట్ అందజేస్తామని అభ్యర్థులు ప్రకటించారు.

ఉమ్మడిగా.. సై




- టీడీపీ, జనసేన తొలి జాబితా విడుదల
- పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు.. సంబరాలు
- తెనాలి నుంచి జనసేన అభ్యర్థిగా మనోహర్ పేరు ఖరారు
- గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 14 స్థానాల్లో అభ్యర్థుల ఖరారు
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సీనియర్లకు మరో అవకాశం
- బాపట్ల జిల్లాలో మూడు చోట్ల సిట్టింగ్‌లకే తిరిగి అవకాశం
- బాపట్ల నుంచి వేగేశన, ప్రత్తిపాడు నుంచి రామాంజనేయులు తొలి సారి పోటీ

(గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, తెనాలి, ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం, జనసేన పార్టీల తరఫున శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితా విడుదలతో ఉత్కంఠకు తెరపడింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఆరుగురి మినహా మిగిలిన అన్ని స్థానాలకు అభ్యర్థులను ఒకేసారి ప్రకటించారు. దీంతో ఇరు పార్టీల శ్రేణులు ఆనందోత్సాహాలలో మునిగి తేలారు. అభ్యర్థులు సైతం ఇకపై మరింతగా ప్రజలతో మమేకమయ్యేందుకు కార్యాచరణకు సిద్ధమయ్యారు. జిల్లాలో వైసీపీ ఖాతా తెరవకుండా ఉండడమే లక్ష్యంగా తమ కార్యాచరణ ఉండనున్నదని అభ్యర్థులు ప్రకటించారు. తొలి జాబితాలో పల్నాడు జిల్లా పరిధిలోని నాలుగు స్థానాలకు, బాపట్ల జిల్లా పరిధిలోని చీరాల మినహా మిగిలిన ఐదు స్థానాలకు, గుంటూరు జిల్లా పరిధిలోని ఐదు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. వైసీపీలో అభ్యర్థుల ఎంపికపై గందరగోళం నెలకొనగా టీడీపీ ముందంజలో ఉంది. ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించి టీడీపీ, వైసీపీకి సవాల్ విసిరింది. తొలి జాబితాలో సీటు ఖరారైన వారిలో మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనందబాబులు ఉన్నారు. బాపట్ల జిల్లాలో రేపల్లె, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లకే అవకాశం కల్పించారు. బాపట్ల నుంచి వేగేశన నరేంద్రవర్మ, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నుంచి విశ్రాంత ఐఏఎస్ బూర్ల రామాంజనేయులు తొలిసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పార్టీ అభ్యర్థుల ప్రకటనతో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీలతో పాటు బాణసంచా కాల్చి అనందోత్సాహాలను వ్యక్తం చేశాయి. అభ్యర్థులను నేతలు, కార్యకర్తలు కలిసి సత్కరించారు. నేతలకు శుభాకాంక్షలు చెప్పడానికి శ్రేణులు పార్టీ కార్యాలయాల్లో బారులు తీరారు. ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని అటు టీడీపీ, ఇటు జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రకటించారు.

నాలుగోసారి జీవీ



టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులుకు వినుకొండ నుంచి పోటీకి నాలుగో సారి అధిష్ఠానం అవకాశం ఇచ్చింది. ఆయన వినుకొండ నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో ఓటమి చెందిన జీవీ వరుసగా నాలుగోసారి వినుకొండ బరిలో దిగుతున్నారు. టీడీపీ ఆవిర్భావం అనంతరం జరిగిన ఎన్నికల్లో ఇక్కడ మూడు సార్లు పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. టీడీపీ పొత్తులో సీపీఐ రెండు సార్లు విజయం సాధించింది. మొదటి నుంచి టీడీపీకి వినుకొండ బలమైన నియోజకవర్గం.

సత్తెనపల్లి నుంచి కన్నా



సత్తెనపల్లి నుంచి మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పేరును పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. గతంలో నాలుగుసార్లు పెదకూరపాడు నుంచి, గుంటూరు పశ్చిమ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందిన కన్నా టీడీపీ అభ్యర్థిగా తొలి సారి సత్తెనపల్లి బరిలో దిగుతున్నారు. 1989లో మొట్టమొదటి సారిగా పెదకూరపాడు అసెంబ్లీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1994, 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత 2009లో గుంటూరు పశ్చిమ నుంచి విజయం సాధించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి, కొణిజేటి రోశయ్య, ఎన్ కిరణ్ కుమార్‌రెడ్డిల మంత్రి వర్గాల్లో పలు మంత్రి పదవులు నిర్వహించారు. కాగా 2024 ఫిబ్రవరి 24న ఆయనను సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించారు.

పుల్లారావు ఆరోసారి



చిలకలూరిపేట నుంచి వరుసగా ఆరోసారి మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పోటీ చేస్తున్నారు. గతంలో ఐదు సార్లు పోటీ చేయగా మూడు సార్లు విజయం సాధించారు. 1983 నుంచి జరిగిన ఎన్నికల్లో 1983, 1989, 1999, 2009, 2014, ఎన్నికల్లో టీడీపీ ఇక్కడ విజయం సాధించింది.

బ్రహ్మారెడ్డి మూడోసారి..



మాచర్ల టీడీపీ అభ్యర్థిగా జూలకంటి బ్రహ్మారెడ్డి పేరును అధిష్ఠానం ప్రకటించింది. ఉన్నత విద్య చదివిన బ్రహ్మారెడ్డి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం ఇది మూడోసారి. వారి తల్లి దండ్రులు నాల్గుసార్లు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు. గతంలో 2004, 2009 ఎన్నికల్లో ఓటమి చెందారు. 1999లో బ్రహ్మారెడ్డి తల్లి దుర్గాంబ ఎమ్మెల్యేగా గెలుపొందారు. మాచర్లలో అరాచకాలను అడ్డుకుంటూ పార్టీ క్యాడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేశారు. 2021 డిసెంబరు 22న బ్రహ్మారెడ్డిని మాచర్ల ఇన్‌చార్జిగా చంద్రబాబు నియమించారు. దీంతో నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌లో ఉత్సాహం, ధైర్యం నెలకొంది. ఏదైనా జరిగితే బ్రహ్మారెడ్డి వస్తాడనే భావం ఆ పార్టీ నేతల్లో ఉంది.

పల్నాడు జిల్లా..

సత్తెనపల్లి	కన్నా లక్ష్మీనారాయణ
చిలకలూరిపేట	ప్రత్తిపాటి పుల్లారావు
వినుకొండ	జీవీ ఆంజనేయులు
మాచర్ల	జూలకంటి బ్రహ్మారెడ్డి





ఆనందబాబు నాలుగో సారి..

వేమూరు అభ్యర్థిగా బరిలో ఉండనున్న మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు రాజకీయాల్లో అంచలంచలుగా ఎదిగారు. కొల్లిపర మండలం సిరిపురంలో జన్మించిన ఆయన గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. తదుపరి బీఏ పూర్తి చేసి, ఆంధ్ర యూనివర్సిటీలో బీఎల్ పట్టా పొందారు. రాజకీయాలపై ఆసక్తితో 1987-88లలో గుంటూరు జిల్లా తెలుగు విద్యార్థి అధ్యక్షుడిగా ఐదేళ్ల తర్వాత ఆర్గనైజింగ్ సెక్రటరిగా, పార్టీ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. 2009లో తొలిసారి వేమూరు నుంచి గెలుపొందారు. 2014లో రెండోసారి విజయం సాధించి మంత్రిగా కూడా పనిచేశారు. 2019లో ఓటమి పాలయ్యారు. మరలా ఇప్పుడు టీడీపీ అభ్యర్థిగా వేమూరు నుంచి బరిలో దిగనున్నారు.

గొట్టిపాటి ఐదో సారి




అద్దంకి నుంచి వరుసగా నాలుగు పర్యాయాలు గెలు పొంది ఓటమెరుగని నేతగా గొట్టిపాటి రవికుమార్ కీర్తి గడించారు. ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న రవికుమార్‌కే మరో సారి టీడీపీ నుంచి పోటీ చేసే అవకాశం వచ్చింది. 2004లో మార్టూరు నుంచి కాంగ్రెస్ తరఫున గెలుపొందగా, 2009లో అద్దంకి నుంచి అదే పార్టీలో బరిలో ఉండి విజయం సాధించారు. 2014లో వైసీపీ తరఫున గెలిచి హ్యాట్రిక్ విజయం నమోదు చేశారు. 2019లో టీడీపీ తరఫున గెలుపొందారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న రవికుమార్ రాబోయే ఎన్నికలలో మరోమారు బరిలో నిలిచారు.

హ్యాట్రిక్‌పై ఏలూరి కన్ను



పర్చూరు ఎమ్మెల్యేగా 2014, 2019లో టీడీపీ తరఫున గెలుపొందిన ఏలూరి సాంబశివరావు 2024లో కూడా బరిలో ఉండనున్నారు. ఈ ఎన్నికల్లో కూడా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమయ్యారు. 2019లో ఎన్టీఆర్ అల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావుపై గెలుపు బావుటా ఎగురవేశారు. మార్టూరు మండలం కోనంకిలో జన్మించిన ఆయన హార్టికల్చర్ విభాగంలో మాస్టర్ డిగ్రీ పొందారు. అనంతరం అదే విభాగంలో ప్రభుత్వ ఉద్యోగిగా కూడా సేవలందించారు. ప్రస్తుతం పర్చూరు ఎమ్మెల్యేగా ఉండడంతో పాటు బాపట్ల లోక్‌సభ టీడీపీ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు.

హ్యాట్రిక్ లక్ష్యంలో అనగాని



రేపల్లె టీడీపీ అభ్యర్థిగా అనగాని సత్యప్రసాద్ నాలుగోసారి బరిలో ఉండనున్నారు. ఆయన బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశారు. 2009లో టీడీపీ తరఫున పోటీ చేసిన ఆయన మోపిదేవి చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత వరుసగా 2014, 2019లలో టీడీపీ తరఫున విజయం సాధించిన ఆయన ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలనే లక్ష్యంతో ఉన్నారు. రాజకీయంగా కుటుంబ నేపథ్యం ఉండడంతో పాటు నియోజకవర్గంలో సేవలందించడంలో తనదైన మార్కు చూపించారు. అంతేకాకుండా టీడీపీ అధినేతతో సన్నిహిత అనుబంధం ఉన్న అతి కొద్దిమందిలో అనగాని ఒక్కడిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

ఎన్నికల బరిలో వేగేశన



బాపట్ల టీడీపీ అభ్యర్థిగా ఖరారైన వేగేశన నరేంద్ర వర్మ.. వ్యాపార రంగంలో విజయం సాధించి వేగేశన ఫౌండేషన్ పేరిట సేవలందిస్తూ రాజకీయ రంగంలోకి అడుగుపెట్టారు. 2009 నుంచి టీడీపీలో క్రియాశీలకంగా ఉంటున్నప్పటికీ తొలిసారి ఆయన ఎమ్మెల్యే అభ్యర్థిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పార్టీకి విధేయుడన్న గుర్తింపే ఆయనకు బాపట్లలో పోటీచేసే అవకాశం వచ్చింది.

బాపట్ల జిల్లా

పర్చూరు	ఏలూరి సాంబశివరావు
బాపట్ల	వేగేశన నరేంద్రవర్మ
వేమూరు	నక్కా ఆనందబాబు
రేపల్లె	అనగాని సత్యప్రసాద్
అద్దంకి	గొట్టిపాటి రవికుమార్

రెండో సారి లోకేశ్..



మంగళగిరి నుంచి యువ నేత నారా లోకేశ్ రెండో పర్యాయం బరిలోకి దిగుతున్నారు. గత ఎన్నికల్లో ఆయన ఇక్కడి నుంచి పోటీ చేసి ఓటమి చెందినా నియోజకవర్గాన్ని వీడకుండా పార్టీ శ్రేణులకు అండగా ఉన్నారు. ఈ ఐదేళ్లలో ప్రతిఒక్కరికీ ఏదో ఒక రూపంలో ఆయన సాయమందిస్తూ వచ్చారు. లాంఛనంగా ఆయన పేరు తాజాగా ప్రకటించినప్పటికీ ఎప్పటి నుంచో ఆయన తన విజయానికి బాటలు వేసుకుంటూ వస్తున్నారు. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి గ్రూపు విభేదాలు మూలంగా గెలుపు అవకాశాల్లేవని, ఆయన్ని తప్పించి గంజి చిరంజీవిని బరిలోకి దించిన విషయం తెలిసిందే. దీంతో ఆళ్ల వైసీపీకి రాజీనామా చేశారు. అయితే ఇక్కడ ఎవరికి టిక్కెట్ ఇచ్చినా ఆళ్ల వ్యతిరేకంగా చేస్తే గెలుపు అసాధ్యమని భావించిన వైసీపీ అధిష్ఠానం తిరిగి ఆయన్ను బుజ్జగించి పార్టీలోకి చేర్చుకున్నది.

నాలుగో సారి శ్రావణ్‌కుమార్



ఎస్సీ నియోజకవర్గమైన తాడికొండ నుంచి మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ నాలుగో సారి రంగంలోకి దిగుతున్నారు. ప్రస్తుతం ఆయన కొత్తగా ఏర్పడిన గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. 2009లో మొదటిసారి ఎన్నికల బరిలోకి దిగిన శ్రావణ్‌కుమార్ డొక్కా మాణిక్యవరప్రసాద్ చేతిలో ఓటమి చెందారు. తిరిగి 2014లో అదే నియోజకవర్గం నుంచి బరిలోకి దిగి విజయం సాధించారు. తుళ్ళూరు ప్రాంతాన్ని రాజధానిగా ప్రకటించటంతో ఆయన రాజధాని ప్రాంత ఎమ్మెల్యేగా కీలక పాత్ర పోషించారు. తిరిగి 2019లో బరిలోకి దిగి ఓటమి పాలయ్యారు. అయినా ఆయన నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులకు అండగా నిలవడమే కాకుండా అమరావతి రైతుల ఉద్యమానికి అండగా నిలిచారు.

ఏడో సారి నరేంద్ర



పొన్నూరు నుంచి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేరును ప్రకటించారు. అదే నియోజకవర్గం నుంచి ఆయన ఏడో పర్యాయం ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ గాలిలో స్వల్ప మెజార్టీతో ఆయన ఓటమి పాలై డబుల్ హ్యాట్రిక్‌ను మిస్ అయ్యారు. ఈ ఐదేళ్ల ఆయన ప్రభుత్వంపై పార్టీ పరంగా పోరాటం చేయటమే కాకుండా వ్యక్తిగతంగా కూడా తాడేపల్లి ప్యాలెస్‌ను ఢీ కొనాల్సి వచ్చింది. దీంతో వ్యక్తిగతంగా కక్ష కట్టి సంగం డెయిరీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఆయన్ను అకారణంగా జైలు పాలు కూడా చేశారు. న్యాయ పోరాటం ద్వారా వైసీపీ ప్రభుత్వాన్ని ఢీ కొనటమే కాకుండా డెయిరీ వారి బారిన పడకుండా నరేంద్ర కాపాడుకున్నారు.

ఐదో సారి నాదెండ్ల



మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు తనయుడైన నాదెండ్ల మనోహర్ జనసేన కోటాలో తెనాలి సీటును దక్కించుకున్నారు. గతంలో మూడు పర్యాయాలు కాంగ్రెస్ తరఫున ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మనోహర్ 2004, 2009లో వరుస విజయాలు చవిచూశారు. స్పీకర్‌గా కూడా పనిచేసే అవకాశం దక్కింది. ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున 2014 లో బరిలోకి దిగి పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత జనసేనలో చేరి 2019 ఎన్నికల్లో ఓడిపోయారు. ప్రస్తుతం ఆ పార్టీ రాజకీయాల వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా కీలకపాత్ర వహిస్తున్నారు. అయితే 2019 ఎన్నికల్లో ఓడిపోయినా నియోజకవర్గాన్నే అంటిపెట్టుకుని ప్రభుత్వంపై అలుపెరగని పోరాటం చేస్తూ జనసేనతో పొత్తును స్వాగతించిన ఆలపాటికి ఈసారి నిరాశ ఎదురైంది.

ప్రత్తిపాడు నుంచి విశ్రాంత ఐఏఎస్



ఎస్సీ నియోజకవర్గమైన ప్రత్తి పాడు నుంచి విశ్రాంత ఐఏఎస్ బూర్ల రామాంజనేయులు పేరును ప్రకటించారు. ఇప్పటికే ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్నారు. గతంలో ఇక్కడి నుంచి పోటీ చేసి పరాజయం చెందిన స్థానికుడైన కందుకూరి వీరయ్యకు ఈ పర్యాయం సీటు ఇవ్వాలని జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నేతలు ప్రయత్నించినా చంద్రబాబు రామాంజనేయులు వైపే మొగ్గారు. కొన్నేళ్ళుగా రాష్ట్ర కార్యాలయంలో ఉండి ఐటీ వింగ్ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న రామాంజనేయులుకు అది ప్లస్ పాయింట్‌గా మారింది. కొందరు ఐఏఎస్‌లకు అవకాశం కల్పించాలన్న చంద్రబాబు నిర్ణయంతో రామాంజనేయులు పేరు ఖరారైంది. ఈయన గతంలో గుంటూరు కలెక్టర్‌గా పనిచేశారు.

జంగా సీటుతో యరపతినేనికి లింకు



గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేరు మొదటి జాబితాలోనే తప్పనిసరిగా ఉంటుందని ఆయన అభిమానులు భావించారు. వైసీపీ ప్రభుత్వంపై పోరాటం చేస్తూ పార్టీ శ్రేణులకు అండగా నిలిచిన యరపతినేనికి సీటు ఖాయమే అయినప్పటికీ కొన్ని కారణాల దృష్ట్యా అధికారికంగా ప్రకటించలేదు. నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా అనీల్ కుమార్ వలస రావడంతో సామాజిక సమీకరణల సమస్య టీడీపీకి ఎదురైంది. నరసరావుపేట పార్లమెంటు పరిధిలో ఏదో ఒక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీసీ అభ్యర్థిని బరిలోకి దించాలని చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్న ఎమ్మెల్సీ జంగాకి తమ పార్టీ తరఫున బరిలోకి దించాలని టీడీపీ ఆలోచన. గతంలో రెండు సార్లు విజయం సాధించిన గురజాలనే ఆయన కోరుకోగా ఇచ్చే అవకాశం లేనందున జంగాకు ప్రత్యామ్నాయం చూసిన తర్వాతే యరపతినేని పేరు ప్రకటించాలని అధిష్ఠానం యోచన చేస్తున్నట్లు సమాచారం.

పెదకూరపాడుపై కసరత్తు

పల్నాడు, గుంటూరు లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ పెండింగ్ స్థానాలపై టీడీపీ కసరత్తు చేస్తోంది. పెదకూరపాడు ఇన్‌చార్జిగా డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ ఉన్నారు. గత ఎన్నికల్లో పరాజయం పాలైనా నియోజకవర్గాన్ని వీడకుండా పార్టీ శ్రేణులకు ఆయన అన్ని విధాలుగా అండగా ఉన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ వీడిన ముఖ్య నేతలు తిరిగి శ్రీధర్ పక్షాన చేరి ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నారు. బయట వారిని తీసుకురావటానికి వీల్లేదని నేతలు, శ్రేణులు ఇటీవల గుంటూరులో సమావేశమై డిమాండ్ చేశారు.



గుంటూరు జిల్లా

మంగళగిరి	నారా లోకేశ్
తాడికొండ	తెనాలి శ్రావణ్‌కుమార్
ప్రత్తిపాడు	బూర్ల రామాంజనేయులు
పొన్నూరు	ధూళిపాళ్ల నరేంద్ర
తెనాలి	నాదెండ్ల మనోహర్



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ నేతలు

తెలుగు జాతి ఆరాధ్య దైవం.. ఎన్టీఆర్

చినగంజాం, ఫిబ్రవరి 24: తెలుగు జాతి ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు అని, సూర్యచంద్రులు ఉన్నంత కాలం ఎన్టీఆర్ పేరు నిలిచి ఉంటుందని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, టీడీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. మండలంలోని సంతరావూరు గ్రామంలో ముద్దన శివరామకృష్ణ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని శనివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పెట్టిన తొమ్మిది మాసాలలోనే అధికారంలోకి వచ్చి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి ప్రజారంజిక పాలన సాగించిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. ప్రజల గుండెల్లో రాముడిగా, కృష్ణుడిగా నిలిచిన ఏకైన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. ఆయన వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని రాష్ట్రాభివృద్ధికి నారా చంద్రబాబు నాయుడు బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జులు వేగేశన నరేంద్రవర్మ, ఎంఎం కొండయ్య, బిఎన్.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గత 50 సం॥లుగా ఆర్థోపెడిక్ వైద్య సేవలు అందిస్తున్న
డా॥ లక్ష్మణస్వామి గారి హాస్పిటల్స్‌లో
అమెరికన్ టెక్నాలజీతో
గుంటూరులో తొలిసారిగా
రోబోటిక్
మోకాళ్ళ మార్పిడి సర్జరీ
రియల్ ఇంటెలిజెన్స్ రోబోటిక్ టెక్నాలజీ


సంజీవి హాస్పిటల్స్
4వ లైను, లక్ష్మీపురం, గుంటూరు.
ఫోన్ : 0863-2241644, సెల్ : 9092 66 55 44

ఎన్నికల బరిలో ఐదోసారి.. గొట్టిపాటి

వరుసగా 4సార్లు విజయం

రెండు సార్లు కాంగ్రెస్, ఒక సారి వైసీపీ, టీడీపీల నుంచి గెలిచిన రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి24: అద్దంకి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన గొట్టిపాటి రవికుమార్ ఇప్పటి వరకు వరుసగా 4 సార్లు విజయం సాధించి 5 వ సారి రంగంలోకి దిగారు. 2004లో మార్టూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తొలుత రాజకీయ ప్రవేశం చేసి పెద్దనాన్న గొట్టిపాటి హనుమంతరావు కుమారుడు నర్సయ్యపై సుమారు 13,800 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. మార్టూరు నియోజకవర్గం రద్దు కావటంతో 2009 లో అద్దంకి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసి అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిపై సుమారు 15,700 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వైఎస్ మరణానంతరం జగన్ వెంట నడిచిన రవికుమార్ 2014లో వైసీపీ తరఫున కరణం బలరామకృష్ణమూర్తి కుమారుడు వెంకటేష్‌పై పోటీ చేసి సుమారు 4 వేల కుపైగా మెజార్టీతో గెలుపొందారు. అనంతరం అధికారపార్టీగా ఉన్న టీడీపీలో చేరారు. 2019 లో టీడీపీ తరఫున పోటీ చేసి బాచిన చెంచుగరటయ్యపై సుమారు 13 వేల మెజార్టీతో గెలుపొందారు. వైసీపీ నుంచి టీడీపీలోకి మారిన ఎమ్మెల్యేలలో రాష్ట్రం మొత్తం మీద 2019 ఎన్నికలలో ఒక్క గొట్టిపాటి రవికుమార్ మాత్రమే విజయం సాధించారు. వైసీపీ అధికారంలో ఉండటంతో గత 5 సంవత్సరాలుగా రవికుమార్‌ను ప్రభుత్వం అన్ని విధాలుగా ఇబ్బంది పెడుతూ ఆర్థిక మూలాల పై దెబ్బకొట్టారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. 2024 ఎన్నికలలో అద్దంకి నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గొట్టిపాటి రవికుమార్‌ను తొలి జాబితాలోనే ప్రకటించారు. వరుసగా నాలుగు సార్లు విజయ ఢంకా మోగించిన గొట్టిపాటి రవికుమార్ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తం గా ఉన్న టీడీపీ అనుకూల పవనాలలో భారీ మెజార్టీ ఖాయం అని టీడీపీ శ్రేణులు ఉత్సాహంతో ఉన్నారు.


గొట్టిపాటి రవికుమార్

టికెట్ ప్రకటనతో టీడీపీ నేతల సంబరాలు

అద్దంకి : సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన కూటమి తరపున అభ్యర్థుల ప్రకటన జరగగా, అద్దంకి నుంచి గొట్టిపాటి రవికుమార్ పేరు ప్రకటించటంతో శనివారం రాత్రి టీడీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక బంగ్లా రోడ్డు లో అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలుగు తమ్ముళ్లు బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, కాకాని అశోక్, కరిముల్లా, బచ్చల వాసు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ బయోడేటా

పేరు :	గొట్టిపాటి రవికుమార్
పుట్టిన తేదీ :	9-11-1973
విద్యార్హతలు:	బీటెక్(డిస్‌కంటిన్యూ)
స్వగ్రామం:	యద్దనపూడి
నివాసం:	చిలకలూరిపేట
తల్లిదండ్రులు:	డాక్టర్ శేషగిరిరావు, జయంతిమాల
భార్య:	ఝాన్సీ
కుమారులు:	హర్షవర్ధన్, మహేష్‌బాబు

మూడోసారి ఎన్నికల బరిలో ఏలూరి

టీడీపీ అభ్యర్థిగా ఖరారు చేసిన అధిష్ఠానం

పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు

పలు చోట్ల బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిన కార్యకర్తలు

పర్చూరు, ఫిబ్రవరి 24: పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు తిరిగి మూడోసారి టిక్కెట్ ఖరారు చేయటంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సంయుక్త ఆధ్వర్యంలో అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఈ ప్రకటనలో పర్చూరు నుంచి తిరిగి ఏలూరికి టిక్కెట్ కేటాయించారు. గత రెండు పర్యాయాలు ఓటమి ఎరుగని నాయకునిగా మంచి గుర్తింపు ఉంది. దీనికి తోడు బాపట్ల పార్లమెంట్ అధ్యక్షునిగా అధినేత అప్పగించిన బాధ్యతలను చాకచక్యంగా నిర్వహిస్తూ అందరినీ కలుపుకుపోయే నాయకునిగా చంద్రబాబు మదిలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. పార్టీశ్రేణులకు అండగా ఉంటూ ముందుకు సాగుతున్నారు. ఇటీవల పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో చంద్రబాబు నిర్వహించిన రా.. కదలి రా సభను విజయవంతం చేయటంలో కీలక భూమిక పోషించారు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓటమి చెంది ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల పక్షాన సమస్యలపై అధికారపక్షంతో అలుపెరగని పోరాటం చేస్తూ రాజకీయంగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. దీనికి తోడు ఓటమి ఎరుగని నాయకునిగా చంద్రబాబు మనస్సులో గుర్తింపు ఉంది. దీంతో మూడోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.


ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ఆరు మండలాల శ్రేణుల్లో ...

మూడోసారి తిరిగి ఏలూరి సాంబశివరావుకు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించటంతో నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థిగా సాంబశివరావు పేరును చంద్రబాబు ప్రకటించడంతో మిఠాయిలు పంచి హ్యాట్రిక్ విజయం అంటూ సంబరాలు జరుపుకున్నారు.

టీడీపీ అభ్యర్థి ఏలూరి సాంబశివరావు బయోడేటా

పేరు:	ఏలూరి సాంబశివరావు
తల్లిదండ్రులు :	ఏలూరి నాగేశ్వరరావు, సుశీలమ్మ
సతీమణి :	మాలతి
కుమారులు:	దివ్యేష్ బాబు, మైనాంక్ తారక్
సామాజిక వర్గం :	కమ్మ
జననం :	జనవరి 26, 1977
స్వగ్రామం :	కోనంకి గ్రామం, మార్టూరు మండలం, బాపట్ల జిల్లా
నివాసం:	3-37ఎ. ఇసుక దర్శి, మార్టూరు మండలం బాపట్ల జిల్లా.
విద్యార్హత :	ఎమ్మెస్సీ హార్టీకల్చర్, అచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

రాజకీయ ప్రవేశం: 2012లో తెలుగుదేశం పార్టీ తరుపున పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరణ

సాధారణ ఎన్నికల్లో 2014లో పర్చూరు నుంచి వైసీపీ అభ్యర్థి గొట్టిపాటి భరత్‌పై విజయం సాధించి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. (10,775 ఓట్ల ఆధిక్యం)

రెండసారి : 2019 సాధారణ ఎన్నికల్లో తిరిగి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేసి దగ్గుబాటి వెంకటేశ్వరరావుపై ఘనవిజయం సాధించి రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. (1647 ఓట్ల ఆధిక్యం)

మూడోసారి 2024 సార్వత్రిక ఎన్నికలకు తిరిగి తెలుగుదేశం అభ్యర్థిగా బరిలో ఉన్నారు.

ఇసుక దందా కనిపించటం లేదా?

● అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రశ్న

అద్దంకి, ఫిబ్రవరి24: జగన్‌రెడ్డి ఇసుక దందా కలెక్టర్‌ల కళ్లకు కనిపించటం లేదా అని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కేంద్ర పర్యావరణ శాఖ నివేదికపై సీఎం జగన్మోహనరెడ్డి ఏం సమాధానం చెబుతారని రవికుమార్ ప్రశ్నించారు. ఇసుక తవ్వకాలలో పెద్ద ఎత్తున ఉల్లంఘనలు జరుగుతున్నాయని, రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ మదింపు సంస్థ గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ఇసుక తవ్వకాలకు కొత్తగా పర్యావరణ అనుమతులు జారీ చేయలేదని స్పష్టం చేసినా వైసీపీ ఇసుకాసురులు అడ్డగోలుగా అక్రమ రవాణా చేస్తున్నారని ఆరోపించారు. ఇసుక అక్రమదందాలో దోచుకున్న సొమ్ముతో వచ్చే ఎన్నికలలో గెలవాలని జగన్మోహనరెడ్డి కుట్రలు పన్నుతున్నారన్నారు. జగన్ అవినీతికి సహకరించిన ప్రతి అధికారి జైలుకు పోవటం ఖాయం అని అన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ పరివాహక గ్రామాలైన తమ్మవరం, అనమనమూరు, మణికేశ్వరం గ్రామాలలో వైసీపీ నేతలు ఇష్టానుసారం ఇసుక తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. తిమ్మాయపాలెం సమీపంలో బ్రిడ్జి పిల్లర్ల వద్ద కూడా ఇసుక తోడేస్తుండటంతో కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. వచ్చే ఎన్నికలలో టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయం అని రవికుమార్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నెరవేరుస్తా

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, ఫిబ్రవరి 24: మూడోసారి పర్చూరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించడానికి అవకాశం కల్పించిన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడికి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లకు టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మె ల్యే ఏలూరి సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరి సాంబశివరావు విలేకరులతో మాట్లాడుతూ పార్టీ ఏ నమ్మకంతో తనపై బాధ్యతలు ఉంచి, తనకు మూడోసారి పర్చూరు నుంచి పోటీ చేయడానికి అవకాశం కల్పించిందో ఆ నమ్మకాన్ని తాను నెరవేరుస్తానన్నారు. పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఐదేళ్లగా సొంత ప్రయోజనాలకోసం అన్ని వ్యవస్థలను వాడుకొని, వాటిని నిర్వీర్యం చేసిన వైసీపీ అరాచక పాలకులను ఇంటికి పంపించవలసిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రభుత్వ పాలనపై గొంతెత్తి ప్రశ్నించే ప్రజా సంఘాలను, ప్రతి పక్ష పార్టీనేతలను భయపెట్టి వారిపై అక్రమ కేసులను నమోదు చేశారన్నారు. లక్షల కోట్ల రూపాయలను అప్పుగా తెచ్చి రాష్ట్ర భవిష్యత్తును తలకిందులు చేశారన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర అభివృద్ధి చంద్ర బాబు, పవన్ కల్యాణ్‌ల ద్వారానే సాధ్యమవుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అద్భుతమైన విజయాన్ని అందిస్తుందని, అందు లో పర్చూరు నియోజకవర్గం ఉంటుందని అన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన కారకర్తలు అందరూ పర్చూరులో భారీ మెజారిటీతో అఖండ విజయం అందించడానికి పూర్తి స్థాయిలో కృషి చేయాలని ఏలూరి పిలుపు నిచ్చారు. అంతకు ముందు ఎన్నికల ప్రచారానికి ప్రచార రథాన్ని కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి హరిబాబు, అడుసుమల్లి వెంకట శ్రీను, మిన్నెకంటి రవి కుమార్, గంజి మణికంఠ, తాటి నాగేశ్వరరావు, అడుసుమల్లి నాగ శ్రీహర్ష, పెంట్యాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


మార్టూరులో పార్టీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న టీడీపీ శ్రేణులు

బాణసంచా కాల్చి సంబరాలు

పర్చూరు నియోజకవర్గంలో మూడోసారి భారీ మెజారిటీతో టీడీపీ బాపట్ల పార్ల మెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును గెలిపించి ఆయనకు హ్యాట్రిక్‌ను బహుమతిగా అందించాలని, రాష్ట్రంలో చంద్రబాబును సీఎంగా మరలా చూడటమే మన లక్ష్యంగా పని చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారంరాత్రి మార్టూరులో టీడీపీ కార్యాలయం వద్ద మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందంతో బాణ సంచా కాల్చారు. స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పలువురు నాయకులు ప్రసంగించారు. ప్రతి కార్యకర్త రెండు లక్ష్యాలతో పని చేయాలన్నారు. భారీ మెజారిటీతో ఏలూరికి హ్యాట్రిక్ సాధించడంతో పాటు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా ప్రతి కార్యకర్త సైనికుల్లాగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తొట్టెంపూడి భుజంగరావు, రావినేని శ్రీనివాసరావు, గొట్టిపాటి వెంకట్రావు, జంపని శ్రీనివాసరావు, పోలూరి సింగయ్య, షేక్ ఫరూక్, కామినేని జనార్దన్, తేలప్రోలు సాంబ శివరావు, కన్నెగంటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా యద్దనపూడిలో పార్టీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు భారీగా బాణ సంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కనపర్తి నాగేశ్వరరావు, వాసు, సతీష్, కొండల రాయుడు, గుదే తారక రామారావు, కోయ సతీష్, వంశీ, రావి పాటి సీతయ్య, నల్లపనేని రంగయ్య చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



వంకాయలపాడులో బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ అనంతరం జరిగిన సభలో మాట్లాడుతున్న దగ్గుమళ్ల ప్రసాదరావు

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి

● దగ్గుమళ్ల ప్రసాదరావు

వంకాయలపాడు(ఇంకొల్లు),ఫిబ్రవరి 24: రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలంలోని వంకాయలపాడు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి దేవతోటి సుందరయ్య అధ్యక్షతన జరిగిన సభలో ప్రసాదరావు మాట్లాడారు. బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ అని అన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌జె.విద్యాసాగర్, దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు నూకతోటి బాబురావు, దేవతోటి నాగార్జున,రాజశేఖర్, డాక్టరు ఐ.బాబురావు, వంకాయలపాటి అంబేడ్కర్ యూత్, పర్చూరు, యద్దనపూడి మండలాల ఎస్సీ అధ్యక్షులు గిరి,కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

చినగంజాం, ఫిబ్రవరి 24 : మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో 26వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో యూబీ.వరప్రసాద్ తెలిపారు.


చెన్నుపల్లిలో మృత్యుంజయ మహదేవ శివ లింగాన్ని ప్రతిష్ఠిస్తున్న వేదపండితులు, దాతలు

అంగరంగ వైభవంగా మహదేవ శివలింగ ప్రతిష్ఠ

● పెద్ద ఎత్తున హాజరైన భక్తులు

బల్లికురవ. ఫిబ్రవరి 24 : మండలంలోని కొండాయపాలెం గ్రామానికి చెందిన దూళిపాళ్ల రామగోవిందు ఆధ్వర్యంలో చెన్నుపల్లి చెరువు వద్ద ఉన్న పొలంలో శనివారం ఉదయం 10 గంటల 16 నిమిషాలకు మృత్యుంజయ మహదేవ శివలింగ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతిష్ఠాచార్యులు కారంచేటి పిచ్చయ్య శాస్త్రి పర్యవేక్షణలో ఈ ప్రతిష్ఠ నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. దాత దూళిపాళ్ల రామగోవిందు శివకుమారి దంపతులచే ఈ కార్యక్రమం జరిపించారు. ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని మహ మంత్రాన్ని వేద పండితులు జపించారు.ఈ ప్రతిష్ఠకు గుంటూరు అమ్మ ట్రస్టు నుంచి వేల మట్టి శివలింగాలకు మహారుద్రాభిషేకం నిర్వహించిన బాబా స్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు జలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా అన్నదానం నిర్వహించారు.


ఆట్ల అభిలాష్‌రెడ్డి


భోగిరెడ్డి భవానీశంకర్


ఆట్ల అశోక్‌రెడ్డి

జాతీయ కబడ్డీ పోటీలకు చినగంజాం క్రీడాకారులు

చినగంజాం, ఫిబ్రవరి 24 :మండలంలోని మున్నంవారిపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు కబడ్డీ క్రీడాకారులు జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ కోచ్ చెరుకూరి పుల్లయ్య శనివారం తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన 33వ సబ్ జూనియర్స్ బాలబాలికల కబడ్డీ పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. కబడ్డీ పోటీలలో ప్రతిభ చూపిన ఆట్ల అశోక్‌రెడ్డి, భోగిరెడ్డి భవానీశంకర్, ఆట్ల అభిలాష్‌రెడ్డిలను ఆంధ్రప్రదేశ్ కబడ్డీ జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. మార్చి 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు బిహార్‌లో జరిగే జాతీయ సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో వీరు రాష్ట్ర కబడ్డీ జట్టులో పాల్గొంటున్నట్లు పుల్లయ్య తెలిపారు. జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వరరావు, కోచ్ పుల్లయ్య, సభ్యులు పూలకం రామచంద్రరావు, తుమ్మలపెంట పద్మారావు, కోటేశ్వరరావు, నంగు శ్రీనివాసరెడ్డి, స్వామిరెడ్డిలు అభినందనలు తెలిపారు.

శింగరకొండలో లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, ఫిబ్రవరి 24: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం లక్ష తమలపాకుల పూజ వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం నిర్వహించారు. అనంతరం 11 ఆవృత్తములు గా వేదపండితులు, అర్చకులు లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. పౌర్ణమి తో పాటు శనివారం కూడా కలిసి రావటంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

కాలిపోయిన నాలుగు సవర్ల బంగారం, రూ. 30 వేల నగదు వైనం

బల్లికురవ. ఫిబ్రవరి 24 : మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శనివారం పూరి గుడిసె దగ్ధం అయింది. ఈప్రమాదంలో ఇంట్లో బీరువా పూర్తిగా కాలిపోయింది. అందులో ఉన్న నాలుగు సవర్ల బంగారు వస్తువులు, రూ. 30 వేల నగదు బూడిద అయ్యాయి. అందిన సమాచారం మేరకు మల్లాయపాలెం గ్రామ కూడలి సమీపంలో ఊయ్యాల కోటేశ్వరరావు అను ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన నిరుపేద కుటుంబం పూరి గుడిసె వేసుకొని జీవనం సాగిస్తోంది. వారు ఇంటికి తాళం వేసి కూలి పనులకు వెళ్లారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు రేగి ఒక్కసారిగా గుడిసెకు అంటుకున్నాయి. వెంటనే పొరుగున ఉన్న గృహాల వారు ప్రమాదాన్ని గమనించి ట్యాంకర్‌తో నీటిని తెప్పించి మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. అప్పటికే పూరిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది. ఇంటి లోపల బీరువాలో కూలి నాలి చేసుకొని దాచుకొన్న నాలుగు సవర్ల బంగారు వస్తువులు, రూ.30 వేల నగదు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాద వార్త తెలియగానే గ్రామ రెవెన్యూ అధికారి రత్నరాజు సంఘటన స్థలానికి చేరి నిరుపేద కుటుంబాన్ని పరామర్శించారు.ప్రమాదంలో తాము కట్టుబట్టలతో మిగిలామని ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది.


బీరువాలో కాలిపోయిన నగదు బంగారు వస్తువులు

విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలి

● ఏపీ రాష్ట్ర పరీక్షల విభాగం డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 24: పదో తరగతి విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా కష్టపడి చదవి పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరీక్షల విభాగం డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసులు అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆ యన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ క్రమంలో పరీక్షలు రాసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం పది విద్యార్థులకు సాయంత్రం తరగతుల సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్థులు, దాతల సహాయంతో అల్పాహారం ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కె. వీరాంజనేయులు, బీసీహెచ్ అంకమ్మరావు, కె. విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.


పది విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న ఏపీ రాష్ట్ర పరీక్షల విభాగం డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసులు

మెరుగైన వైద్యసేవలకు సులువైన మార్గం

- అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బలరాం

చీరాల,ఫిబ్రవరి 24 : పేద, ధనిక తారతమ్యం లేకుండా పాపరాజుతోట తదితర ప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవలు అందేందుకు, సులువైన మార్గంగా నూతన పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉంటుందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు అన్నారు. స్థానిక పాపరాజుతోటలో రూ.120 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు పలువురు కౌన్సిలర్లతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, డీఈ ఏసయ్య, పలువురు కౌన్సిలర్లు, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలరాం, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్ తదితరులు

అభివృద్ధి పనులు వేగవంతం కావాలి

నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం కావాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అధికారులకు సూచించారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో శనివారం ఆయన పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టిన అభివృద్ధి పనుల్లో ప్రధానంగా డ్రైన్లు, ఆర్బీకేలు, సీసీ రోడ్లు, సచివాలయ భవనాలు, తాగునీటి వనరుల పనులు తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఎంపీడీవో శోభారాణి, మున్సిపల్ డీఈ ఏసయ్య, పీఆర్ డీఈ శేషయ్య, డ్రైనేజి డీఈ సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వేణుగోపాలరావు, ఏఈ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చీరాల డీఎస్పీగా బేతపూడి ప్రసాద్



చీరాల,ఫిబ్రవరి 24 : డీఎస్పీల బదిలీలలో భా గంగా ప్రస్తుతం ఇంటెలిజెన్స్‌లో పని చేస్తున్న బేతపూడి ప్రసాద్‌ను చీరాల డీఎస్పీగా బదిలీ చేస్తూ శనివారం డీజీపీ కెవి రాజేంద్రనాద్‌రెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. చీరాల డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్. ప్రసాదరావును ఇంటిలిజెన్స్‌కు బదిలీ చేశారు. బేతపూడి ప్రసాద్ గతంలో చీరాల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. నేడో రేపో ఆయన చీరాల డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

నేడు ఆత్మీయ సమావేశం

పర్చూరు, ఫిబ్రవరి 24: పర్చూరులోని శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో ఆదివారం అసెంబ్లీ నియోజకవర్గస్థాయి ముస్లిం మైనార్టీలఆత్మీయ సమావేశం జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షులు షేక్.షంషుద్దీన్ శనివారం తెలిపారు.

నాగేశ్వరరావు పంతులు మృతి టీడీపీకి తీరనిలోటు

గంగవరం(ఇంకొల్లు),ఫిబ్రవరి 24: మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన టీడీపీ గ్రామమాజీ అధ్యక్షులు, విశ్రాంత ఉపాధ్యాయుడు బోడెంపూడి నాగేశ్వరరావు మృతి పార్టీకి తీరనిలోటు అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు.శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందిన నాగేశ్వరరావు పార్థివదేహాన్ని ఆయన సందర్శించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.తెలుగుదేశం పార్టీ మంచి నాయకుడిని కోల్పోయిందన్నారు. ఆయన అకాల మృతి బాధాకరమన్నారు.ఆయన కుటుంబసభ్యులకు పార్టీ అండగా ఉంటుందన్నారు.

అభ్యర్థిత్వంపై అపోహలు వద్దు

టీడీపీ ఇన్‌చార్జి కొండయ్య

చీరాల,ఫిబ్రవరి 24 : వచ్చే ఎన్నికల్లో చీరాల నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా ఎవరు ఉంటారనే విషయంపై ఎలాంటి అపోహలకు తావులేదు. అధిష్ఠానానికి అన్నీ తెలుసు. సరైన సమయంలో పేరు వెల్లడిస్తారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీకి జనాల్లో పెరుగుతున్న ఆదరణతో కొందరు క్యాడర్‌ను సందిగ్ధంలో పడేసేందుకు ఆడుతున్న మైండ్‌గేమ్‌ను అర్థం చేసుకుంటున్నారన్నారు. భవిష్యత్ టీడీపీదేనన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. సమావేశంలో నాయకులు గంజి పురషోత్తమ్, బొగ్గుల పార్థసారథి, కౌతవరపు జనార్దనరావు, డేటా నాగేశ్వరరావు, ఉసురుపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

వేటపాలెం(చీరాల),ఫిబ్రవరి 24 : మండలంలోని అక్కాయిపాలెం పంచాయతీ పరిధిలోని పొలాల్లో శనివారం రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, ఎస్సై సురేష్‌లు సిబ్బందితో కలసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.42వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

AJ ఆంధ్రజ్యోతి ప్రతిరోజూ క్లాసిఫైడ్స్ - ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

చెదల నివారణ

చెదలు బారి నుండి విలువైన మీ ఇంటిని కాపాడుకోండి. ఈగలు, బొద్దింకలు మొ॥ గ్యారంటీగా నివారించబడును. సంప్ర॥ బాబు, ఒంగోలు, సెల్ : 99854 21321, 97036 45295
AJO-170493

ఇంటి ఋణాలు

రేకుల ఇల్లు / పెంకుల ఇల్లు / స్లాబ్ ఇల్లు / వ్యవసాయ ఋణాలు / ఖాళీ స్థలాలు / OTS పట్టాలు / కడుతున్న ఇల్లు / కట్టిన ఇల్లు / మొ॥ వాటికి తక్కువ వడ్డీకి ఇప్పించబడును. 18సం॥ సర్వీస్ ఇస్తున్నాం. సంప్ర॥ 9502466253
AJO-151034

FLAT FOR SALE

ఒంగోలు కొప్పోలు రోడ్‌లోని డ్రీమ్స్ స్కూల్ వెనుక గల 3 బెడ్‌రూమ్ గ్రూప్ హౌస్ అపార్ట్‌మెంట్ రెడిటూ ఆక్యుపై, సంప్ర॥ అమరా కన్‌స్ట్రక్షన్స్, సెల్: 9440265170, 9164217325
AJO-151222

అమ్మబడును

నెల్లూరు జిల్లా కందుకూరు టౌన్‌లో 30 గదులు (అంకణాలు) కొన్నవారికి 60 అంకణాల కారు పార్కింగ్ ఫ్రీగా ఇవ్వబడును. టౌన్‌లో ఇంటి స్థలం 40 గదులు. గది 75,000 కు కలదు. సంప్ర॥ 9704250705
AJO-183679

PROPERTY FOR SALE

ఇరవై అంకణముల ఇంటి స్థలం అమ్మకం. రెవెన్యూ కాలనీ, కందుకూరు. బలరాం Cont : 9440279283
AJH-01561

రియల్ ఎస్టేట్

గుంటూరు సిటీకి అతి సమీపంలో లాం గ్రామం నందు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దగ్గర సువర్ణ కుటీర్ డెవలపర్స్ వారి 18వ CRDA అప్రూవుడ్ వెంచర్ చ.గ. 11,000 మాత్రమే. బ్యాంకు లోను సదుపాయం కలదు. సంప్ర॥ 88868 55355, 88863 55955
AJG-152149

WANTED STAFF

కాంతి ఐస్‌క్రీమ్స్, ఒంగోలు నందు పని చేయుటకు Boys & Girls కావలెను. Full time & Part time. ఒంగోలు వారు మాత్రమే సంప్రదించగలరు. సెల్: 9247580211
AJO-183703

WANTED

WANTED ONE DATA ENTRY OPERATOR (Ladies Only), to work in Ongole. Graduate / Diploma holders having one year experience, Age below 35, Salary 12,000 P.M / Negotiable, Contact : 8977772106.
AJO-170495

WANTED

సరిపూడి సుజుకి టూవీలర్ షోరూం, ఒంగోలు నందు పనిచేయుటకు ఇంటర్ /డిగ్రీ అర్హత కలిగిన అకౌంటెంట్స్, క్యాషియర్స్ కావలెను. బాధ్యతలను అనుసరించి జీతం కలదు. 5 ఖాళీలు కలవు. సంప్ర॥ 7799960149.
AJG-1279


పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 25 ఫిబ్రవరి 2024



సోమశిలలో 18.399 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, ఫిబ్రవరి 24: సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి జలాశయంలో 18.399 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 550 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.


ఇద్దరు సీనియర్లు ఇద్దరు కొత్తవాళ్లు

టీడీపీ-జనసేన ఉమ్మడి జాబితాలో నలుగురికి చోటు

- నెల్లూరు సిటీ నుంచి నారాయణ, రూరల్ నుంచి శ్రీధర్‌రెడ్డి
- కావలి, ఉదయగిరిలలో కొత్తవారికి అవకాశం
- కావ్య కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్ తొలిసారిగా బరిలోకి..
- మిగిలిన నియోజకవర్గాలపై ఉత్కంఠ

నెల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : అనుకున్నదే జరిగింది. కూర్పు కుదిరింది. తెలుగుదేశం-జనసేన పార్టీల ఉమ్మడి జాబితాలో జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాయి. నెల్లూరు నగరం నుంచి మాజీ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కావలి నుంచి దగుమాటి వెంకట కృష్ణారెడ్డి (కావ్య), ఉదయగిరి నుంచి కాకర్ల సురేష్ ఉమ్మడి పార్టీల అభ్యర్థులుగా బరిలో దిగనున్నారు. నెల్లూరు పార్లమెంట్‌తోపాటు ఆత్మకూరు, కోవూరు, సర్వేపల్లి, కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు రెండవ జాబితాలో అభ్యర్థులను ప్రకటించనున్నారు. తొలి జాబితాలో చోటు సంపాదించుకున్న నలుగురిలో ఒకరు మాజీ మంత్రి, మరొకరు సిటింగ్ ఎమ్మెల్యే కాగా మిగిలిన ఇద్దరు కొత్తవారు. నెల్లూరు సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ గత తెలుగుదేశం ప్రభుత్వంలో శాసన మండలి సభ్యునిగా, మున్సిపల్ శాఖ మంత్రిగా టీడీపీ ప్రభుత్వంలో కీలక నేతగా పనిచేశారు. ఇక నెల్లూరు రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆ నియోజకవర్గం నుంచి రెండవ సారి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. హ్యాట్రిక్ కోసం ఇప్పుడు బరిలో నిలిచారు. కావలి అభ్యర్థి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్‌కు తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

హ్యాట్రిక్ కోసం..



కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి... విద్యార్థి సంఘ నాయకుడిగా రాజకీయాల్లోకి ఆరంగేట్రం చేశారు. ప్రజా సమస్యలపై వరుస పోరాటాలతో నియోజకవర్గ స్థాయి నాయకుడిగా ఎదిగారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. వైసీపీ ఆవిర్భావంతో వైఎస్.జగన్‌వైపు ఆకర్షితుడై ఆ పార్టీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా నెల్లూరు రూరల్ నుంచి 2014, 2019 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు. పార్టీకి ఎంత సేవచేసినా అధినేత వద్ద గుర్తింపు లేకపోవడం, తనపై అనుమానంతో ఫోన్ ట్యాంపింగ్‌కు పాల్పడటం, తనపై ఉన్న కక్షను నియోజకవర్గ ప్రజలపై చూపి, ఏమాత్రం అభివృద్ధి పనులు చేయకపోవడంతో విసిగిపోయిన ఆయన వైసీపీ అధినాయకత్వంపై తిరుగుబాటు చేశారు. రాష్ట్రంలో జగన్‌పై తిరుగుబాటు ప్రకటించిన తొలి వైసీపీ ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. తనపై నమ్మకం లేని పార్టీలో కొనసాగడం ఇష్టంలేక వైసీపీ నుంచి బయటకు వచ్చారు. తెలుగుదేశం ఆహ్వానం మేరకు ఆ పార్టీలో చేరారు. ప్రస్తుతం టీడీపీ-జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి

రెండోసారి బరిలోకి..




ప్రజలకు పరిచయం అక్కర్లేని పేరు పొంగూరు నారాయణ. అధ్యాపక వృత్తి నుంచి జీవితం ప్రారంభించి విద్యాసంస్థ అధినేతగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. తెలుగుదేశం పార్టీతో నారాయణ అనుబంధం కొన్ని దశాబ్దాల కాలం నాటిది. పార్టీ అంతర్గత వ్యవహారాల్లో క్రియాశీలక నాయకుడిగా పనిచేసిన ఆయన 2014లో తొలిసారిగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. టీడీపీ నుంచి శాసన మండలికి ఎన్నికై, మున్సిపల్, అర్బన్ హౌసింగ్ శాఖల మంత్రిగా పని చేశారు. అమరావతి రాజధాని భూసేకరణ, నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. మంత్రి హోదాలో నెల్లూరు నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు. 2019లో తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల్లో నెల్లూరు సిటీ నుంచి బరిలో దిగారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలకు టీడీపీ-జనసేనల ఉమ్మడి అభ్యర్థిగా తొలిజాబితాలోనే చోటు సంపాదించుకున్నారు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తా



తొలిజాబితాలోనే నా పేరు ప్రకటించినందుకు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు చెబుతున్నారు. టీడీపీ - జనసేన కూటమి అధికారంలోకి రాగానే నెల్లూరులో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తా. నిరుపేదలందరికీ సొంతింటి కల నెరవేరుస్తా. 50వ డివిజన్‌లో చాలా మంది స్లమ్‌లోనే జీవిస్తున్నారు. వీరందరి స్థితిగతులు మారుస్తా. అధికారంలోకి రాగానే రోడ్డు మీద వ్యాపారం చేసుకుంటున్న వారందరికీ షాపులు కట్టిస్తా.

- నారాయణ, నెల్లూరు నగర అభ్యర్థి



చంద్రబాబుకు రుణపడిఉంటా



టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను ప్రకటించిన నారా చంద్రబాబు నాయుడుకు జీవితాంతం రుణపడి ఉంటా. ఇందుకు సహకరించిన నారా లోకేష్, పవన్‌కళ్యాణ్, అచ్చెన్నాయుడు, జిల్లా పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, అబ్దుల్ అజీజ్, మనుక్రాంత్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలుపుతున్నా. అందరినీ కలుపుకొని పోయి ఎన్నికల్లో మరోసారి విజయం సాధించి, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయిస్తా.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే

కావలికి కాపుకాస్తా : కావ్య



కావలి టీడీపీ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు పార్టీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్‌తోపాటు అందరికీ ధన్యవాదాలు చెబుతున్నా. అందరినీ కలుపుకుని శ్రమిస్తా. కావలికి కాపు కాసేందుకు ఎప్పుడూ మీ వెన్నంటే ఉంటా. శాంతిభద్రతలను కాపాడుతూ ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తా. పేద బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేస్తా. చివరి ఆయుకట్టుకు నీరందించే విధంగా ప్రణాళికను రూపొందిస్తా. పారిశ్రామిక అభివృద్ధితో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా.

- కావ్య కృష్ణారెడ్డి, కావలి


ఉదయగిరి కోటపై టీడీపీ జెండా ఎగరేస్తా



ఎన్నికల్లో ఉదయగిరి కోటపై తెలుగుదేశం జెండా ఎగరవేస్తా. తొలి జాబితాలోనే నా పేరు ప్రకటించినందుకు చంద్రబాబు, నారా లోకేష్, అచ్చెన్నాయుడులకు కృతజ్ఞతలు చెబుతున్నా. మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుతోపాటు టీడీపీ, జనసేన నాయకులను సమన్వయం చేసుకుని పని చేస్తా. సీనియర్ నాయకుల సూచనలు, సలహాలు పాటిస్తూ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తా. ప్రధానంగా నియోజకవర్గంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చడంతోపాటు వలసల నివారణకు పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు కృషి చేస్తా.

- కాకర్ల సురేష్, ఉదయగిరి

సేవా కార్యక్రమాలతో 'గిరి'లో అడుగు



ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం యర్రంరెడ్డిపల్లి స్వస్థలం. తండ్రి కాకర్ల వెంకట సుబ్బనాయుడు విలేజ్ డెవలప్మెంట్ ఆఫీసర్‌గా పని చేశారు. తండ్రి ఉద్యోగ రీత్యా నెల్లూరు జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో సురేష్ విద్యాభ్యాసం సాగింది. బీటెక్ పట్టభద్రుడైన సురేష్ స్వశక్తితో అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉద్యోగం సంపాదించారు. నార్త్ కరోలినా రాష్ట్రంలో తెలుగు సంఘం (టాటా) అధ్యక్షుడిగా పని చేశారు. అమెరికాలో తెలుగువారి కోసం ఏర్పాటు చేసిన టానాలో టీం స్క్వేర్ విభాగానికి ఛైర్మన్‌గా పనిచేసి వందలాది తెలుగుకుటుంబాలకు సేవలందించారు. మాతృభూమి రుణం తీర్చుకునే క్రమంలో వింజమూరులో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ వైపు ఆకర్షితుడై మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు ద్వారా పార్టీ పెద్దలకు పరిచయం అయ్యారు. సేవా కార్యక్రమాల ద్వారా అతి తక్కువ కాలంలోనే ప్రజల్లో, తెలుగుదేశం పార్టీ పెద్దల్లో గుర్తింపు తెచ్చుకుని ఉదయగిరి టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా టిక్కెట్టు సాధించుకున్నారు.

రైతు కుటుంబం నుంచి..

సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అధ్యాపకుడిగా జీవితాన్ని ఆరంభించారు. స్వశక్తితో వ్యాపారవేత్తగా ఎదిగారు. కావ్య కృష్ణారెడ్డి ట్రస్ట్ పేరుతో సేవా కార్యక్రమాల ద్వారా ఉదయగిరి, కావలి నియోజకవర్గ ప్రజలకు చేరువయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు, విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ, ఉచిత తాగునీటి సరఫరా.. ఇలా పలు సేవా కార్యక్రమాలతో ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. 2019 ఎన్నికల్లో ఉదయగిరి టికెట్టు ఆశించి చివరి నిమిషంలో విఫలమయ్యారు. ఈసారి ఈయన్ను కావలి సీటు వరించింది. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తొలి జాబితాలోనే చోటు దక్కింది.



గరుడుడిపై రంగడి వైభోగం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 24 : మాఘ పౌర్ణమి సందర్భంగా నెల్లూరులో తల్పగిరి రంగనాథుడు స్వర్ణ గరుడుడిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారికి తిరుమంజనం జరిగింది. సాయంత్రం స్వామివారికి బంగారు గరుడసేవ, పేట ఉత్సవం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమాలను ఉభయకర్తలు, ఆలయ ధర్మకర్తల చైర్మన్ శ్రీనివాసులు, ఈవో వెంకటేశ్వర్లు, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.



బస్సును నెట్టుతున్న ప్రయాణికులు

బండికాదు.. జగమొండి!

ఆర్టీసీ ప్రయాణమంటేనే ప్రజలు హడలిపోయే పరిస్థితులు దాపురిస్తున్నారు. ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో నెల్లూరు వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సు స్టార్ట్ కాకపోవడంతో డ్రైవర్, కండక్టర్లు పడ్డ తిప్పలు అన్నీ ఇన్నీ కావు. చివరకు 'బాబు కాస్త చేయి వేసి, నెట్టండి.' అంటూ స్థానికులు, ప్రయాణికులను ప్రాధేయపడాల్సిన దుస్థితి నెలకొంది. బస్సుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ కరువవడంతో ఈ పరిస్థితులు నెలకొన్నాయని ప్రయాణికులు వాపోయారు.

- ఉదయగిరి రూరల్

పెంచలకోనకు పోటెత్తిన భక్తులు

- వైభవంగా మాఘపౌర్ణమి పుష్పయాగం



పెంచలకో నృసింహ స్వామికి పుష్పయాగం

రాపూరు (డక్కిలి), ఫిబ్రవరి 24: మాఘపౌర్ణమి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన నృసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు, వేదపండితులు అనంతరం స్వామిఅమ్మవార్లకు పుష్పయాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం అభిషేకం, స్నపన తిరుమంజనం చేపట్టారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిషనర్ సాగర్‌బాబు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఉభయకర్తలుగా మద్దిశెట్టి చిరంజీవి, దేవసేనలు వ్యవహరించారు.

మాలకొండలో హైకోర్టు న్యాయమూర్తి


వలేటివారిపాలెం, ఫిబ్రవరి 24 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. న్యాయమూర్తి దంపతులకు ఆలయ అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉపఅర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం న్యాయ మూర్తి దంపతులను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రావు మాట్లాడుతూ మాలకొండపై ప్రకృతి సౌందర్యం ఎంతో బాగుందన్నారు.నరసింహస్వామి మహిమ కలిగిన దేవుడని తెలుసుకొని, దర్శనానికి వచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు, కందుకూరు ఉప న్యాయాధికారి విజయ బాబు, ఎస్ఐ బాలమహేంద్రనాయక్, తదితరులు ఉన్నారు.



నరసింహ స్వామి దర్శనానికి వెళ్తున్న హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

2న టీడీపీ అధినేత చంద్రబాబు రాక

- నెల్లూరులో బహిరంగ సభ ఏర్పాటుకు సన్నాహాలు
- బాబు సమక్షంలో పార్టీలో చేరనున్న వీపీఆర్ దంపతులు



నెల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు వచ్చే నెల 2వ తేదీన నెల్లూరుకు రానున్నారు. ఆ రోజున జరిగే బహిరంగ సభలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డిలు టీడీపీలో చేరనున్నారు. వైసీపీ అగ్రనేతల తీరుకు నిరసనగా వేమిరెడ్డి పార్టీ సభ్యత్వానికి, జిల్లా అధ్యక్ష పదవికి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీడీపీ జిల్లా నాయకులు వీపీఆర్‌ను కలిసి తమ పార్టీలోకి ఆహ్వానించడం, అందుకు ఆయన సాను కూలంగా స్పందించిన విషయాలు తెలిసిందే. పార్టీలో చేరిక కార్యక్రమం నెల్లూరు నగరం లోనే ఏర్పాటు చేసుకున్నారు. పార్టీలో చేరిక సందర్భంగా నెల్లూరుకు రావాలని చంద్ర బాబును వీపీఆర్ కోరినట్లు, అందుకు ఆయన సమ్మతించినట్లు పార్టీ వర్గాల సమాచారం. పార్టీలో చేరిక, చంద్రబాబు రాక సందర్భంగా నెల్లూరులో వీపీఆర్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సభా వేదికపై నుంచి వీపీఆర్ దంపతుల తోపాటు ఉమ్మడి నెల్లూరు జిల్లావ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులు, అభిమానులు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు.

నోటిఫికేషన్లన్నీ ఒకేసారి

ఉద్యోగార్థుల్లో అయోమయం
నేడు ఏపీపీఎస్సీ గ్రూపు-2 పరీక్ష



నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 24 : వివిధ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల కావడంతో నిరుద్యోగులకు ఆనందం కలిగించినా ఒకేసారి విడుదల కావడంతో వారిలో అయోమయం నెలకొంది. అయితే ఎన్ని నోటిఫికేషన్‌లు విడుదలైనా ఉద్యోగాలు మాత్రం తక్కువ సంఖ్యలో ఉండటంతో వారు సంబరపడాలో, ఉద్యోగాలు పెద్దగా లేవని బాధపడలో తెలియని పరిస్థితి ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించింది. ఆ తరువాత ఇంత వరకు ఎటువంటి నోటిఫికేషన్లు ఇవ్వలేదు. దీంతో నిరుద్యోగులు అనేకమార్లు నిరసనలు తెలిపారు. ఎమ్మెలేలు, మంత్రులు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. చివరికి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం గ్రూపు-1, 2లతో పాటు డిప్యూటీ డీఈవో, జూనియర్ లెక్చరర్ల భర్తీకి, డీఎస్సీ, టెట్‌కు సైతం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు చాలా తక్కువగా చూపింది. ఉపాధ్యాయ ఉద్యోగాలపై ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులకు ఉద్యోగాల సంఖ్య తక్కువగా ఉండటంతో కొంత నిరుత్సాహంలో ఉన్నారు. గతంలో డీఎస్సీకి దరఖాస్తు చేసుకొంటే సొంత జిల్లాతో పాటు నాన్‌లోకల్‌గా కూడా ఇతర జిల్లాలకు వెళ్లి పరీక్ష రాసుకొనే వీలుండేది. ఈసారి అలాంటి ఆప్షన్ లేదంటున్నారు. ఉద్యోగ పరీక్షలకు వయోపరిమితి పక్క రాష్ట్రం తెలంగాణలో 47 ఏళ్లు ఉంది. మన రాష్ట్రంలో 44 ఏళ్లకే పరిమితం చేశారు. ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు రాయాలనుకున్నా వయస్సు దగ్గరగా ఉన్న అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో మాదిరిగానే ఉద్యోగ నియామక పరీక్ష వయస్సు పెంచాలని కోరుతున్నారు.

నేడు ఏపీపీఎస్సీ గ్రూపు-2 పరీక్ష

జిల్లాలో ఆదివారం ఏపీపీఎస్‌సీ గ్రూపు-2 పరీక్ష జరగనుంది. 23,908 మంది అభ్యర్థులు హాజరయ్యే ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 80 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఈ పరీక్షకు అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. అభ్యర్థుల సందేహాల నివృత్తికి కలెక్టరేట్‌లో 0861-2331261 నెంబరుతో కాల్‌సెంటర్ ఏర్పాటు చేశారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకుని వెళ్లాలి. సెల్‌ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు.

పటిష్ట బందోబస్తు

నెల్లూరు(క్రైం) : గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్షకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ డాక్టర్ కే.తిరుమలేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.15 గంటలు దాటిన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైన అభ్యర్థులను పరీక్షకు అనుమతించరని పేర్కొన్నారు. ప్రతి కేంద్రం వద్ద ఒక ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది బందోబస్తు ఉంటారని తెలిపారు. అదనంగా రక్షక్ మొబైల్, బ్లూ కోల్ట్స్ సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

అభ్యర్థులకు ఆర్టీసీ సహకారం: ఆర్ఎం

గ్రూప్-2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఆర్టీసీ సంస్థ పూర్తి సహకారం అందిస్తుందని ఆర్టీసీ ఆర్ఎం పీవీ శేషయ్య తెలిపారు. బస్సుల పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జిల్లావ్యాప్తంగా పరీక్ష జరిగే కేంద్రాలకు బస్సులు నడిచేలా, ఆ రూట్లలో ఎలాంటి సర్వీసులను రద్దు చేయకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు బస్సులు ఎక్కడ ఆపినా నిలిపాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు.

We are Hiring!
Security Guard
Security Supervisor
Qualification: 10th Pass
Location: GUDURU, AP
Office: AllianceManagement Services, Guduru, Ap
Intrested person should forward their CV to:
customercare.alliancemanagement@gmail.com
Cont: 91483 96357, 62819 73553

కావలి పురపాలక సంఘం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు ప్రకటన
ఆర్.ఓ.సి.నెం.77/2024/ఇ1 తేదీ:24-02-2024
కావలి పురపాలక సంఘము - ఇంజనీరింగ్ విభాగము - పురపాలక సంఘ జనరల్ నిధులు నుండి రూ.205.00 లక్షలతో టెండరు నెం.259 నుండి 263 మరియు 283 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి.
బిడ్ స్వీకరించుటకు చివరి తేది మరియు సమయం: 28-02-2024 సా.గం.5.00ల వరకు
ప్రైజ్ బిడ్ తెరవబడు తేది మరియు సమయం. 29-02-2024. ఉ.గం. 10.00.ల వరకు
మిగతా వివరములు www.apeprocurement.gov.in. నందు సంప్రదించవలెను.
సంప్రదించవలసిన సెల్ నెం.94946 98929
కమీషనరు
కావలి పురపాలక సంఘం

ట్రాఫిక్ సమస్యను పరిష్కారించాలని రాస్తారోకో

ఆత్మకూరు, ఫిబ్రవరి 24: పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో సెంటర్ వరకు నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు పార్టీ పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సందానిలు శనివారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్లెక్సీలు చేతపట్టి పార్టీ కార్యకర్తలతో కలిసి సోమశిల రోడ్డు సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమశిల రోడ్డు సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో సెంటర్ వరకు రోడ్డు విస్తరణ పనులు ఆగిపోవడంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందన్నారు. సమస్యను పరిష్కరించాలని ఇటీవల ఆర్డీవోకు వినతిపత్రం అందజేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. సమస్యను పరిష్కరించే వరకు సీపీఎం ఆధ్వర్యంలో వివిధ రకాలుగా నిరసన చేపడతామన్నారు. రాస్తారోకోతో కొంత సమయం వాహన రాకపోకలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కౌలు రైతు నేత లక్ష్మీపతి, వాగల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి


ఉదయగిరి : మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ


సంగం : సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యాధికారులు

ఉదయగిరి రూరల్: మండలంలో వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వచ్చే నెల 3, 4, 5వ తేదీల్లో జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయ సిబ్బంది సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ, వైద్యా ధికారిణి శివకల్పన ఆదేశించారు. ఈ విషయంపై శనివారం వారు ఉపాధ్యాయ సిబ్బంతో సమావేశమై మాట్లాడారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలియో కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సిబ్బంది బాధ్యతగా పనిచేసి లక్ష్యాలను అధిగ మించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు, హెచ్‌ఈ వెంక టసుబ్బయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన

సంగం: స్థానిక ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో శనివారం వైద్యాధికారులు శ్రీనివాసులరెడ్డి, అశకోక్‌లు క్షేత్రస్థాయి వైద్య సిబ్బందికి పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 3న పల్స్ పోలియో కార్యక్రమంలో మండలంలో అర్హత కలిగిన చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించేందుకు బూత్ స్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. పల్స్ పోలియో చుక్కలు వేసే విధానంపై ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 24: గండిపాళెంలో నూతనంగా నిర్మించనున్న గురప్పస్వామి ఆలయ నిర్మాణానికి శనివారం నిర్వాహకులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు లోకా మురళీధరశాస్త్రి, వెంకటప్రసాద్‌శాస్త్రిలు బుడంగుంట్ల వంశస్తులతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. గణపతి, పుణ్యాహవచనం, కలశ, నవగ్రహ, వాస్తుదోషం పూజలు చేశారు.

టీడీపీ శ్రేణుల సంబరాలు

సీతారామపురం, ఫిబ్రవరి 24: కాకర్ల సురేష్‌కి తెలుగుదేశం అధిష్ఠానం ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఇవ్వడంతో సీతారామపురం కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం ట్రస్ట్ మండల కోఆర్డినేటర్ సుమన్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తిరుపతయ్య, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతం


సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

సంగం, ఫిబ్రవరి 24: మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం స్థానిక సంగమేశ్వరాలయంలో భక్తులు సత్యనారాయణ వ్రతంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గజపూలమాలలతో అలంకరించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో వ్రతం నిర్వహించారు. ఈ వ్రతానికి పలువురు దంపతులతోపాటు మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు కమతం కృష్ణారెడ్డి మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఉదయం ఆలయంలోని శ్రీకామాక్షి దేవి మూలవిరాట్‌కు అభిషేకాలు చేశారు. కార్యక్రమానికి కోటు కరుణాకర్‌రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

గురుకులంలో ప్రవేశానికి గడువు పొడిగింపు

లింగసముద్రం, ఫిబ్రవరి 24: మండలంలోని పెద పవనిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కే స్నేహలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28లోగా విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తెలిపారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

డీఆర్కేకు ఘన నివాళి


దీపాల రాధాకృష్ణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

కావలిటౌన్, ఫిబ్రవరి 24: ప్రముఖ విద్యావేత్త, జేబీ కళాశాల మాజీ కరస్పాండెంట్ దీపాల రాధాకృష్ణమూర్తికి శనివారం పూర్వ విద్యార్థులు ఘననివాళులర్పించారు. రెడ్‌క్రాస్ భవనంలో జరిగిన డీఆర్కే సంతాపసభకు పూర్వ విద్యార్థి డాక్టర్ బెడవాడ రవికుమార్ అధ్యక్షత వహించారు. ముందుగా డీఆర్కే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేబీ మాజీ అధ్యాపకులు డాక్టర్ మల్లికార్జునరెడ్డి, డాక్టర్ మధుసూదన్‌రావు, లైబ్రేరియన్ వెంకట్రావు, జయప్రతాప్ రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల వద్ద తెలుగు యువత ఆందోళన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పూర్తయిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు జగన్ ప్రభుత్వం ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ తెలుగు యువత ఆధ్వర్యంలో శనివారం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి భగత్‌సింగ్ కాలనీలోని టిడ్కో గృహాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి నారాయణ భారీ వ్యయంతో నిరుపేదల కోసం టిడ్కో గృహాలను నిర్మించారని, వాటిని లబ్ధిదారులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు.

వందశాతం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయండి

సీతారామపురం, ఫిబ్రవరి 24: సీతారామపురం బిట్-1 సచివాలయాన్ని శనివారం ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తనిఖీ చేశారు. అనంతరం ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. మండలంలోని ప్రతి సచివాలయ పరిధిలో మిగిలి ఉన్న లబ్ధిదారులకు త్వరగా రిజిస్ట్రేషన్ చేయించాలని, వలంటీర్లతో అలాంటి వారికి సమాచారం తెలియపరచి వందశాతం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, వీఆర్‌ఓ మనోహర్, ఇంజనీర్ అసిస్టెంట్ సుమతి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్

రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయండి

ఉదయగిరి రూరల్: మండలంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లలో నిర్మించకున్న లబ్ధిదారుల పక్కాగృహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం స్థానిక కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షా సమావేశమై మాట్లాడారు. మండలంలో 989 జగనన్న గృహాల రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 843 రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేశామన్నారు. మిగిలిన వాటిని కూడా త్వరగా చేసి నూరు శాతం పూర్తి చేయాలన్నారు. మార్చి చివరికి పూర్తిగా పన్నులు వసూలు చేయాలన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ

ఆత్మకూరు, ఫిబ్రవరి 24: పట్టణంలో శనివారం మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా అధికారులు, సిబ్బందితో కలిసి ఓటుపై అవగాహనకు చైతన్య రాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లెక్సీ చేతపట్టి మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్నికల నోడల్ అధికారులు సతీష్, చంద్రప్రకాష్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, మెప్మా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ షేక్ ఫజులుల్లా తదితరులు

కక్ష సాధింపులు తెలియవు : సుకుమార్‌రెడ్డి

బిట్రగుంట, ఫిబ్రవరి 24: కక్షసాధింపులు, వేధింపులు కుట్రలు చేయడం తనకు తెలియదు కాబట్టే ప్రసన్నుడి కటాక్షంతో వైసీపీ అధిష్ఠానం మళ్లీ తనను పార్టీలో చేర్చుకున్నదని కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ మల్లెవల సుకుమార్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామిని శనివారం ఆయన అభిమానులతో కలసి దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జీవించి ఉన్నతవరకు వైసీపీలోనే కొనసాగుతానని, సీఎం తనకు అప్పగించి బాధ్యతను నెరవేర్చుతానని అన్నారు. త్వరలో జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి భాస్కర్‌రెడ్డిలతో భేటీ కానున్నట్లు తెలిపారు. ఆయన వెంట కావలి,అల్లూరు, బోగోలు మండలాలకు చెందిన అభిమానులు వైసీపీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న సుకుమార్‌రెడ్డి

మన్నెమాల అనుచరుల బైక్ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న మన్నెమాల అనుచరులు

అల్లూరు : వైసీపీ నాయకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి సస్పెన్షన్ ఎత్తేయడంతో ఆయన అనుచరులు సంబరాలు జరుపుకున్నారు. శనివారం ఆయన అనుచరులు అల్లూరు పోలేరమ్మ ఆలయం నుంచి కొండబిట్రగుంట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సుకుమార్‌రెడ్డి బిలకూటక్షేత్రంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో అల్లూరు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సామంతుల సురేష్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, కోడూరు సాదక్‌రెడ్డి, గుమ్మడి సురేంద్ర, నార్తుఆములూరు సర్పంచి షేక్ కరీముల్లాషా ఖాదర్, మేడా మాధవ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు చోరీని అరికట్టండి

● రైతుల ఫిర్యాదు

కలిగిరి, ఫిబ్రవరి 24: సాగులోని పొగాకు తోటల్లో రాత్రిళ్లు పొగాకు చోరీ జరుగుతుందని మండలంలోని వెలగపాడు కొత్తూరు, కావలిముస్తాపురం, పెద్దపాడు, కృష్ణారెడ్డిపాలెం తదితర గ్రామాల రైతులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో అనుమతి పొంది పొగాకు పంటను సాగు చేస్తున్న తమ పొలాల్లో రాత్రివేళల్లో ఆటోలలో వచ్చి దొంగతనంగా పొగాకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. బోర్డు అనుమతి ఉంటే తప్ప పొగాకు అమ్మకాలు, కొనుగోలు చేయరాదన్నారు. తమ పంటలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొగాకు రైతు సంఘ అధ్యక్షుడు రావూరు శ్రీకాంత్‌బాబు, రైతులు నలదల సుధాకర్, వల్లపోలు రామిరెడ్డి, ప్రసాద్, గన్నమనేని కొండపనాయుడు, నంబూరి ప్రవీణ్, వంటేరు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. లక్ష్మీనృసింహుడి కల్యాణం

కావలి రూరల్, ఫిబ్రవరి24: కావలి చెరువు సమీపంలోని కూచి చిన మాలకొండ క్షేత్రంలో శనివారం మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకుడు మాధవరపు మాధవదాసు కుమారుడు మాల్యాద్రిస్వామి ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పచ్చ తోరణాలతో అలంకరించారు. దేవతా మూర్తులను పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహానివేదన, మంత్రపుష్ప పూజలు నిర్వహించారు. మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ జరిగింది.

● **ఆలయాల్లో మాఘపౌర్ణమి వేడుకలు**

కందుకూరు : మాఘపౌర్ణమి సందర్భంగా శనివారం పట్టణంలోని వివిధ ఆలయాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దబజారులోని కోదండరామాలయంలో సామూహిక సత్రనారాయణ స్వామి వ్రతం నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మురారిశెట్టి వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి లక్ష తులసిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గొల్ల వెంకన్న, భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని సాయిబాబా, దక్షిణాముఖ ఆంజనేయస్వామి, సోమేశ్వరాలయం, ఆంజనేయస్వామి ఆలయంలోనూ మాఘపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **వైభవంగా ప్రసన్నుడికి గరుడ సేవ**

బిట్రగుంట : బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్నవేంకటేశ్వర స్వామికి మాసపౌర్ణమి సందర్భంగా శనివారం రాత్రి గరుడ వాహనసేవ జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు అర్చకులు సత్యనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహాచార్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉలవపాడు మండలానికి చెందిన చింతం సురేంద్రరెడ్డి, సీతాలక్ష్మి దంపతులు అన్నదానం ఉభయకర్తలు వ్యవహరించారు.


కావలి రూరల్ : లక్ష్మీనృసింహుడి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కందుకూరు : సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు


గరుడ వాహనంపై ప్రసన్నుడు

రోడ్డు, రవాణా సౌకర్యాలతో గ్రామాల అభివృద్ధి : మహీధర్

లింగసముద్రం, ఫిబ్రవరి 24: రోడ్డు, రవాణా సౌకర్యాలుంటేనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి చెప్పారు.శనివారం మండలంలోని శింగరపాలెం వద్ద పీఎంజీఎస్‌వై కింద రూ.7.77 కోట్లతో నిర్మించనున్న తిమ్మారెడ్డిపాలెం-అయ్యవారిపల్లి రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రోడ్డు, రవాణా సౌకర్యాలు ఉంటేనే ఆ గ్రామాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతాయన్నారు. అలాగే రాళ్లపాడులోని శాగంవారిపాలెం రోడ్డు, చినపవని అన్నెబోయినపల్లి గ్రామాల మధ్య రోడ్ల పనులను త్వరగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, డీఈ టీ రమణయ్య, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ జీ శ్రీచరణ్, ఎంపీడీవో యూ శేషుబాబు, ఎంపీటీసీ దగ్గు వెంకటేశ్వర్లు, సర్పంచు డీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


లింగసముద్రం : రోడ్డు నిర్మాణ పనులకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

● **అదనపు భవనాలతో మెరుగైన వైద్యసేవలు**

కందుకూరు : ఏరియా హాస్పటల్‌లో అందుబాటులోకి వచ్చిన అదనపు భవనాలతో మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి పేర్కొన్నారు. ఏరియా హాస్పటల్‌లో రూ. 7.78 కోట్లతో నిర్మించిన అదనపు భవనాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో పోకూరు, చేవూరులలో అదనంగా పీహెచ్‌సీలు మంజూరుకాగా పోకూరులో కాంట్రాక్టర్లు ముందుకు రానందున పనులు ప్రారంభంకాలేదన్నారు. చేవూరులో త్వరలో పనులు ప్రారంభమవుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, డీసీఎం రమేష్‌నాథ్, ఏరియా హాస్పటల్ సూపరింటెండెంట్ శశికళ, డాక్టరు ఇంద్రాణి, డాక్టరు ఆదిలాభాను, డాక్టరు శైలజ తదితరులు పాల్గొన్నారు.

● **సమస్యల పరిష్కారానికి చర్యలు**

కందుకూరు ఏరియా హాస్పటల్‌లో సాంకేతిక సిబ్బంది కొరత, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని డీసీఎం రమేష్‌నాథ్ పేర్కొన్నారు. డీసీఎం దృష్టికి విలేకరులు పలు సమస్యలు తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

కందుకూరు, కావలి టీడీపీలో పలువురి చేరిక

కందుకూరు, ఫిబ్రవరి 24: మండలంలోని పలుకూరు ఆదిఆంధ్రకాలనీకి చెందిన పలువురు మహిళలు, యువకులు శనివారం టీడీపీలో చేరారు. గ్రామపార్టీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయానికి వచ్చిన మహిళలు, యువకులు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో పార్టీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేయగా, ఆయన వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా పార్టీలో చేరినవారికి ప్రాధాన్యతకల్పిస్తూ అన్నివేళలా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నార్నె రోశయ్య, బొద్దులూరి కొండలరావు, దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, రావుల రవి, యడ్లపల్లి వెంకటనరసింహం, వీ వెంకటరావు పాల్గొన్నారు.


కందుకూరు : ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన వారు

● **విజయనగర్ కాలనీలో బాబు ష్యూరిటీ..**

పట్టణంలోని 32వ వార్డు పరిధిలోని విజయనగర్ కాలనీలో శనివారం సాయంత్రం ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, ముప్పవరపు వేణు, పోకూరి రాంబాబు, అత్తంటి వరప్రసాదు, ఒరుగంటి రామమూర్తి, గొర్రెపోలు కొండలు తదితరులు పాల్గొన్నారు.

● **కావలిలోనూ చేరికలు**

కావలి : పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శనివారం కావ్యక్రిష్ణారెడ్డి నివాసంలో పార్టీలో చేరగా కావ్య వారికి కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. 28వ వార్డుకు చెందిన నాగిశెట్టి జేజినాయుడు, వీఎల్ఎన్ రెడ్డి, బెల్లంకొండ రవి, షేక్ జిలానీ, అళహరి పవన్‌కుమార్, 23వ వార్డు ఇన్‌చార్జి నెల్లూరు వెంకటేశ్వర్‌రెడ్డి, ఆయన బావమరిది వింతా వెంకటేశ్వరరెడ్డి, ఆంధ్ర శ్రీనివాసులు రెడ్డి, 23వ వార్డుకు చెందిన జవంగుల మల్లికార్జున, షేక్ రమీజ్ తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, మొగిలి కల్లయ్య, మన్నవరవిచంద్ర, పోలిశెట్టి, బీద గిరిధర్, ఆవుల రామకృష్ణ, శ్రీహరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

● **ఇసుక దందా కనిపించటం లేదా ?**

జగన్ ఇసుక దందా జిల్లా కలెక్టర్లకు కనిపించటం లేదా అని కావలి టీడీపీ అభ్యర్థి కావ్యక్రిష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావలి నియోజకవర్గంలో కూడా ఇసుక డంప్‌లను ఏర్పాటు చేసుకుని, అందులో సముద్రపు ఇసుకను కలిపి పక్క జిల్లాలకు తరలిస్తున్నా అధికారులకు కనపడటంలేదా అని ప్రశ్నించారు. ఇసుక, గ్రావెల్‌లో దోచుకున్న డబ్బుతో వైసీపీ నేతలు గెలవాలను కునేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు.

శ్రీవారికి ఏకాంతసేవ


శ్రీవారికి నిర్వహించిన ఏకాంతసేవ

కావలిటౌన్, ఫిబ్రవరి24: ముసునూరు మందాటి చెరువు వద్ద ఉన్న శ్రీలక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారికి శనివారం ఉదయం చక్రస్నానం, రాత్రికి ఏకాంత సేవ నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, తోమాల సేవ, అర్చనలు, హోమం, పూజల అనంతరం చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ద్వాదశ ప్రదక్షిణల అనంతరం 12 రకాల ప్రసాదాల నివేదన ఇచ్చారు. రాత్రి శ్రీవారికి ఏకాంత సేవ నిర్వహించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

లింగసముద్రం : మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను సందర్శించి, వాటిలోని సౌకర్యాలను శనివారం తహసీల్దార్ జి శ్రీచరణ్ పరిశీలించారు. మండలంలోని ఎర్రారెడ్డిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, గంగపాలెం, మాలకొండరాయునిపాలెం, విశ్వనాథపురం, వీఆర్ కోట, అన్నెబోయినపల్లి, సత్యనారాయణపురం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. అక్కడున్న విద్యుత్ సౌకర్యం, మంచినీరు, ర్యాంపులు, కాంపౌండ్ వాల్, మరుగు దొడ్లు, బాతురూమ్‌లను పరిశీలించారు.ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

బిట్రగుంట : బోగోలు మండలం కోవూరుపల్లి గిరిజన కాలనీ, కడనూతల గ్రామాల్లో శనివారం కావలి సీడీపీవో సౌజన్య అధ్యక్షతన ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కోటేశ్వరి, సుప్రజ, అనూష, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీ నరసింహుడి సేవలో ఉగ్రనరసింహారెడ్డి


అనుచరులతో దర్శనానికి వచ్చిన ఉగ్రనరసింహారెడ్డి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 24: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తన అనుచరులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉపఅర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర పూజలు చేశారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. స్వామివారి ప్రసాదం అందచేశారు.

● **స్వామివారి ఆదాయం రూ. 7,94,264**

లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 7,94,264 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్‌ల ద్వారా రూ. 6,800, కుంకుమార్చన ద్వారా రూ. 26,160, వివాహాల ద్వారా రూ. 12 వేలు, తలనీలాల ద్వారా రూ. 30,450, వాహనపూజల ద్వారా రూ. 3,220, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 2,13,700. స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 9,80, రూము అద్దెల ద్వారా రూ. 31,880, కవర్ల ద్వారా రూ. 5,100, లడ్డూప్రసాదం ద్వారా రూ. 1,84,410, అన్నదానం ద్వారా రూ. 2,47,561, విరాళాల ద్వారా రూ. 32 వేలు ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు.

టీడీపీ నేతల నివాళి

కావలి రూరల్, ఫిబ్రవరి24: గుండెపోటుతో మృతి చెందిన కావలి మండలం చినరాముడుపాలెంకి చెందిన వాయిల రామ్‌కుమార్(24) మృతదేహాన్ని శనివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి, మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడులు సందర్శించి నివాళులు అర్పించారు. సమాచారం తెలిసిన వెంటనే గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి వెంట నాయకులు ఆవుల రామక్రిష్ణ, సోమయ్యగారి రమణ, కార్యకర్తలు ఉన్నారు.

● **ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇంటూరిని ప్రకటించాలి**

లింగసముద్రం : కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావును ప్రకటించాలని నియోజకవర్గ ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి ముల్లపాటి మహేష్ చౌదరి శనివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో రాజకీయ సమీకరణలో గెలుపు రేసులో ఆయన ముందుంటారని పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం నాగేశ్వరరావుకు టికెట్ ప్రకటించాలని, లేని పక్షంలో నిరాహార దీక్షకు సిద్ధమని తెలిపారు.

దివ్యాంగురాలికి ఫ్యాను అందజేత

కావలి రూరల్ : కావలి మండలం చిన్న రాముడుపాలెంకి చెందిన దివ్యాంగురాలు కాటంగారి రాజేశ్వరికి శనివారం దాత సహకారంతో హ్యాపీ సేవా సంస్థ ఆధ్వర్యంలో టేబుల్ ఫ్యాన్ అందచేశారు. కార్యక్రమం లో సంస్థ అధ్యక్షుడు సయ్యద్ ఘనీబాషా, సభ్యులు చేవూరు ప్రభయ్య, కోడూరు సోమయ్య, కాటంగారి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


రైజ్ కళాశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ రంగనాథ్

నేడు గ్రూపు-2 పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- జిల్లాలో 49 పరీక్షా కేంద్రాలు, 21565 మంది అభ్యర్థులు
- ఒంగోలులో అత్యధికంగా 28 కేంద్రాలు ఏర్పాటు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 24 : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూపు-2 పరీక్షలు ఆదివారం జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. 21,565 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనుండగా అందుకోసం 49 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలను 15 రూట్లుగా విభజించి జిల్లా అధికారులను రూట్ ఆఫీసర్లుగా నియమించారు. పరీక్షలు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరగనున్నాయి. అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఒంగోలులో 28 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, మార్కాపురంలో తొమ్మిది, టంగుటూరులో ఐదు, ఎస్ఎన్‌పాడులో నాలుగు, సింగరాయకొండలో రెండు, చీమకుర్తిలో ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ కోసం తహసీల్దార్లను లైజనింగ్ అధికారులగా నియమించారు. క్వశ్చన్ పేపర్లు తీసుకున్న దగ్గర నుంచి పరీక్ష అనంతరం జవాబు పత్రాలు ఇచ్చేంతవరకు చీఫ్ సూపరింటెండెంట్లకు బాధ్యత అప్పగించారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, సీటింగ్, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ఆయా కేంద్రాలకు వచ్చే అభ్యర్థులు వారి నంబర్లను చూసుకునేందుకు డిస్‌ప్లే బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.

పదవ తరగతికి క్యూఆర్ కోడ్ ప్రశ్నపత్రాలు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 24 : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులకు అత్యంత సాంకేతికతతో కూడుకున్న ప్రశ్నపత్రాలను తయారుచేశారు. ఈ ఏడాది నుంచి ఈ కొత్త క్వశ్చన్ పేపర్లు ఉపయోగిస్తున్నారు. పరీక్షల్లో మాల్‌ప్రాక్టిస్, లీకేజీలను నివారించేందుకు ఈ విధానం దోహదపడుతుంది. ఒకవేళ పేపరు లీకైతే దాని ఖచ్చితమైన మూలాన్ని కనుగొనేందుకు అన్ని పేపర్లకు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ అందించనున్నారు. ఈ క్యూఆర్ కోడ్ ప్రశ్నపత్రంతో అది ఏ జిల్లా, ఏ మండలం, ఏ కేంద్రం, ఏ పరీక్షా హాలుతోపాటు ఖచ్చితమైన విద్యార్థిని నిమిషాల్లో గుర్తించవచ్చు. ఈ క్యూఆర్ కోడ్ ప్రశ్నపత్రాలతో సులభంగా లీకేజిని అరికట్టవచ్చని ప్రభుత్వ పరీక్షల బోర్డు భావిస్తోంది.

విద్యార్థులకు ఉచిత ప్రయాణం

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్లను కండక్టర్లకు చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చు. అదేవిధంగా పరీక్ష ముగిసిన తర్వాత కూడా విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగానే ప్రయాణించి ఇళ్లకు చేరవచ్చు. పరీక్ష సమయానికి ఆర్టీసీ పరీక్షా కేంద్రాలు ఉన్న ప్రాంతాలకు గ్రామాల నుంచి ప్రత్యేక బస్సులను కూడా నడపనుంది.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు


సమావేశానికి హాజరైన స్క్వాడ్ సిబ్బంది.. మాట్లాడుతున్న ఆర్ఐవో

- నిమిషం లేటైనా నో ఎంట్రీ
- నిఘా నేత్రాల నీడలోనే అంతా
- ఆర్ఐఓ ఎ.సైమన్ విక్టర్

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 24 : జిల్లాలో మార్చి 1వతేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎ.సైమన్ విక్టర్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఏకేవీకే కళాశాలలో శనివారం నిర్వహించిన పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెంటెంట్లు, డిపార్ట్‌మెంట్, స్క్వాడ్, ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత నిమిషం లేటుగా వచ్చినా విద్యార్థులను లోపలికి రానివ్వద్దని స్పష్టం చేశారు. కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదన్నారు. కేంద్రాల్లో సెల్‌ఫోన్లు నిషేధమన్నారు. పరీక్షల్లో ఏమైనా పొరపాట్లు జరిగితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

44,733 మంది విద్యార్థులు

ఇంటర్ పరీక్షలకు మొత్తం 44,933 మంది విద్యార్థులు హాజరుకానుండగా 21,570 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు కాగా 23,163 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు అందుబాటులో ఉండేవిధంగా 69 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సైమన్ విక్టర్ తెలిపారు. జిల్లాలో కంభం, పెద్దదోర్నాల, అర్ధవీడు, వైపాలెం, గిద్దలూరులోని పరీక్ష కేంద్రాలను సున్నితమైనవిగా గుర్తించామన్నారు. ఈ ఐదు కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించిన వారందరికి కళాశాలలు హాల్ టికెట్లు జారీచేయాలని ఆయన ఆదేశించారు. ట్యూషన్ ఫీజు చెల్లించలేదనే కారణంతో ఎవరైనా హాల్‌టికెట్లు నిరాకరిస్తే ఆ కళాశాల గుర్తింపు రద్దుచేస్తామని హెచ్చరించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించే విదంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఐఈఓ శ్రీనివాసరావు, డీఈసీ సభ్యులు కే.ఆంజనేయులు, కే.స్వరూపరాణి, జి.మనోహర్‌రెడ్డి, సిహెచ్.తారారాణి తదితరులు పాల్గొన్నారు.

చెరువు స్థలంలో సచివాలయ నిర్మాణం

- కోర్టును ఆశ్రయించిన గ్రామస్థులు
- స్టేతో నిలిచిన పనులు
- దుర్వినియోగమైన నిధులు
- పడమటకట్టకిందపల్లిలో నిర్మించాలని ప్రజల విజ్ఞప్తి


డీవీపల్లిలో పునాది దశలో నిలిచిన సచివాలయ నిర్మాణం

పామూరు, ఫిబ్రవరి 24 : మండలంలోని పడమట కట్టకిందపల్లిలో గ్రామ సచివాలయ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. గ్రామ పంచాయతీ కార్యాలయం ఉన్న పడమట కట్టకిందపల్లిలో సచివాలయం నిర్మించాల్సి ఉండగా, అధికార వైసీపీ నాయకులు తమకు అనుకూలంగా ఉన్న డీవీపల్లిలోని పీడబ్ల్యూడీ స్థలమైన చెరువుతొట్టి ప్రాంతంలో నిర్మించేందుకు ఎమ్మెల్యే సిఫార్సులతో పనులు ప్రారంభించారు. చెరువు ప్రాంతంతో సచివాలయ నిర్మాణ పనులు చేపట్టవద్దంటూ కొందరు గ్రామస్థులు కోర్టును ఆశ్రయించారు. దీంతో నిర్మాణ పనులు పునాది దశలో నిలిచిపోయాయి. అప్పట్లో కాంట్రాక్టర్‌కు రూ.3లక్షల నిధులు మంజూరు చేసింది. సచివాలయ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోర్టు స్టే ఇవ్వడంతో పునాది దశలో పనులు నిలిచిపోయాయి. సిమెంటు, స్టీల్, సామగ్రిని కాంట్రాక్టర్ వేరే పనులకు అమ్ముకున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇదిలావుండగా సచివాలయ నిర్మాణం ఆగిపోవడంతో చాలీచాలని పంచాయతీ భవనంలో ఇబ్బందుల నడుమ కార్యకలాపాలు సాగుతున్నాయి. కట్టకిందపల్లిలో సచివాయ నిర్మాణ జరగకపోగా డీవీపల్లిలో పనులు నిలిచిపోయిన క్రమంలో నిధులు దుర్వినియోగమయ్యాయని గ్రామస్థులు వాపోతున్నారు.

విధేయతకు పట్టం!

- నిరంతర ప్రజా సంబంధాలే గీటురాయి
- కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచారు
- అందరిదీ ఒకే మాట.. ఒకే బాట
- ఏడుగురు అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ
- ముగ్గురు ఎమ్మెల్యేలు, నలుగురు ఇన్‌చార్జిలకు ఓకే
- ఎక్కడా కనిపించని అసంతృప్తులు
- అంతటా భేష్ అంటూ ఉత్సవాలు
- బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్న శ్రేణులు
- రెండో జాబితాలో మిగతా వారికి సీట్లు

తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపికలో పార్టీ పట్ల విధేయత, నిరంతర ప్రజాసంబంధాలే గీటురాయిగా తీసుకుంది. పార్టీ ప్రకటించిన తొలి జాబితాలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని స్థానం పొందిన ఏడుగురు అభ్యర్థులు ఆ కోవకు చెందినవారే. శనివారం ఆ పార్టీ ప్రకటించిన ఏడుగురు అభ్యర్థులపై అంతటా సమ్మతం వ్యక్తమైంది. పార్టీశ్రేణుల్లో కానీ ప్రజల్లో కానీ రాజకీయ పరిశీలకుల్లో కానీ చిన్నపాటి విమర్శలు కూడా లేకపోవటం ఇందుకు తార్కాణం. ముందు నుంచి అందరూ ఊహించినట్లే ఎమ్మెల్యేలు గొట్టిపాటి, ఏలూరి, స్వామిలు అదే స్థానాల నుంచి పోటీచేస్తారని వెల్లడించింది. అలాగే మాజీ ఎమ్మెల్యేలు దామచర్ల, ఉగ్ర, బీఎన్, ఇన్‌చార్జి ఎరిక్షన్‌లకు కూడా తొలి జాబితాలోనే టికెట్లను ఖరారు చేసింది. జనసేనతో ఉన్న పొత్తు, బీజేపీ కూడా కలిసే అవకాశం ఉండటం, ఎంపీ అభ్యర్థుల ఎంపిక ఇంకా ఒక కొలిక్కిరాకపోవటం వలన మరికొన్ని స్థానాల అభ్యర్థులను వెల్లడించలేదు.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

వచ్చే ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే అధికార వైసీపీ ఉమ్మడి జిల్లాలో దాదాపు అన్ని స్థానాలకు ఇన్‌చార్జిల పేరుతో అభ్యర్థులను ఖరారుచేసింది. తెలుగుదేశం పార్టీ ఈ విషయంలో ఎప్పటిలాగే వెనుకబడిపోతుందన్న భావన ఇప్పటివరకు నెలకొంది. అయితే అనూహ్యంగా శనివారం టీడీపీ, జనసేన కూటమి నాయకులు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ఒకేసారి 118మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. అందులో జిల్లాలో టీడీపీ ఏడుగురు అభ్యర్థులను ప్రకటించగా జనసేనకు కేటాయించారనుకుంటున్న దర్శి అభ్యర్థి ఎంపికను పూర్తిచేయలేదు. అయితే ముందు నుంచి అనుకుంటున్న ప్రకారమే టీడీపీలో చురుకైన పాత్ర పోషిస్తున్న వారికి తొలిజాబితాలో అవకాశం లభించింది. ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా ఉన్న స్వామి(కొండపి), రవికుమార్(అద్దంకి), ఏలూరి సాంబశివరావు(పర్చూరు)లకు అక్కడే టికెట్లు కేటాయించింది. అలాగే ఒంగోలు నుంచి దామచర్ల జనార్దన్, కనిగిరి నుంచి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, సంతనూతలపాడుకు బీఎన్.విజయ్‌కుమార్, ఎర్రగొండపాలెంకు ఎరిక్షన్‌బాబులను తన అభ్యర్థులుగా టీడీపీ ప్రకటించింది.

రెండో జాబితాలో మిగతావి..

కాగా ఏడుగురు అభ్యర్థులను తొలిజాబితాలో ఎంపిక చేయటానికి ప్రత్యేక కారణాలు కూడా లేకపోలేదు. ప్రధానంగా పార్టీ కష్టకాలంలో ఉండటంతో పాటు అధికార వైసీపీ నుంచి వ్యక్తిగతమైన ఇబ్బందులు ఎన్ని ఎదురైనా పార్టీ కోసం నిలబడటం, నిరంతరం పార్టీశ్రేణులతోను, ప్రజలతోను కలిసి పయనించటం అనే అంశాలను ప్రాతిపదికగా తీసుకుని తొలిజాబితాలో స్థానం కల్పించినట్లు తెలిసింది. వీరిలో ఎస్ఎన్‌పాడు ఇన్‌చార్జి విజయ్‌కుమార్ విషయంలో ఒకదశలో అధిష్ఠానం వెనుకడుగు వేసింది. ఆయన సోదరుడికి ఏలూరు జిల్లాలో టికెట్ ఇవ్వాల్సి వస్తే ఇద్దరికి ఇవ్వలేమన్న ఉద్దేశంతో పెండింగ్‌లో పెట్టారు. అయితే ఉమ్మడి జిల్లా నేతలు ఈ తరుణంలో విజయ్‌కుమార్‌కు అండగా నిలిచారు. జాబితా ప్రకటనకు ముందు శనివారం బాబు ఇంట్లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రవికుమార్ కూడా విజయ్‌కుమార్ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు తెలిసింది. దీంతో అన్నదమ్ములు అనే విషయాన్ని పక్కనపెట్టి విజయ్‌కుమార్‌కు అవకాశమిచ్చారు. మిగిలిన ఆరుగురి ఎంపికలో ఎలాంటి చర్చలు, సమీక్షలు లేకుండానే చంద్రబాబు ఎంపికచేయటం విశేషం. ఇకపోతే మరో ఐదు నియోజకవర్గాల అభ్యర్థులను మాత్రమే టీడీపీ ప్రకటించాల్సి ఉంది. అందులో ఒక స్థానాన్ని మిత్రపక్షమైన జనసేనకు కేటాయించగా మిగిలిన నాలుగు స్థానాల్లో గిద్దలూరు నుంచి అశోక్‌రెడ్డి పేరు ప్రకటించాలని ముందుగా అనుకున్నప్పటికీ కొన్ని కారణాలతో రెండో జాబితాకు మార్చినట్లు తెలిసింది. కాగా ఏడుగురు అభ్యర్థుల ఎంపికలో పార్టీ పరిగణనలోకి తీసుకున్న అంశాలు ఇలా ఉన్నాయి.

గొట్టిపాటి రవికుమార్



ఇప్పటికి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన రవికుమార్ 2017లో టీడీపీలో చేరారు. ఆయనతో పాటు చేరిన ఎమ్మెల్యేల్లో గత ఎన్నికల్లో గెలుపొందింది ఒక్కరే. ఆ తర్వాత జగన్ ప్రభుత్వం ఆయన మీద తీవ్రంగా దాడిచేసింది. గ్రానైట్ ఫ్యాక్టరీలు, క్వారీలను మూసివేయించింది. వైసీపీలో చేరితేనే చేయూత ఇస్తామని కబురుపంపింది. అయినా బెదరకుండా టీడీపీకి అండగా నిలిచారు. దీంతో ఆర్థికంగా భారీగా నష్టపోయారు. అన్నిటికీ మించి జిల్లాలో పార్టీ నాయకులను ఐక్యంగా ముందుకు నడపటంలో తన వంతు పాత్ర పోషించారు. టీడీపీ కీలక నేతల్లో ఒకరుగా మారారు. యువగళం పాదయాత్రలో అద్దంకి వచ్చిన లోకేష్ రవికుమార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యానాలే అందుకు నిదర్శనం. తదనుగుణంగా ఊహించినట్లే తొలి జాబితాలో తిరిగి టికెట్ పొందారు.

ఏలూరి సాంబశివరావు



గత ఎన్నికల్లో రెండవ పర్యాయం ప్రతిష్ఠాత్మక విజయం సాధించిన సాంబశివరావును లొంగదీసుకునేందుకు జగన్ ప్రభుత్వం అనేకచర్యలకు పాల్పడింది. వ్యాపారపరంగా ఇబ్బందులు పెట్టడమే కాకుండా అక్రమ కేసులను బనాయించింది. పార్టీ కార్యకర్తలను వేధించటంలో అధికారపార్టీ అగ్రభాగంలో నిలిచింది. ఓట్లు తొలగింపుతో అక్రమాలకు పాల్పడింది. వీటన్నింటినీ దీటుగా ఎదుర్కోవటంతోపాటు పార్టీ కష్టకాలంలో బాపట్ల లోక్‌సభ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి అందరినీ సమన్వయంగా ముందుకు నడిపారు. ఇక నియోజకవర్గంలో ప్రజాసంబంధాలు కొనసాగించటంలో ఆయనకు ఆయనే సాటి. అవే కలిసొచ్చాయి.

డీఎస్‌బీవీ స్వామి



కొండపి ఎమ్మెల్యేగా గత ఎన్నికల్లో రెండవసారి గెలుపొందిన స్వామిని నియోజకవర్గంలో తిరగకుండా చేయాలన్న కసితో వైసీపీ ప్రభుత్వం వెంటాడింది. అసెంబ్లీలో సీఎం జగన్ సాక్షిగా వైసీపీ ఎమ్మెల్యేలు దాడి చేసినా బెదరకుండా జగన్ అకృత్యాలపై పోరాటం సాగించారు. ఇంటిపైకి వచ్చి బెదిరించి లొంగదీసుకోవాలని వైసీపీ చేసిన భయానక పరిస్థితులను తట్టుకుని నిలబడ్డారు. ప్రజాసంబంధాల కొనసాగింపులో దిట్టగానే ఉన్నారు. అవే ఆయనకు తిరిగి టికెట్ లభించేందుకు దోహదపడ్డాయి.


ఒంగోలు టీడీపీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకుంటున్న శ్రేణులు

దామచర్ల జనార్దన్



గత ఎన్నికల్లో ఓటమి చెందినా పార్టీ పట్ల, చంద్రబాబు నాయకత్వం పట్ల విధేయుడిగా ఉండటంలో దామచర్ల జనార్దన్ అగ్రభాగంలో ఉన్నారు. గతంలో పార్టీ అధికారంలో లేనప్పుడు కూడా జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలను నిర్వహించి మన్ననలు పొందారు. ఒంగోలులో జగన్‌కు దగ్గరి బంధువైన బలమైన నాయకుడిగా ఉన్న బాలినేనిని ఎదుర్కొనే విషయంలో గట్టిగా నిలబడి అధిష్ఠానం మన్ననలు పొందారు. తదనుగుణంగా ఆయనకు తొలి జాబితాలోనే తిరిగి అధిష్ఠానం టికెట్ ఖరారు చేసింది.

డాక్టరు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి



గత ఎన్నికల సమయంలో చివర్లో పార్టీలో చేర్చుకుని టికెట్ ఇవ్వడంతో పోటీలోకి దిగి ఓడిపోయినా నిరంతరం కనిగిరి ప్రజలను కనిపెట్టుకుని ఉండటం ఉగ్రకు కలిసొచ్చింది. కనిగిరిలో అన్నా క్యాంటీన్ నిర్వహణ, పార్టీ ఆఫీసు నిర్మాణం, దాని నిర్వహణలో చంద్రబాబు, లోకేష్‌ల మన్ననలు పొందారు. ప్రజాసంబంధాలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణలో అనేక సందర్భాలలో అగ్రస్థానంలో నిలిచారు. రాష్ట్రంలో పార్టీ ముఖ్య కార్యక్రమాల నిర్వహణకు కూడా ఉగ్రను కేటాయిస్తూ వచ్చింది. ఆ నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు డాక్టరు ఉగ్ర సమక్షంలో పొలోమని టీడీపీలో చేరటం కూడా ఆయనకు కలిసొచ్చింది.

గూడూరి ఎరిక్షన్‌బాబు



వైసీపీకి పెట్టని కోటగా పేరొందిన వైపాలెం నియోజకవర్గానికి వెళ్లి పనిచేసేందుకు ఎవరూ సిద్ధపడని రోజుల్లో ఎరిక్షన్‌బాబు అక్కడికెళ్లారు. దళితులను టీడీపీ వైపు ఆకర్షించటంలో కీలకపాత్ర పోషించారు. ఇన్‌చార్జిగా నియమించిన తర్వాత ప్రజాసంబంధాలు కొనసాగించటం, పార్టీ కార్యక్రమాల నిర్వహణలో రాష్ట్రంలో తొలి ఐదింటిలో ఒకటిగా ఆ నియోజకవర్గాన్ని నిలిపారు. అదే ఆయన్ను బాబు, లోకేష్‌ల దగ్గర మంచి గుర్తింపుకు కారణమయ్యాయి.

బీఎన్ విజయ్‌కుమార్



ఎస్ఎన్‌పాడు మాజీ ఎమ్మెల్యే జయ్‌కుమార్ నాయకత్వం పట్ల విధేయత, పార్టీపట్ల విశ్వాసంతో పనిచేశారు. గతంలో ఉన్న పరిచయాలతో వైసీపీ నుంచి ఎన్ని ఆహ్వానాలు వచ్చినా తొణకకుండా టీడీపీలో కొనసాగారు. తనను వ్యతిరేకించే పార్టీశ్రేణులను కూడా కలుపుకుపోవటంలో సక్సెస్ అయ్యారు. నియోజకవర్గంలో ఊరూవాడా ప్రజాసంబంధాలను కొనసాగించటం ఆయనకు కలిసొచ్చింది.

అటు ఆగ్రహం.. ఇటు అసహనం..!

- కౌన్సిల్‌లో అంజెండా కాపీలను చించేసిన టీడీపీ కార్పొరేటర్లు
- సీఎం సభలో అవమానించారని వైసీపీ కార్పొరేటర్ల ఆవేదన
- తనకు స్వీపర్ పాస్ ఇచ్చారని వాపోయిన మేయర్


అజెండా కాపీలను చించివేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు
మాట్లాడుతున్న మేయర్ సుజాత

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 24 : ఒక వైపు హడావుడిగా అయిపోయిన పనులకు ఆమోదం తెలపడమేమిటంటూ ప్రతిపక్ష కార్పొరేటర్లు పోడియం చుట్టుముట్టి ఆగ్రహం వ్యక్తం చేయగా, మరోవైపు శుక్రవారం ఎన్.అగ్రహారంలో జరిగిన సీఎం సభలో తమకు ఘోర అవమానం జరిగిందని వైసీపీ కార్పొరేటర్లు వాపోయారు. పలు అభివృద్ధి అంశాలపై మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన నిర్వహించిన కార్పొరేషన్ కౌన్సిల్ అత్యవసర సమావేశం వాడీవేడిగా సాగింది. టెండరు ఖరారు కాకముందే రూ.22 కోట్లు విలువతో చేపట్టిన పనులకు అధికార వైసీపీ కార్పొరేటర్లు ఆమోదం తెలిపారు. ఇప్పటికే కొనసాగుతున్న పనులు ముందస్తు అనుమతులు (ర్యాటిఫికేషన్) పేరుతో హడావుడిగా కౌన్సిల్ అజెండా అంశాలలో పొందుపరిచారు. దీంతోపాటుగా మరి కొన్ని అభివృద్ధి పనులకు ఆమోదం కోసం మొత్తం 26 అంశాలను అజెండాలో పొందుపరచగా, టీడీపీ, జనసేన కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. దీంతో వాడీవేడిగా చర్చ జరగడంతో ప్రతిపక్ష కార్పొరేటర్లు అజెండా కాపీలను చింపివేశారు. మొత్తంగా సమావేశం రసాభాసగా సాగింది. ఇదే సమయంలో శుక్రవారం జరిగిన సీఎం సభకు వెళ్లేందుకు కార్పొరేటర్లుకు ఇచ్చిన అనుమతి పాస్‌లు స్వీపర్లుకు ఇచ్చే డ్యూటీ పాస్‌లు ఇచ్చారని వైసీపీ కార్పొరేటర్ చింతపల్లి గోపితో పాటు ఇతర కార్పొరేటర్లు తమ గోడు వెళ్ళబోసుకున్నారు. ఇది అధికార పార్టీ కార్పొరేటర్లుగా తమకు తీరని అవమానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయాన్ని సమావేశంలో చర్చకు తీసుకురాగా, వైసీపీ కార్పొరేటర్లందరూ తమకు జరిగిన అవమానంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అయితే ఇదే విషయమై మేయర్ మాట్లాడుతూ మీ సంగతి అలా ఉంచితే నగర ప్రథమ మహిళ, మేయర్ అయిన తనకు కూడా స్వీపర్‌కు ఇచ్చే డ్యూటీ పాస్‌నే ఇచ్చారని, తన బాధ ఎవరికి చెప్పుకోవాలని సమావేశంలో వాపోవడం విశేషం.

వైసీపీలో ఆగని జడ్పీ అలజడి

- దర్శికే బూచేపల్లి ప్రాధాన్యత
- అవకాశం కోసం బీసీ, దళితవర్గాల నుంచి ఒత్తిడి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ను మార్చుచేయాలన్న సీఎం నిర్ణయంతో అధికార వైసీపీలో ఆరంభమైన అలజడి కొనసాగుతూనే ఉంది. ఈ విషయంలో బూచేపల్లి కుటుంబీకులు అంతర్మథనంలో ఉండగా ఆ పదవి కోసం బలహీన వర్గాల నుంచి పార్టీపై వత్తిడి పెరిగింది. ప్రస్తుత చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను మార్చి ఆమె స్థానంలో తర్లుపాడు జడ్పీటీసీ వెన్నా ఇందిరను ఎంపికచేయాలని సీఎం జగన్ సూచించిన విషయం తెలిసిందే. శుక్రవారం ఒంగోలు వచ్చిన జగన్ ఈ విషయంపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వటం, హెలిప్యాడ్ వద్ద బూచేపల్లి కలిసి పునఃపరిశీలించాలని కోరటం విదితమే. వెంకాయమ్మ కుమారుడైన శివప్రసాదరెడ్డి దర్శి నుంచి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. దీంతో ఒకే ఇంట్లో రెండు పదవులు వద్దని, ఆమె స్థానంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి సతీమణి ఇందిరను ఎంపిక చేయాలని జగన్ సూచించారు. ఈ ఆకస్మిక నిర్ణయంతో కంగుతిన్న బూచేపల్లి తల్లిని కొనసాగించాలని సీఎంకు విన్నవించారు. అయితే రాష్ట్రంలో నాలుగు జిల్లాలో జడ్పీ చైర్మన్‌గా ఉన్నవారు లేక వారి కుటుంబీకులు అసెంబ్లీ నుంచి రంగంలో ఉండటంతో ఆ నాలుగు జిల్లాలలో జడ్పీ చైర్మన్లను మార్చాలని జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఇదే సంకేతాన్ని శనివారం పార్టీ అధిష్ఠానం బూచేపల్లి కుటుంబానికి పంపినట్లు తెలిసింది. అయితే దర్శికి అత్యంత ప్రాధాన్యతనిచ్చే బూచేపల్లి కుటుంబం అక్కడే పోటీకే మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ఆ మేరకు సీఎంను మరోసారి కలిసి ఎన్నికలయ్యే వరకు తన తల్లిని ఆ పదవిలో కొనసాగించాలని ఆ తర్వాత మీ నిర్ణయాన్ని అమలుచేయాలని కోరాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అయితే రాష్ట్రంలోని మరో మూడు జిల్లాలతో కూడా ఇదే సమస్య ముడిపడి ఉన్నందున బూచేపల్లి ప్రతిపాదనను సీఎం అంగీకరిస్తారా లేదా అనేది వెల్లడి కావాల్సి ఉంది.

ఆశావహుల మధ్య పోటీ

కాగా జడ్పీ చైర్మన్‌ను మార్చాలన్న సీఎం నిర్ణయంతో ఆ పదవిని ఆశించే వారి మధ్య కూడా పోటీ పెరిగింది. ముఖ్యంగా బీసీ, దళిత వర్గానికి చెందిన జడ్పీటీసీలు వెంకాయమ్మను మారిస్తే తమకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానంను కోరుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం జడ్పీ వైస్ చైర్మన్లుగా సింగరాయకొండ జడ్పీటీసీ అయిన బీసీ మహిళ, మార్టూరు జడ్పీటీసీ అయిన దళిత మహిళ ఉన్నారు. వారు కూడా చైర్‌పర్సన్‌ను మారిస్తే తమకే అవకాశం ఇవ్వాలని అధిష్ఠానంను కోరినట్లు సమాచారం. అయితే రాజకీయ కోణంలో పశ్చిమ ప్రాంతానికి అందునా రెడ్డి సామాజికవర్గం వారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించిన జగన్ తన వైఖరిని మార్చుకుంటారో లేదో చూడాల్సి ఉంది. కానీ రాజకీయంగా కీలకమైన సమయంలో జడ్పీ చైర్‌పర్సన్‌ను మార్చాలన్న వ్యవహారం వైసీపీలో తీవ్ర గందరగోళాన్ని సృష్టించిందని చెప్పవచ్చు. అంతేగాక ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి పోటీచేయాలని రంగంలోకి రానున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డికి కూడా ఈ వ్యవహారం తలనొప్పిగా మారినట్లు తెలుస్తోంది.

టీటీడీకి 25 గోవుల విరాళం

అందజేసిన ఎమ్మెల్యే మద్దిశెట్టి


సాహివాల్ గోవుతో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, టీటీడీ చైర్మన్

తిరుమల, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి శనివారం 25 సాహివాల్ గోవులు విరాళంగా అందాయి. దర్శి ఎమ్మెల్యే మద్ది శెట్టి వేణుగోపాల్ గుజరాత్‌కు చెందిన 25 సాహివాల్ జాతి గోవులను తిరుపతిలోని ఎస్వీ గోశాలలో శనివారం అందజేశారు. టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డి, ఈవో ధర్మారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శ్రీవారి నైవేద్యానికి రోజుకు 30 కిలోల నెయ్యి అవసరమవుతుందని, దీని కోసం టీటీడీలో ఉన్న గోవులతోపాటు మరో 500 దేశీయ గోవులు అవసరమవుతాయన్నారు. ఇందులో భాగంగా దర్శి ఎమ్మెల్యే గతంలో 25 గిరి జాతి గోవులను విరా ళంగా అందించినట్టు తెలిపారు. అనంతరం గోవులకు పూజలు నిర్వహించి దాణా అందించారు. తర్వాత ఎమ్మెల్యే వేణుగోపాల్ దంపతులను సత్కరించి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ఎస్వీ గోశాల డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

చెదల నివారణ
చెదలు బారి నుండి విలువైన మీ ఇంటిని కాపాడుకోండి. ఈగలు, బొద్దింకలు మొ॥ గ్యారంటీగా నివారించబడును. సంప్ర॥ బాబు, ఒంగోలు, సెల్ : 99854 21321, 97036 45295
AJO-170493

ఇంటి ఋణాలు
రేకుల ఇల్లు / పెంకుల ఇల్లు / స్లాబ్ ఇల్లు / వ్యవసాయ ఋణాలు / ఖాళీ స్థలాలకు / OTS పట్టాలు / కడుతున్న ఇల్లు / కట్టిన ఇల్లు / మొ॥ వాటికి తక్కువ వడ్డీకి ఇప్పించబడును. 18సం॥ సర్వీస్ ఇస్తున్నాం. సంప్ర॥ 9502466253
AJO-151034

FLAT FOR SALE
ఒంగోలు కొప్పోలు రోడ్‌లోని డ్రీమ్స్ స్కూల్ వెనుక గల 3 బెడ్‌రూమ్ గ్రూప్ హౌస్ అపార్ట్‌మెంట్ రెడీ టూ ఆక్యుపై, సంప్ర॥ అమరా కన్‌స్ట్రక్షన్స్, సెల్: 9440265170, 9164217325
AJO-151222

అమ్మబడును
నెల్లూరు జిల్లా కందుకూరు టౌన్‌లో 30 గదులు (అంకణాలు) కొన్నవారికి 60 అంకణాల కారు పార్కింగ్ ఫ్రీగా ఇవ్వబడును. టౌన్‌లో ఇంటి స్థలం 40 గదులు. గది 75,000 కు కలదు. సంప్ర॥ 9704250705
AJO-183679

PROPERTY FOR SALE
ఇరవై అంకణముల ఇంటి స్థలం అమ్మకం. రెవెన్యూ కాలనీ, కందుకూరు. బలరాం Cont : 9440279283
AJH-01561

రియల్ ఎస్టేట్
గుంటూరు సిటీకి అతి సమీపంలో లాం గ్రామం నందు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దగ్గర సువర్ణ కుటీర్ డెవలపర్స్ వారి 18వ CRDA అప్రూవుడ్ వెంచర్ చ.గ. 11,000 మాత్రమే. బ్యాంకు లోను సదుపాయం కలదు. సంప్ర॥ 88868 55355, 88863 55955
AJG-152149

WANTED STAFF
కాంతి ఐస్‌క్రీమ్స్, ఒంగోలు నందు పని చేయుటకు Boys & Girls కావలెను. Full time & Part time. ఒంగోలు వారు మాత్రమే సంప్రదించగలరు. సెల్: 9247580211
AJO-183703

WANTED
WANTED ONE DATA ENTRY OPERATOR (Ladies Only), to work in Ongole. Graduate / Diploma holders having one year experience, Age below 35, Salary 12,000 P.M / Negotiable, Contact : 8977772106.
AJO-170495

WANTED
సరిపూడి సుజుకి టూవీలర్ షోరూం, ఒంగోలు నందు పనిచేయుటకు ఇంటర్ /డిగ్రీ అర్హత కలిగిన అకౌంటెంట్స్, క్యాషియర్స్ కావలెను. భాధ్యతలను అనుసరించి జీతం కలదు. 5 ఖాళీలు కలవు. సంప్ర॥ 7799960149.
AJG-1279

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, ఉద్యోగ, వ్యాపార, బహిరంగ ప్రకటనలు, అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥
ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358
ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు మరియు పేపరు పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥
Asst-Cir-Manager. 9985411484